శ్రీకాళహస్తీశ్వర శతకము
రూ॥40/-
పేజీలు:48
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
PRAJAPAKSHAM ★
సంపుటి 07, సంచిక: 177 | బుధవారం | 29-05-2024 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 8+8 | వెల రూ. 5.00

### చైర్‌పర్సన్‌ల ఎంపికకు నోటిఫికేషన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లోని మున్సిపాలిటీలలో ఛైర్‌పర్సన్, వైస్‌ఛైర్మన్‌ల ఎన్నిక కోసం ఈనెల 31 ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి.పార్థసారథి నోటిఫికేషన్ జారీ చేశారు. నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మున్సిపల్ ఛైర్‌పర్సన్, రంగారెడ్డి జిల్లా నార్సింగి ఛైర్ పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్, కామారెడ్డి జిల్లా కామారెడ్డి మున్సిపాలిటీ వైస్ ఛైర్‌పర్సన్‌ల ఎన్నికల పాలమండలిల ప్రత్యేక సమావేశం నిర్వహించాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఎన్నిక వాయిదా పడితే మరుసటి రోజు నిర్వహించాలని స్పష్టం చేశారు.

# బిఆర్‌ఎస్ వ్యతిరేకుల ఫోన్లు ట్యాప్

- ప్రతిపక్ష నేతలు, విద్యార్థి నాయకులు, జర్నలిస్టుల ఫోన్లు కూడా...
- జిహెచ్‌ఎంసితో పాటు మూడు ఉప ఎన్నికల సమయంలో ట్యాపింగ్
- ఆర్థికంగా ప్రతిపక్షాలను దెబ్బకొట్టేందుకు టాస్క్‌ఫోర్స్, సైబరాబాద్ ఎస్ఓటి నారాయణ సహకారం
- బిఆర్‌ఎస్ కోసం బలవంతంగా ఎలక్టోరల్ బాండ్స్ కొనిపించిన వైనం
- ఇంటెలిజెన్స్ అదనపు ఎస్‌పి భుజంగరావు వాంగ్మూలంలో సంచలన విషయాలు



ప్రజాపక్షం/హైదరాబాద్

సంచలనం రేపిన ఫోన్‌ట్యాపింగ్ కేసులో మరో కొత్త కోణం వెలుగు లోకి వచ్చింది. బిఆర్‌ఎస్ పార్టీ గెలుపుకోసం ప్రతిపక్ష నేతల ఫోన్‌లను ట్యాపింగ్ చేసిన నిందితులు(పోలీసులు) ఆ పార్టీకి ఎలక్ట్రోరల్ బాండ్స్‌లను రియల్టర్లతో బలవంతంగా కొనిపించారని తెలిసింది. రేవంత్ రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డితో పాటు హైకోర్టు జడ్జితో పాటు అడ్వకేట్ల ఫోన్లను ట్యాప్ చేశారని తెలిసింది. టిఎస్‌పిఎస్‌పి పేపర్ లీక్లో కెటిఆర్‌పై విమర్శలుచేసిన ప్రతిఒక్కరి ఫోన్లను ట్యాప్ చేసినట్లు సమాచారం. ఈ కేసులో అరెస్టై జైలులో ఉన్న ఇంటెలిజెన్స్ అదనపు ఎస్‌పి భుజంగ రావు వాంగ్మూలంలో ఈ విషయాలు వెలుగు చూసినట్లు సమాచారం. అతని వాంగ్మూలంలోని మరిన్ని అంశాలు ఇలా ఉన్నాయి. బిఆర్‌ఎస్ పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన వారి ఫోన్‌లను ఎస్‌ఐబి డిఎస్‌పి ప్రణీత్ రావు సహకారంతో ట్యాప్ చేశాం.ప్రతిపక్ష నేతలు విద్యార్థి నాయకులు, జర్నలిస్టుల ఫోన్లు ట్యాప్ చేశాం. ఎన్నికల్లో ఆర్థికంగా ప్రతిపక్ష పార్టీని దెబ్బకొట్టేందుకు టాస్క్‌ఫోర్స్, సైబరాబాద్ తరువాయి 2లో

ప్రభాకర్‌రావును రాకుండా

## అడ్డుకుంటున్న బిఆర్‌ఎస్ నేతలు

ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్ రావును హైదరాబాద్‌కు రాకుండా బిఆర్‌ఎస్ నాయకులే అడ్డుకుంటున్నారని కాంగ్రెస్ ఎంఎల్‌ఎ యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. ట్యాపింగ్‌లో బిఆర్ ఎస్‌కు చెందిన నాటి మంత్రులు, ఎంఎల్‌ఎలు కూడా ఉన్నారన్నారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్ రావు పోలీసులకు జరిగిన విషయాలు చెబితే ఈ కేసులో పురోగతివస్తుందన్నారు. ఇది తెల్ల చొక్కా వేసుకున్న రాజకీయ నాయకులకు, ఖాకీ బట్టలు వేసుకున్న పోలీసుల నిబద్ధతకు పరీక్షఅని అన్నారు. ఫోన్ ట్యాపింగ్‌లో కెసిఆర్ కుటుంబం బాగోతం ఒక్కొక్కటి బయటికొస్తుందని, బిఆర్‌ఎస్‌కు చెందిన ఎంఎల్‌ఎల ఫోన్లను ట్యాపింగ్ చేశారని ఆరోపించారు. తమ ప్రభుత్వంలో తరువాయి 2లో



మాయమైనవాటి కోసం విచారిస్తే

## ట్యాపింగ్ వ్యవహారం బట్టబయలు

- రాచరిక వ్యవస్థకు తావులేదు
- కరెంట్ విషయాలన్నీ త్వరలోనే బయటపెడతాం
- ఢిల్లీలో మీడియాతో ఇష్టాగోష్టిలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై సిఎం రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అధికారం మారాక జరిగిన బదిలీల్లో కొన్ని ఎస్‌ఐబి కార్యాలయంలో కొన్ని వస్తువులు మాయం అయ్యాయని, అందుకు ఎవరు బాధ్యులో తేల్చే క్రమంలో ఫోన్ ట్యాపింగ్ అంశం బయటకు వచ్చిందని సిఎం వెల్లడించారు. ఈ కేసులో పోలీసులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చామని, అన్నింటికీ సిబిఐ అనే మాజీ మంత్రులు కెటిఆర్, హరీశ్‌రావులు ట్యాపింగ్ కేసుపై మాత్రం సిబిఐ విచారణను ఎందుకు అడగడం లేదని సిఎం ప్రశ్నించారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ భవన్‌లో మంగళవారం తరువాయి 2లో

# సాక్ష్యాలు మార్చేస్తారు



### ఎమ్మెల్సీ కవిత బెయిల్‌ను వ్యతిరేకించిన సిబిఐ, ఇడి




న్యూఢిల్లీ : ఢిల్లీ మద్యం అవినీతి కేసులో తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు కుమార్తె కె.కవితకు బెయిలు ఇచ్చే విషయంపై ఢిల్లీ హైకోర్టు తన ఉత్తర్వు జారీ చేయకుండా వాయిదా వేసింది. ఐతే ఆమెకు బెయిలు ఇచ్చేందుకు సిబిఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశాయి. సాక్ష్యలను ప్రభావితం చేయడానికి తగినన్ని శక్తిసామర్థ్యాలు ఆమెకు ఉన్నాయనీ, అందువల్ల ఆమె బాహ్య ప్రపంచంలోకి వెళితే సాక్ష్యాలను తారు మారు చేసే ప్రమాదం ఉన్నదనీ కేంద్ర దర్యాప్తు సంస్థలు రెండూ ఢిల్లీ హైకోర్టుకు మంగళవారం నాడు లిఖితపూర్వకంగా తెలియజేశాయి. నిందితురాలు ఎంతో పలుకుబడిగల రాజకీయ నాయకురాలైనందువల్ల సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని తెలియజేశాయి. ఐతే కవిత తరపు న్యాయవాది ఈ పిటిషన్‌ను తీవ్రంగా వ్యతిరేకించారు. కవిత ఒక మహిళ ఐనందువల్ల ఆమెను బెయిలుపై విడుదల చేయాలనీ, ఈ ఎక్సైజు అవినీతి వెనుక కుట్రలో ఆమె కీలకపాత్ర వహించిందని దర్యాప్తుసంస్థలు భావిస్తున్నాయనీ, ఒక క్రియాశీల రాజకీయ నాయకురాలుగా, తెలంగాణ శాసనమండలి సభ్యురాలుగా ఉన్నందువల్ల ఆమె సమాజానికి హానిచేసే అవకాశం లేదని కవిత తరపు న్యాయవాది పేర్కొన్నారు. దీంతో ఇరుపక్షాల వాదనలూ విన్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ స్వర్ణకాంత శర్మ ఉత్తర్వు జారీ చేయకుండా నిర్ణయాన్ని వాయిదా వేశారు. ఎక్సైజు అవినీతి కేసులో కవిత పెద్ద లబ్ధిదారుగా ఉన్నారనీ, ఆమ్ ఆద్మీపార్టీ ప్రభుత్వానికి ముడుపులు సమర్పించడంలో సహభాగస్వామిగా కీలకపాత్ర వహించారనీ సిబిఐ, ఇడి దృఢంగా విశ్వసిస్తున్నాయి. ఆమెను విడుదల చేస్తే తీవ్ర నష్టం జరుగుతుందనీ, తదుపరి దర్యాప్తునకు చాలా లోతైన విఘాతం కలుగుతుందనీ పేర్కొన్నాయి. హవాలా మార్గంలో కవిత ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులకు రూ.100 కోట్లు ముడుపులు సమర్పించారన్న ఆరోపణలపై ఆమెను సిబిఐ, ఇడి వేరు వేరుగా అరెస్టు చేశాయి. మెస్సర్స్ ఇండో స్పిరిట్స్ ద్వారా ఆమె తరపు వ్యక్తి రూ.192.80 కోట్లు ఇచ్చేందుకు కథ నడిపారని ఆరోపణ. ఈ రూ.292.80 కోట్ల అవినీతి చర్య పూర్తి చేసేందుకు వివిధ ప్రక్రియల్లో కవిత భాగస్వామ్యం వహించారని దర్యాప్తు సంస్థలు కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేశాయి. మే 6వ తేదీన కవిత ట్రయల్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వును సవాలు చేశారు. సిబిఐ, ఇడి తనపై చేసిన ఆరోపణలను, పెట్టిన కేసును కొట్టివేయాలని ఆమె తన దరఖాస్తులో కోరారు. కవితతోపాటు సహ నిందితుడుగా ఉన్న అరుణ్ రామచంద్ర పిళ్ళైని కూడా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ విచారణ చేసింది. ఈ మేరకు ఇ డి తన అఫిడవిట్‌లో మరింత వివరణ ఇస్తూ, ఇండో స్పిరిట్ తరపున పిళ్ళై ప్రాతినిధ్యం వహించాడనీ, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులకు, ఆమెకు మధ్య ఒక అవగాహన కుదిర్చాడనీ, చేసిన మేలుకు బదులుగా రూ.100 కోట్లు ఢిల్లీ రాష్ట్ర పాలకుల చేతులకు తరువాయి 2లో




అదానీ, అంబానీలకు

## సాయం చేసేందుకే...

మోదీ పరమాత్మ వ్యాఖ్యలపై రాహుల్‌గాంధీ ఎద్దేవా

**బాన్స్‌గాన్/న్యూఢిల్లీ :** 'ఇండియా' కూటమి ప్రభుత్వం 50 శాతంగా ఉన్న రిజర్వేషన్ల పరిమితిని ఎత్తివేస్తుందని కాంగ్రెస్ జాతీయ నేత రాహుల్‌గాంధీ స్పష్టం చేశారు. రాజ్యాంగాన్ని పరిరక్షిస్తుందని పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని బాన్స్‌గాన్‌లో మంగళవారం నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో సమాజ్‌వాది పార్టీ చీఫ్ తరువాయి 8లో



ఆర్‌టిఎ కార్యాలయాల్లో

## ఎసిబి ఆకస్మిక దాడులు

రూ.2.70 లక్షల నగదు స్వాధీనం

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలోని రవాణా శాఖ (ఆర్‌టిఎ) కార్యాలయాల్లో అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) అధికారులు మంగళవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో రూ.2,70,720 నగదు పట్టుబడినట్లు ఎసిబి డిజిపి సి.వి.ఆనంద్ తరువాయి 2లో

# బ్లాక్ మార్కెట్‌కు పత్తి విత్తనం



- పలు కంపెనీల విత్తనాలకు డిమాండ్
- ధరలు పెంచి విక్రయిస్తున్న వ్యాపారులు
- చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి

పత్తి విత్తన విక్రయాల్లో బ్లాక్ దందా నడుస్తోంది. ఫర్టిలైజర్ వ్యాపారులు డిమాండ్ ఉన్న విత్తనాలను బ్లాక్ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. రూ.840 ఉన్న ప్యాకెట్‌ను రూ.2500లకు విక్రహిస్తున్నా అధికారులు పట్టించుకోని పరిస్థితి. విత్తన అమ్మకాల అక్రమాలపై పోలీస్, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులతో కమిటీ వేసినా ఇప్పటికి ఎక్కడా తనిఖీలు లేవు. దీనితో ఫర్టిలైజర్ వ్యాపారులు అదును చూసి రైతుల నుండి అదనంగా ముక్కుపిండి డబ్బులు వసూలు చేస్తున్నారు.

**ఇష్టారాజ్యంగా విక్రయాలు**

గతేడాది పత్తి పంట నష్టాలు మిగిల్చినప్పటికి రైతులు ప్రత్యామ్నాయం లేకపోవడంతో ఈ ఏడాది కూడా పత్తి సాగుపైనే దృష్టి పెట్టారు. ముందస్తు వర్షాలు కురవడంతో భూమి చదును చేసి విత్తనాలు నాటుతున్నారు. ఇప్పటికే 20 శాతానికి పైగా విత్తనాలు నాటారు. అయితే ప్రతి ఏడాది సాగుకు సరిపడా విత్తనాలతో పాటు అదనంగా 25 శాతం విత్తనాలు రైతులు అందుబాటులో ఉంచేవారు. ఈ ఏడాది విత్తనాలు తక్కువగా వచ్చాయని ఫర్టిలైజర్ వ్యాపారులు ప్రచారం చేయడంతో రైతులు ఎగబడి కొనుగోలు చేస్తున్నారు. అన్ని ఫర్టిలైజర్ షాపుల్లో విత్తనాలు అందుబాటులో రైతులు కొనుగోలు చేస్తున్నారు. అయితే ఏఏ విత్తనాలు ఉపయోగకరంగా ఉంటాయన్న సమాచారాన్ని ఇప్పటికీ వ్యవసాయ శాఖ ఇవ్వలేదు. కనీసం రైతు శిక్షణ సభలు కూడా ఏర్పాటు చేయలేదు. దీనితో రైతుల్లో కొందరు కొత్త కంపెనీల విత్తనాలు కొనుగోలు చేస్తుండగా కొందరు పాత కంపెనీల విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు.

**పలు రకాల విత్తనాలకు అదనపు వసూళ్లు**

మార్కెట్‌లో అనేక రకాల విత్తనాలు ఉన్నప్పటికీ 7067, వేద, సాంకేత్ తరువాయి 8లో

# ఈశాన్యం అతలాకుతలం



- మిజోరం, అసోం, మేఘాలయలో భారీ వర్షాలు
- మిజోరంలో స్టోన్ క్వారీ కూలిన ఘటనలో 17 మంది మృతి
- ఐజ్వాల్‌కు తెగిపోయిన సంబంధాలు

ఐజ్వాల్/గువహటి/తిరువనంతపురం

'రెమల్' తుఫాన్ ఈశాన్య రాష్ట్రాలపై తీవ్ర ప్రభావం చూపింది. తుఫాన్ కారణంగా మిజోరం, అసోం, మేఘాలయలో భారీ వర్షాలు కురిశాయి. మూడు రాష్ట్రాల్లో కలిపి మొత్తంగా 24 మంది మృత్యువాత పడ్డారు. మరోవైపు దక్షిణాది రాష్ట్రమైన కేరళలో కూడా అకాల వర్షాలు కురుస్తున్నాయి. జనజీవనం అస్తవ్యస్తమైంది. కాగా, అకాల వర్షాల కారణంగా మిజోరాం ఐజ్వాల్ జిల్లాలో మంగళవారం ఉదయం స్టోన్ క్వారీ కుప్పకూలింది. ఈ ఘటనలో 17 మంది మృతి చెందారు. మృతుల్లో ఇద్దరు మైనర్లు ఉన్నారు. మరో ఏడుగురు గల్లంతైనట్లు అధికారులు చెప్పారు. అదే విధంగా రాష్ట్ర రాజధానిలోని ఇతర ప్రాంతాల్లో కొండ చరియలు విరిగిపడనం ఘటనల్లో పలువురు గల్లంతయ్యారు. వరదల కారణంగా దేశంలోని ఇతర ప్రాంతాలంతో ఐజ్వాల్‌కు సంబంధాలు తెగిపోయాయి. మిజోరాం రాజధాని అయిజోల్ శివారు ప్రాంతంలో భారీ వర్షానికి స్టోన్ క్వారీ కూలిపోవడంతో 17 మంది మృతి చెందగా, ఆరు నుంచి ఏడుగురు గల్లంతైనట్లు మిజోరం డిజిపి అనిల్ శుక్లా తెలిపారు. ఘటనాస్థలి నుంచి 17 మంది మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోందని, భారీ వర్షాల కారణంగా సహాయక చర్యలకు తీవ్రం ఆటంకం కలుగుతుందని చెప్పారు. ఇద్దరు తరువాయి 2లో



అంతర్రాష్ట్ర చిన్నారుల విక్రయ

## ముఠా గుట్టు రట్టు

ప్రజాపక్షం/మల్కాజిగిరి

హైదరాబాద్ నగర శివారు ప్రాంతం కేంద్రంగా వివిధ రాష్ట్రాల నుండి చిన్నారులను తరలించి లక్షల రూపాయలకు పలువురికి విక్రయిస్తున్న అంతర్రాష్ట్ర ముఠా రాకెట్ గుట్టు రట్టయింది. రాచకొండ కమిషనరేట్ పరిధిలోని మేడిపల్లి పోలీసులు అరెస్టు చేశారు. నాలుగు రోజుల క్రితం ఫిర్జాదిగూడ ప్రాంతంలో నడుస్తున్న ప్రథమ చికిత్సా కేంద్రం మాటున ఆర్ఎంపి తరువాయి 2లో

# పంజాబ్‌లో చతుర్ముఖ పోటీ

- ఆప్ పరిపాలనకు అగ్నిపరీక్ష
- రైతుల మద్దతుపై కాంగ్రెస్ ఆశలు
- కోల్పోయిన సిక్కుల ఓట్లను తిరిగి పొందేందుకు అకాలీదళ్ తంటాలు
- సిక్కులు, దళితుల ఓటు బ్యాంకుపై బిజెపి కన్ను




**ఢిల్లీ:** పంజాబ్ లోక్‌సభ ఎన్నికల్లో అధికార ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ప్రజాదరణకు పరీక్షగా నిలవనుంది. అక్కడ చతర్ముఖ పోటీ నెలకొన్నప్పటికీ 2022 శాసన సభ ఎన్నికల్లో భారీ మెజారిటీతో అధికారంలోకి వచ్చిన ఆప్ ఆదరణ ఎంత వరకు కొనసాగుతుందో ప్రస్తుత లోక్‌సభ ఎన్నికలు తేల్చనున్నాయి. ఇండియా కూటమిలో భాగస్వామ్య పక్షాలుగా ఉన్న ఆప్, కాంగ్రెస్ పార్టీలు ఢిల్లీలో సీట్ల సర్దుబాటు చేసుకున్నప్పటికీ పంజాబ్‌లో మాత్రం ప్రత్యర్థులుగా పోటీ పడుతున్నాయి. 1996 నుండి 2020 వరకు ఎన్‌డిఎ భాగస్వామ్య పక్షాలుగా ఉన్న శిరోమణి అకాలీదళ్, బిజెపిలు ఈసారి విడివిడిగా పోటీ చేస్తున్నాయి. బిఎస్‌పి తొలిసారిగా రాష్ట్రంలోని అన్ని సీట్లలో పోటీ చేస్తుంది. అతివాద పార్టీగా పేరున్న సిమ్రన్‌జీత్ సింగ్ మాన్ నేతృత్వంలోని శిరోమణి అకాలీదళ్(అమృత్‌సర్) కూడా ఈసారి బరిలో ఉంది. పంజాబ్‌లోని మొత్తం 13 స్థానాలకు జూన్ 1న ఎన్నికలు జరగనున్నాయి. గత లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, శిరోమణి అకాలీదళ్ తరువాయి 2లో



## ప్రజాభవన్‌కు బాంబు బెదిరింపు

ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నివాసంలో డాగ్ స్క్వాడ్ తనిఖీలు

ప్రజాపక్షం/హైదరాబాద్

బేగంపేట్‌లోని ప్రజాభవన్‌కు బాంబు బెదిరింపు కాల్స్ రావడంతో డాగ్‌స్క్వాడ్ బృందాలు తనిఖీ చేశాయి. ఎలాంటి బాంబు ఆనవాళ్లు కనిపించకపోవడంతో పోలీసులు తరువాయి 2లో

## దక్షిణాఫ్రికాలో నేడే ఎన్నికలు




**జోహన్నెస్‌బర్గ్ :** దక్షిణాఫ్రికా పార్లమెంటుకు బుధవారంనాడు సార్వత్రిక ఎన్నికలు జరుగుతాయి. ఈ ఎన్నికల ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. దేశవ్యాప్తంగా 23,292 పోలింగ్ కేంద్రాలను ఉదయం ఏడు గంటల నుండి రాత్రి తొమ్మిది గంటలవరకూ ఓటింగ్‌ప్రక్రియ కోస సిద్ధం చేసినట్లు దక్షిణాఫ్రికా ఎన్నికల సంఘం ప్రకటించింది. దిగువసభ నేషనల్ అసెంబ్లీకి, రాష్ట్రాలలో కూడా ఒకేసారి ఎన్నికలు జరుగుతున్నాయి. దక్షిణాఫ్రికాలో తిరుగులేని అధికారం చెలాయిస్తున్న ఆఫ్రికా నేషనల్ కాంగ్రెస్‌పార్టీ తరపున దేశాధ్యక్షుడు రామఫోసా కమ్యూనిస్టుపార్టీ మద్దతుతో తిరిగి ఎన్నికల్లో పోటీ పడుతున్నారు. ఐతే ముందస్తు ఎన్నికల సర్వేలు ఆఫ్రికా నేషనల్ కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నివేదికలు ఇవ్వడంతో ఈసారి ఫలితాలపై చాలా ఉత్కంఠ ఏర్పడింది. దిగువసభ జాతీయ అసెంబ్లీలో 200 స్థానాలు ఉండగా, వివిధ రాష్ట్రాలలో జనాభా ప్రాతిపదికపై సీట్లు ఖరారు అవుతాయి. 70 రాజకీయపార్టీలు, 11 మంది ఇండిపెండెంట్లు సహా మొత్తం 14,889 మంది అభ్యర్థులు జాతీయ అసెంబ్లీకి పోటీ పడుతున్నారు. విదేశాలలో ఉండే రిజిస్టర్డ్ ఓటర్లు ఈనెల 17,18 తేదీల్లో ఓటు హక్కు ఉపయోగించుకున్నారు. దేశంలో 27,28 తేదీల్లో గర్భిణీలు, దివ్యాంగులు ఓటుహక్కు వినియోగిచుకున్నారు. దేశంలో 18 ఏళ్ళు ఆ పైబడిన యువ ఓటర్ల సంఖ్య ఈసారి 27.79 లక్షలకు చేరుకుంది.

## పపువా న్యూగినియాపై సానుభూతి

### సురక్షిత ప్రాంతాలకు 8 వేలమంది తరలింపు

**పోర్ట్ మోరెస్బై :** ఈ శతాబ్ది దారుణ ప్రకృతి విలయంతో ఆకస్మికంగా వార్త



ల్లోకి వచ్చిన పపునా న్యూగినియా దేశంలో ఏర్పడిన జాతీయ విషాదాన్ని పరిష్కరించేందుకు పలు దేశాల సానుభూతి వెల్లువెత్తుతున్నది. ఈ పూర్వరంగంలో తాజాగా రెడ్‌క్రాస్ సొసైటీ రంగంలోకి దిగింది. భారీ క్రేన్లు కూడా ఆ దేశానికి తరలిస్తున్నారు. కొండచరియలు విరిగిపడి 2,000 మంది సజీవ సమాధైపోవడంతో భారత్, చైనా సహా అనేక దేశాలు సహాయక చర్యలు చేపట్టేందుకు, ఆర్థిక సహాయం చేసేందుకు ముందుకు వచ్చాయి. తాజాగా ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాలు 2.5 మిలియన్ డాలర్లు ఆర్థిక సహాయాన్ని పపువా న్యూగినియా దేశానికి ప్రకటించాయి. ఓసియానా (ఆస్ట్రేలియా, మెలనేసియా, మైక్రోనేసియా, పోలీనేసియా) ఖండ ప్రాంతంలో అంతర్భాగంగా ఉన్న పపువా న్యూగినియాలో గడచిన శుక్రవారంనాడు కొండచరియలు విరిగిపడిపోవడంతో 200 కిలోమీటర్ల విస్తారంలో బండరాళ్ళు పడి ఆరు గ్రామాలలో నివసించే 2000 మంది ప్రజలు సజీవ సమాధి అయ్యారు. ఎనిమిది అడుగుల లోతున గ్రామాలు కూరుకుపోవడంతో వారిని తవ్వితీయడం అతిపెద్ద సవాలుగా మారింది. ఈ పరిస్థితులమధ్య ఇంకా మరిన్ని కొండ చరియలు విరిగిపడే ప్రమాదం పొంచి ఉందని గుర్తించడంతో మరో 7,900 మందిని గ్రామాలు ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఐక్యరాజ్యసమితి కూడా ఈ ఘటనపై తీవ్రంగా స్పందించింది. సానుభూతి ప్రకటించింది. సజీవంగా ఉన్నవారిని వెలికితీసే అవకాశాలు మృగ్యంగా కనిపిస్తున్నాయని వ్యాఖ్యానించింది.

# స్వతంత్ర దేశంగా పాలస్తీనాకు 146 దేశాల గుర్తింపు

### రఫా భద్రతపై నేడు భద్రతామండలి అత్యవసర సమావేశం






**గాజా :** పాలస్తీనాను ఒక స్వతంత్ర దేశంగా ఇప్పటివరకూ 146 దేశాలు గుర్తింపు లభించింది. ఐక్యరాజ్యసమితిలో మొత్తం 193 సభ్యదేశాలు ఉండగా, ఇప్పటివరకూ 146 దేశాలు పాలస్తీనాను స్వతంత్ర్యదేశంగా గుర్తించాయి. ఐర్లాండ్, నార్వే, స్పెయిన్ దేశాలు గతంలో ప్రకటించిన విధంగా మంగళవారంనాడు చట్టబద్ధమైన గుర్తింపును ఇస్తున్నట్లు ప్రకటించాయి. పశ్చిమ ఆసియాలో శాంతి సాధన జరగాలంటే పాలస్తీనాను స్వతంత్రదేశంగా గుర్తించాల్సిన అవసరం ఉందని ఈ మూడు దేశాల నాయకులూ ప్రకటించారు. రెండు దేశాల సహజీవన పరిష్కారం అనివార్యమని అన్నారు.ఐతే 1967లో పాలస్తీనాకు ఉన్న సరిహద్దులనే ఈనాటికీ తాము గుర్తించి స్వతంత్రదేశంగా పేర్కొంటున్నామనీ, ఇజ్రాయిల్ తిమ్మిదిని బమ్మినిచేస్తూ మార్చేసిన సరిహద్దులను తాము గుర్తించడంలేదని కూడా ఈ మూడు దేశాల నాయకులూ ప్రకటించారు. మే 10వ తేదీన ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ ఒక తీర్మానం చేస్తూ పాలస్తీనాకు దేశంగా గుర్తింపు ఇచ్చింది. అందుకు అవసరమైన సభ్యత్వ ప్రక్రియ పూర్తి చేయడానికి సహకరించాలని, అదేవిధంగా భద్రతా మండలి కూడా తన నిర్ణయాన్ని పునఃపరిశీలించి పాలస్తీనాను స్వతంత్ర దేశంగా గుర్తించాలనీ కూడా ఒక విజ్ఞప్తి చేసింది. కాగా రఫాలో అమాయకులైన సామాన్య పౌరులపై దాడి చేసి 45 మంది ప్రజలను సజీవ దహనం చేసిన అమానుష ఘటన నేపథ్యంలో ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి మంగళవారంనాడు ఆకస్మిక, అత్యవసర సమావేశం జరుపుతున్నది.

**లక్ష్యం చేరేదాకా లొంగను: నేతన్యాహూ**

హమాస్ ఉగ్రవాద సంస్థను సమూలంగా నిర్మూలించాలనే తమ లక్ష్యం నెరవేరేవరకూ తాను లొంగేదే లేదని, యుద్ధాన్ని విరమించే ప్రసక్తే లేదని ఇజ్రాయిల్ ప్రధాన మంత్రి బెంజిమన్ నేతన్యాహూ మంగళవారంనాడు తాజా ప్రకటన చేశారు. నార్వే, ఐర్లాండ్, స్పెయిన్ దేశాలు పాలస్తీనాకు గుర్తింపు ఇచ్చిన పూర్వరంగంలో ఆయన ప్రకటన వెలువడింది. మరోవైపు ఐక్యరాజ్యసమితి భద్రతామండలి కూడా ఇజ్రాయిల్ రఫాలో జరుపుతున్న దాష్టీకంపై అత్యవసరంగా సమావేశమైంది. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల నాయకులు రఫాలో జరిపిన మారణకాండను తీవ్రంగా ఖండిస్తున్నారు. ఇకనైనా యుద్ధం విరమించకపోతే నేతన్యాహూ మూల్యం చెల్లించకతప్పదని హెచ్చరికలు చేస్తున్నాయి. ఆఫ్రికా యూనియన్ కూడా రఫాపై దాడులను తీవ్రంగా ఖండించింది. ఆఫ్రికా యూనియన్ కమిషన్ అధ్యక్షుడు మౌస్సాఫికి మహమత్ రఫాలో పౌర శిబిరంపై దాడిని ఖండించారు. తక్షణం యుద్ధం ఆపాలని డిమాండ్ చేశారు. ఇది అంతర్జాతీయ కోర్టు తీర్పును, అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడమేనని అన్నారు.

**సెంట్రల్ రఫాలో యుద్ధ టాంకులు:**

ఇజ్రాయిల్ యుద్ధ ట్యాంకులు మంగళవారంనాడు దక్షిణ గాజాలోని గుండెకాయ లాంటి సెంట్రల్ రఫాలోకి ప్రవేశించాయి. యుద్ధం, దాడులు మరింత తీవ్రమయ్యాయి. మరోవైపు రఫాలో ఉన్న కువాయిత్ సెంట్రల్ ఆసుపత్రి మూత పడింది. పెద్ద సంఖ్యలో గాయపడిన ప్రజలు ఆసుపత్రికి వస్తూ ఉండటంతో సేవలు అందించలేక ఆసుపత్రి మూతపడింది. పైగా ఇజ్రాయిల్ దాడుల్లో ఇద్దరు వైద్యసిబ్బంది మరణించడంతో ఆసుపత్రి పనికి రాకుండా పోయింది. ఇదిలా ఉండగా, రఫాలో జరిగిన ఘోరమైన దాడి, 45 మంది ప్రజల సజీవ దహనం ఘటనతో ప్రపంచవ్యాప్తంగా మళ్ళీ నిరసన ప్రదర్శనలు ప్రారంభమయ్యాయి. లండన్, పారిస్, బెర్లిన్, న్యయార్క్ సిటీ, ఐర్లాండ్‌లలో పాలస్తీనా సంఘీభావ ప్రదర్శనలు జరుగుతున్నాయి. ట్యునీషియాలో వందలాదిమంది భారీ ప్రదర్శన జరిపారు. ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనీ గుటెర్రెస్, అమ్నెస్టీ ఇంటర్నేషనల్ కూడా ఈ ఘటనను ఖండించాయి.

# తాలిబన్లపై ఉగ్రవాద ముద్ర చెరిపేస్తున్న రష్యా






### రెండు నెలల్లో దౌత్యసంబంధాల ప్రక్రియ

**మాస్కో :** నిషేధిత ఉగ్రవాద సంస్థల జాబితా నుండి త్వరలో తాలిబన్‌లను రష్యా విముక్తి చేయనున్నది. రష్యా సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇస్తే ఇక తాలిబన్లపై అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థ ముద్ర రష్యా జాబితాలోంచి పూర్తిగా తొలగిపపోయినట్లే. రష్యా విదేశాంగమంత్రి సెర్గీ లోవరోవ్‌నరు ఉటంకిస్తూ, ఆ దేశ ప్రభుత్వ మీడియా ఈ విషయం వెల్లడించింది. ఒకటి రెండు నెలలలోనే ఈ ప్రక్రియ పూర్తి అవుతుందని కూడా రష్యన్ మీడియా ప్రకటించింది కజఖస్థాన్ 2023 సంవత్సరం ఆఖరులో ఈ నిర్ణయం తీసుకుంది. తర్వాత రష్యా కూడా తాజాగా ఇదే నిర్ణయం ప్రకటించింది. తాలిబాన్ సంస్థపై అంతర్జాతీయ స్థాయిలో ఆంక్షలుఉన్నప్పటికీ కూడా రష్యా చాలా సంవత్సరాలుగా తాలిబాన్లతో వాణిజ్య, వ్యాపార సంబంధాలు కొనసాగించేందుకు అనేక విడతలుగా చర్చలు జరిపి సంబంధాలు కొనసాగిస్తున్నది. ఆఫ్ఘానిస్థాన్‌లో తాలిబన్లు అధికారంలోకి వచ్చిన తర్వాత నుండి రష్యా ఇదే ఆలోచనలో ఉంది. వాస్తవాలను గుర్తించాల్సిన అవసరం ఉందనీ, తాలిబన్లు ఇప్పుడు ఒక దేశ రాజ్యాధికారాన్ని నడుపుతున్నారనీ భావిస్తున్న రష్యా ఈ ఏడాదిలోనే తాలిబన్లపై అతర్జాతీయ ఉగ్రవాదజాబితానుండి విముక్తి చేసి గుర్తింపు ఇవ్వాలని ఆలోచిస్తున్నది. తాలిబన్లు అఫ్ఘానిస్థాన్‌లో అధికారంలోకి వచ్చిన మూడు సంవత్సరాల తర్వాత రష్యా ప్రభుత్వం చాలా స్పష్టంగా ఈ నిర్ణయానికి వచ్చింది. ఇస్లామిక్ ఎమిరేట్ ఆఫ్ అఫ్ఘనిస్థాన్ పేరుతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన తాలిబన్లతో ఇకమీదట రష్యా – అఫ్ఘానిస్థాన్‌ల మధ్య సరికొత్త దౌత్య సంబంధాలకు తెరలేవనున్నది. అమెరికా అండదండలతో నడిచిన అఫ్ఘానిస్థాన్ పరిపాలనను తాలిబన్లు 2021లో స్వాధీనం చేసుకున్నారు. అత్యంత కఠినమైన మత రాజ్య పరిపాలన కొనసాగించేరీతిలో మహిళలను పూర్తిగా ప్రజా జీవితం నుండి నిషేధించి పూర్తిగా ఇళ్ళకే పరిమితం చేశారు. ఐతే అఫ్ఘానిస్థాన్‌లో రష్యాదేశాధ్యక్షుడి ప్రత్యేక అధికార ప్రతినిధి జామిర్ కబులోవ్ ఒక ప్రకటన చేస్తూ, ''తాలిబన్లను ఉగ్రవాద జాబితా నుండి తొలగించడం అనివార్యం, చట్టరీత్యా ఆ ప్రక్రియ జరగాల్సిందే. లేకపోతే ప్రస్తుతం ఉన్న తాలిబన్ల ప్రభుత్వంతో చర్చలకుగానీ, దౌత్య సంబంధాల పునరుద్ధరణకుగానీ, అఫ్ఘానిస్థాన్ ప్రభుత్వాన్ని గుర్తించడానికిగానీ అవకాశం ఉండదు, అలాంటి ప్రయత్నాలకు అర్థంమే ఉండదు'' అని పేర్కొన్నారు.

**23 మంది తాలిబన్లు హతం:**

తాలిబన్ తీవ్రవాదులు చురుగ్గా ఉండే పాకిస్థాన్ వాయువ్య సరిహద్దుల్లో పాకిస్థాన్ సైన్యం జరిపిన పలు దాడుల్లో 23 మంది తాలిబన్ ఉగ్రవాదులు హతులయ్యారు. ఆ పోరాటంలో మరో ఏడుగురు పాకిస్థాన్ సైనికులు కూడామరణించారు. పెషావర్ శివార్లలో ఉన్న సరిహద్దుల్లో ఖైబర్ పఖ్తుంక్వా రాష్ట్ర శివార్లలో పాకిస్థాన్ సైన్యం దాడులు చేసింది. ఒకచోట ఆరుగురు ఉగ్రవాదులు, మరోచోట పదిమంది, ఇంకో చోట ఐదుగురు, ఏడుగురు హతులయ్యారు. ఆఫ్గనిస్థాన్ తాలిబన్లకు అనుబంధ ఉగ్రవాద సంస్థగా పాకిస్థాన్‌లో కల్లోలం సృష్టిస్తున్న తెహ్రిక్ ఏ తాలిబన్ పాకిస్థాన్ (టిటిపి) చాలా చురుగ్గా ఆ దేశంలో ఉగ్రవాద కార్యకలాపాలు నిర్వహిస్తున్నది.

# పెరూ అధ్యక్షురాలిపై లగ్జరీ వాచీల అవినీతి కేసు



**లిమా :** పెరూ రిపబ్లిక్ అధ్యక్షురాలు దైనా బొలుఆర్టేపై లగ్జరీ వాచీల అవినీతికేసులో చిక్కుకున్నారు. ఆమెపై అటార్నీ జనరల్ కార్యాలయం సోమవారంనాడు రాజ్యాంగబద్ధమైన ఫిర్యాదుచేసింది. దీంతో ఆమె పదవికే ఎసరు వచ్చింది. దక్షిణ అమెరికా పశ్చిమప్రాంత దేశం పెరూ రిపబ్లిక్‌కు మొట్టమొదటి మహిళా అధ్యక్షురాలుగా2022 డిసెంబరు 7న దైనా బొలుఆర్టే అధ్యక్ష పదవీ బాధ్యతలు చేపట్టారు. ఫ్రీపెరూ నేషనల్ మార్క్సిస్టుపార్టీలో సభ్యురాలుగా ఉండే బొలుఆర్టే తర్వాత ఇండిపెండెంట్‌గా పోటీ చేసి పదవిలోకి వచ్చారు. ఇటీవలికాలంలో ఈ విధమైన ఆరోపణలతో దేశాధినేతలను తొలగించేందుకు చట్టసభ సభ్యులు అత్యుత్సాహం చూపిస్తున్నారు. ఇంతకుముందు కూడాఇలాంటి ఆరోపణలతోనే అధ్యక్షులకు కాలం చెల్లింది. ఐతే ప్రధానమంత్రి గస్తవో ఆడ్రియాంజెన్ మాత్రం బొలుఆర్టేపై వచ్చిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. ఈ ఆరోపణలు రాజ్యాంగ విరుద్ధం, అసంబద్ధం, అన్యాయపూరితం అని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆమెకు ముందుగా పనిచేసిన దేశాధ్యక్షుడు పెడ్రో కాస్టిల్లోపై ఆరోపణలు చేసి పదవి నుండి తొలగించాక ఉపాధ్యక్షురాలుగా ఉన్న బొలు ఆర్టే దేశాధ్యక్ష పదవి చేపట్టారు. తర్వాత ఆమె అనేక రోలెక్స్ వాచీలు, నగలు కూడబెట్టారన్న ఆరోపణలతో గడచిన నవంబరులో పోలీసు దాడులు కూడా ఎదుర్కొన్నారు. కాస్టిల్లో దేశ పార్లమెంటును అక్రమంగా రద్దుచేసే ప్రయత్నం చేశారన్న ఆరోపణలు రావడంతో అల్లర్లు చెలరేగాయి. ఈ అల్లర్లలో 40 మంది మరణించారు. ఇప్పుడు బొలు ఆర్టేపై కూడా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాంగ్రెస్ గనుక ఈ తీర్మానం చేపడితే ఆమె కూడా దేశాధ్యక్ష పదవి నుండి వైదొలగాల్సి వస్తుంది.

## బాంబు బెదిరింపు

(మొదటి పేజీ తరువాయి)

ఊపిరిపీల్చుకున్నారు. ఇది అకతాయిలా పని అని తేల్చారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కుటుంబం నివాసం ఉంటున్న విషయం తెలిసిందే. భట్టి కుటుంబ సభ్యులు కొంత ఆందోళనకు లోనయ్యారు. వివరాలు ఇలా ఉన్నాయి. ప్రజాభవన్‌లో బాంబు ఉన్నట్లు అజ్ఞాత వ్యక్తి 100కు దయల్ చేసి చెప్పడంతో రాష్ట్ర పోలీస్ శాఖ వెంటనే అప్రమత్తమయింది. ఇంటలిజెన్స్ సెక్యూరిటీ వింగ్, హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ వింగ్ పోలీస్ అధికారులను రంగంలోకి దింపింది. హుటాహుటిన బాంబ్, డాగ్ స్క్వాడ్ బృందాలు ప్రజాభవన్ కు చేరుకొని అడుగడుగున తనిఖీలు చేపట్టారు. విషయం తెలుసుకున్న పంజాగుట్ట ఏసిపి మనోహర్ కుమార్ తన సిబ్బందితో చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ప్రజాభవన్ ఎంట్రన్స్ నుంచి నివాసం లోపల ఉన్న అన్ని గదులను, బెడ్రూమ్స్, కిచెన్, డైనింగ్ హాల్, విజిటర్ హాల్స్, ఉప ముఖ్యమంత్రి ఛాంబర్, జిమ్, గార్డెన్, పరిసర ప్రాంతాలను అణువణువునా డాగ్ స్క్వాడ్ బృందం పోలీసులు తనిఖీలు చేశారు. అదేవిధంగా భట్టి విక్రమార్క కాన్వాయ్, కుటుంబ సభ్యులు వాడుతున్న వాహనాలను పోలీసులు క్షున్నంగా పరిశీలించారు. ఆ తర్వాత ప్రజాభవన్‌లో ఉన్న అమ్మవారి ఆలయంలో తనిఖీ చేశారు. బాంబు లేదని తేలడంతో అందరు ఊపిరిపీల్చుకున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ఫోన్లు ట్యాప్

(మొదటి పేజీ తరువాయి)

ఎస్ఓటి నారాయణ సహకారం తీసుకున్నాం. ప్రతిపక్ష నేతల కుటుంబ సభ్యుల ఫోన్లు, వాహనాలను ట్రాక్ చేశాం.జీహెచ్ఎంసీ ఎన్నికలతో పాటు మూడు ఉపఎన్నికల సమయంలో ట్యాపింగ్ చేశాం.అక్టోబర్లో ఎన్నికల సంఘం రాధాకిషన్ రావుతో పాటు పలువురిని బదిలీ చేసింది. ఎలాగైనా సరే మూడోసారి బీఆర్ఎస్ను అధికారంలోకి తెచ్చేందుకు ప్లాన్ చేశాం. అలాగే కంపెనీలు, విఐపిలు, వ్యాపారవేత్తల పలు వివాదాలను బిఆర్ఎస్ నేతల సూచనలతో సెటిల్ చేశాము.రెండు ప్రైవేట్ ఆసుపత్రుల నుంచి డబ్బులను పెద్దఎత్తున బిఆర్ఎస్ పార్టీకి తరలించాము. రియల్టర్ సంధ్యా శ్రీధర్రావును రూ.13కోట్ల ఎలక్ట్రోరల్ బాండ్స్ కొనేలా చేశాం మాట వినకపోతే క్రిమినల్ కేసులతో చిత్రహింసలు పెట్టాం. ప్రతిపక్ష నేతల డబ్బులు పట్టుకునేందుకు ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు, పది మంది హెడ్‌కానిస్టేబుళ్లతో డిఎస్‌పి తిరుపతన్న (జైలులోఉన్నాడు) పిఓఎల్ 2023 పేరుతో ప్రత్యేక ఎలక్షన్ గ్రూపును ఏర్పాటు చేసాడు. ప్రణీత్ కుమార్ ఇచ్చిన సమాచారంతో 15 ఆపరేషన్లు నిర్వహించిన తిరుపతన్న నిర్వహించాడు. ప్రస్తుత మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి సంబంధించిన డబ్బులను పట్టుకున్నాడు. కొల్లూరులో రేవంత్రెడ్డి మిత్రుడు గాలి అనిల్కుమార్ నుంచి 90 లక్షలు, రేవంత్ మిత్రుడు కె. వినయ్రెడ్డి దగ్గర నుంచి రూ. 1.95 కోట్లు, పొంగులేటి శ్రీనివాస్రెడ్డికి చెందిన రాఘవ ఇన్ఫ్రా నుంచి రూ. 10.5 కోట్లు, రాజగోపాల్రెడ్డి మిత్రుడు సీహెచ్ వేణు దగ్గర రూ. 3 కోట్లు, జి. వినోద్కు సంబంధించిన విశాఖ ఇండస్ట్రీస్ నుంచి రూ. 50 లక్షలు,ఉత్తమ్ మిత్రుడు గిరిధర్ నుంచి రూ. 35 లక్షలు, ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అత్త ఝాన్సీరెడ్డి నుంచి రూ. 90 లక్షలు,పొంగులేటి మిత్రుడు ఖమ్మంలో ఫెర్టిలైజర్ సంస్థ యజమాని నుంచి రూ. 10 లక్షలు స్వాధీనం చేసుకున్నాడు.ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించడంతో డేటా మొత్తాన్ని ధ్వంసం చేశాడు.

## అడ్డుకుంటున్న బిఆర్ఎస్ నేతలు

(మొదటి పేజీ తరువాయి)

ఫోన్ ట్యాపింగ్ చేయాల్సిన అవసరం లేదన్నారు.

గువ్వల బాల్‌రాజ్ ప్రొద్బలంతోనే నా ఫోన్ ట్యాపింగ్ : వంశీకృష్ణ
కాంగ్రెస్ ఎంఎల్ఏ వంశీ కృష్ణ మాట్లాడుతూ బిఆర్ఎస్ మాజీ ఎంఎల్ఏ గువ్వల బాలరాజు ప్రొద్బలంతోనే 'నా ఫోన్' ట్యాపింగ్ జరిగిందని, ఇందుకు ఆయనపై చర్యలు తీసుకోవాలని డిజిపి,ఐజికి ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. మాజీ సిఎం కెసిఆర్,కెటిఆర్ డైరెక్షన్‌లో ఫోన్ ట్యాపింగ్ జరిగిందని ఆరోపించారు.

## పంజాబ్‌లో చతుర్ముఖ పోటీ

(మొదటి పేజీ తరువాయి)

బిజెపి, ఆప్‌ల మధ్య త్రిముఖ పోటీ జరిగింది. అప్పుడు కాంగ్రెస్ 8 స్థానాలలో (41 శాతం ఓట్లు), ఆప్ ఒక్క స్థానంలో (7 శాతం ఓట్లు), బిజెపి (9 శాతం ఓట్లు), శిరోమణి అకాలీదళ్ (28 శాతం)ఓట్లతో చెరి రెండు స్థానాల చొప్పున నెగ్గాయి. ఈ సారి రాష్ట్ర ప్రభుత్వ విధానాలు, పనితీరు ఆధారంగా ఆప్ ఓట్లు కోరుతుంది. రెండున్నరేళ్ళ ప్రభుత్వ ప్రజాదరణకు ఈసారి కీలక పరీక్ష జరుగుతుంది. పదవీ కాలం మధ్యలో ఉన్న ఆప్ ప్రభుత్వంపై కొంత ప్రజా వ్యతిరేకత ప్రభావం ఉండే అవకాశాన్ని త్రోసి పుచ్చలేము. ముఖ్యమంత్రి భగవంత్ సింగ్ మాన్ ప్రతిష్ట, నాయకత్వపు నైపుణ్యం పరీక్షకు నిలవనుంది. ప్రచారం చివరి దశలో అరవింద్ కేజ్రీవాల్ అరెస్టు పేరుతో సానుభూతి ఓట్లను పొందేందుకు ఆప్ ప్రయత్నిస్తుదంఇ. బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఏ కేంద్ర ప్రభుత్వం ఢిల్లీ సిఎం అరవింద్ కేజ్రీవాల్‌ను లక్ష్యంగా చేసుకున్నదని, ప్రజాస్వామ్యాన్ని , రాజ్యాంగాన్ని ప్రమాదంలోకి నెట్టేసిందని ఆప్ ప్రచారం చేస్తుంది. ప్రత్యర్థులపై నిప్పులు కురిపిస్తున్నప్పటికీ రైతులకు కనీమ మద్దతు ధర అనే ఎన్నికల వాగ్దానంపై ఆప్ ప్రభుత్వానికి రైతు సంఘాల నుండి ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. ఆప్ ప్రభుత్వ పూర్తి కాని ఎన్నికల హామీలు, ప్రభుత్వ వైఫల్యాలను ప్రతిపక్షాలు అస్త్రాలుగా మార్చుకున్నాయి. మహిళలకు నెలకు రూ. వెయ్యి పెన్షన్ వాగ్దానం అమలు చేయకపోవడం పట్ల ఆప్‌పై కొంత అసంతృప్తి వ్యక్తమవుతుంది. పంజాబ్‌లోని ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ పార్టీ ప్రధానంగా రాష్ట్రంలో ఆప్, కేంద్రంలో బిజెపి ప్రభుత్వాలకు ఎదురవుతున్న ప్రజావ్యతిరేకతపైనే దృష్టి సారించింది. ఢిల్లీ సరిహద్దుల్లో వ్యవసాయ నల్ల చట్టాలకు వ్యతిరకంగా రైతు ఉద్యమానికి, తాజాగా పంజాబ్‌హర్యానా సరిహద్దుల వద్ద నిరసనలకు తమ పార్టీ ఇచ్చిన మద్దతుపై కాంగ్రెస్ ఆశలు పెట్టుకుంది. వందేళ్ళ పురాతన ప్రాంతీయ పార్టీ శిరోమణి అకాలీదళ్ 2017, 2022 అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన పరాజయాలతో గడ్డుకాలం ఎదుర్కొంటుంది. ఆ పార్టీ సిక్కుల ఎజెండాను తిరిగి అందుకొని రాష్ట్రంలో కోల్పోయిన ప్రాభవాన్ని తిరిగి పొందేందుకు ప్రయత్నిస్తుంది. ఒంటరిగా పోటీ చేస్తున్న బిజెపి రైతుల నుండి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొంటుంది. సిక్కులు, ఎస్‌సిలలోకి చొచ్చుకుపోవడం ద్వారా పంజాబ్‌లో తాజాగా నూతన రాజకీయ సామాజిక ఇంజనీరింగ్‌కు బిజెపి ప్రయత్నిస్తోంది. దేశంలోని అన్ని రాష్ట్రల కంటే అత్యధికంగా పంజాబ్‌లో ఎస్‌సిల జనాభా సుమారు 32 శాతం ఉంది. ఏళ్ళ తరబడి ఈ రాష్ట్రంలో అకాలీదళ్‌కు బిజెపి జూనియర్ భాగస్వామిగా ఎన్నికల్లో పోటీ చేస్తూ వస్తోంది. శిరోమణి అకాలీదళ్ ఎన్‌డిఏ నుండి తప్పుకున్న తరువాత దూకుడు విస్తరించేపదకు బిజెపి ప్రయత్నాలు చేస్తుంది. అకాలీదళ్‌లో పొత్తు విడిపోయిన తరువాత సిక్కుల అనుకూల పార్టీగా చెప్పుకునేందుకు బిజెపి అనేక మంది సిక్కులను తమ పార్టీలో చేర్చుకుంది. అందులో మాజీ సిఎం అమరీందర్ సింగ్, మాజీ కాంగ్రెస్ నేత గుర్మీందర్ సింగ్ సోధీ, తదితరులు ఉన్నారు. గత కొన్నేళ్ళుగా పంజాబ్‌లో క్రమంగా ఓటు బ్యాంకును కోల్పోతూ వస్తున్న బిఎస్‌పి ఈసారి దళితుల అంశాలను లేవనెత్తుతూ తిరిగి ఆ వర్గాల ఓట్లను సాధించేందుకు దృష్టి సారించింది.

**ఎన్నికల ప్రచారంలో భట్టి**

దేశంలోనే అత్యధిక మంది దళిత జనాభా ఉన్న రాష్ట్రం పంజాబ్. గతంలో కాంగ్రెస్ ఇక్కడ దళిత వర్గానికి చెందిన చన్నీని ముఖ్యమంత్రిని చేసింది. ఈ సారి ఎన్నికల్లో దళిత ఓటర్లను ఆకర్షించేందుకు అన్ని అస్త్రాలను వాడుతుంది. అందులో భాగంగా తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను సైతం అక్కడ ప్రచారంలోకి దింపింది.

## బట్టబయలు

(మొదటి పేజీ తరువాయి)

మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ట్యాపింగ్ వ్యవహారంపై ఇప్పటి వరకు సమీక్ష జరపలేదని, అధికారులు వారి పని వారు చేసుకుంటూ పోతున్నారని చెప్పారు. పోలీసుల పనిలో జోక్యం చేసుకుంటే ఏమి జరుగుతుందో తనకు తెలుసునన్నారు. ఫోన్ ట్యాపింగ్ లాంటి కార్యకలాపాలు తమ ప్రభుత్వం చేయదని ముఖ్యమంత్రి చెప్పారు. తీవ్రవాదులు, జాతి వ్యతిరేక శక్తుల విషయంలో ఫోన్ ట్యాపింగ్ జరగొచ్చని, అందుకు సంబంధించి ఏదైనా సమాచారం ఉంటే ఎస్ఐబి అధికారులు కేంద్ర నిఘా సంస్థలతోనే నేరుగా మాట్లాడతారు తప్ప, తనతో కాదన్నారు. 1980, 1990ల నుంచి సేకరించిన డేటా అంతా ఉందో లేదో? బ్యాకప్ కూడా ఉందో లేదో దాన్ని కూడా మాయం చేశారో అంతా దర్యాప్తు అధికారులకు తెలుస్తుందన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై విచారణకు పోలీసులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చామన్నారు.

**రాచరిక వ్యవస్థకు తావులేదు:** రాష్ట్రంలో రాచరిక వ్యవస్థకు తావులేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ అంటే త్యాగాలు, పోరాటాలని, అవి గుర్తుకువచ్చేలా రాష్ట్ర చిహ్నం ఉంటుందని స్పష్టం చేశారు. రాష్ట్ర గీత రూపకల్పన బాధ్యతలు ప్రముఖ కవి అందెశ్రీకి అప్పగించామని, రాష్ట్ర చిహ్న రూపకల్పన బాధ్యతలు నిజామాబాద్ వ్యక్తికి ఇచ్చినట్లు వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు సమస్యపై నిపుణుల సూచనలతో ముందుకు వెళతామని రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. కాళేశ్వరం సమస్య 32 పళ్ల లో ఒక పన్ను విరిగితే వచ్చేది కాదని, విరిగింది వె న్నుముక అని గుర్తు చేశారు. నీటిని నిల్వ చేసి విడుదల చేసే పరిస్థితి లేదని, కాళేశ్వరం కరెంట్ బిల్లులు అన్నీ సముద్రంలో వదిలిన నీళ్లలాంటివని చెప్పారు. సుమారు 52 టిఎంసిల నీళ్లు సముద్రం పాలయ్యాయని, సముద్రంలోకి వెళ్లిన నీటికీ కరెం ట్ బిల్లులు కట్టామని సిఎం చెప్పారు.

**అధికారులు అనుకూలంగా పనిచేస్తే ప్రతిపక్షాలు చూస్తూ ఊరుకోవు కదా?**

రాష్ట్రంలో ఎన్నికలు పారదర్శకంగా జరిగాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. ఏ వ్యవస్థనూ ఇప్పటి వరకు దురుపయోగపర్చలేదని, పక్కనున్న ఎపిలో ఎంత మంది అధికారులను మార్చారు? తెలంగాణలో ఎంత మందిని మార్చారో చూస్తే అర్థమవుతుందన్నారు. ఏ ఒక్క అధికారిపైనా ఎలాంటి ఆరోపణ రాలేదని, ఒక వేళ అధికారులు తమకు అనుకూలంగా పనిచేసి ఉంటే, ప్రతిపక్షాలు చూస్తూ కూర్చోవు కదా అన్నారు.

**కరెంట్ విషయాలన్నీ త్వరలోనే బయటపెడతాం**

రాష్ట్రంలో కరెంట్ కోతలు లేవని సిఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. ఈదురు గాలుల కారణంగా చెట్లు పడిపోవడం, విద్యుత్ వినియోగం పెరగడం, ట్రాన్‌ఫార్మర్లు కాలిపోవడంతో విద్యుత్ సరఫరాలో కొంత అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. పునరుద్ధరణ విషయంలో కొంత సమయం తీసుకుని ఉండొచ్చునన్నారు. గతంలో ఎన్నడూ లేనంత విద్యుత్ డిమాండ్ తెలంగాణలో పెరిగిందని, అందుకు అనుగుణంగా ఎక్కడా సమస్యలు రాకుండా చేసినట్లు చెప్పారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత విద్యుత్‌కు సంబంధించిన అన్ని విషయాలు బయటపెడతామని స్పష్టం చేశారు.

## ముఠా గుట్టు రట్టు

(మొదటి పేజీ తరువాయి)

డాక్టర్‌గా చలామణి అవుతున్న ఓ ఆర్ఎంపి మహిళా వైద్యురాలు శోభా రాణితో పాటు మరో ఇద్దరిని ఓ పసిపాపను అమ్ముతున్న సమయంలో రెడ్ హ్యాండెడ్‌గా తొలుత అరెస్టు చేసిన అనంతరం కొనసాగించిన విచారణ నేపథ్యంలో అంతర్జాతీయంగా కొనసాగిస్తున్న ముఠా తతంగం బయట పడింది. ఇప్పటి వరకు ఈ కేసుకు సంబంధించి ఏజంట్లు, సబ్ ఏజంట్లుగా ఈ తతంగంలో వ్యవహరించిన ఎనిమిది మందిని అరెస్టు చేసారు. ఇప్పటి వరకు ఈ ముఠా మొత్తం 16 మంది చిన్నారులను విక్రయించినట్లు పోలీసులు విచారణలో నిర్ధారించారు. నేరేడ్‌మెట్‌లోని కమిషనరేట్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాచకొండ డిసిపి పద్మజా రెడ్డి, మల్కాజిగిరి ఎసిపి చక్రపాణి,మేడిపల్లి ఇనస్పెక్టర్ గోవిందరెడ్డి, ఎస్సైలు ప్రభాకర్‌రెడ్డి, నర్సింగరావు, అనీల్ కుమార్‌లతో కల్సి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాచకొండ కమిషనర్ తరుణ్‌జోషి ఈ కేసుకు సంబంధించి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 22న ఓ స్వచ్ఛంద సంస్థకు అందిన సమాచారంతో తమకో చిన్నారి కావాలంటూ ఫోన్ ద్వారా ఆర్ఎంపి డాక్టర్ శోభారాణిని సంప్రదించి పది వేల రూపాయలు అడ్వాన్స్‌గా చెల్లించి మిగిలిన సొమ్ము ఇచ్చి తీసుకోనేందుకు ఆమెకు చెందిన ప్రథమ చికిత్సా కేంద్రానికి వెళ్లి చిన్నారిని తీసుకొనే క్రమంలో ముందస్తు సమాచారం మేరకు అక్కడికి చేరుకొన్న మేడిపల్లి పోలీసులు వారిని చిన్నారితో సహా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని అదుపులోకి తీసుకొన్నారు. తదుపరి దర్యాప్తు ఫలితంగా ఈ ముఠా ఢిల్లీ ప్రాంతానికి చెందిన ప్రీతి, కిరణ్, మహారాష్ట్రలోని పూనే ప్రాంతానికి చెందిన కన్నయ్యల ద్వారా వివిధ రాష్ట్రాల నుండి చిన్నారులను సేకరించి తీసుకొని వచ్చి సంతానం లేని వారికి రూ 1.80 లక్షల నుండి రూ.5.50 లక్షల వరకు విక్రయిస్తున్నారు. ఇప్పటి వరకు ఢిల్లీ, పూనాలకు చెందిన ఈ ముగ్గురు నగరంలోని ప్రధాన నేరస్తులైన శోభారాణికి 50 మంది చిన్నారులను సరఫరా చేసింది. ఈ ముఠాలోని ఎనిమిది మందిని అరెస్టు చేయగా పరారీలో ఉన్న కిరణ్, ప్రీతి, కన్నయ్యల కోసం గాలిస్తున్నామని కమిసనర్ తెలిపారు. ఈ ముఠా నుండి స్వాధీనం చేసుకొన్న 11 మంది చిన్నారులను చైల్డ్ వెల్ఫేర్ శాఖా అధికారులకు అప్ప చెప్పారు.

## ఈశాన్యం అతలాకుతలం

(మొదటి పేజీ తరువాయి)

వ్యక్తులను సజీవంగా కాపాడినట్లు ఐజ్వాల్ డిప్యూటీ కమిషన్ పేర్కొన్నారు. హంతర్ వద్ద 6వ నెంబర్ జాతీయ రహదారిపై కొండచరియలు విరిగిపడడంతో రాష్ట్ర రాజధానికి ఇతర ప్రాంతాలతో సంబంధాలు తెగిపోయినట్లు అధికారులు చెప్పారు. అనేక రాష్ట్ర రహదారులపై కూడా కొండచరియలు విరిగిపడ్డాయన్నారు. రాష్ట్రంలో పరిస్థితిపై ముఖ్యమంత్రి లాల్దుహోమా హోంమంత్రి కె. సప్దాంగ, సిఎస్ రేణు శర్మ, ఇతర సీనియర్ అధికారులతో కలిసి అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేశారు. క్వారీ కుప్పకూలన ఘటన సహా వర్షం సంబంధిత ఘటనల్లోమృతి చెందిన కుటుంబాలకు రూ. 4 లక్షల ఎక్స్‌గ్రేషియాను సిఎం ప్రకటించారు. తాత్కాలిక ఉపశమనం కింద రూ. 2 లక్షల చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కాగా, సిఎం, డిప్యూటీ సిఎం సహా విపత్తు నిర్వహణ, పునారావస విభాగం అధికారులు స్టోన్ క్వారీ వద్దకు విచ్చేసి పరిస్థితిని పర్యవేక్షించారు. వర్షాల కారణంగా అన్ని పాఠశాలలను మూసివేశారు. అత్యవసర విభాగాల్లో మినహాయించి ప్రభుత్వ ఉద్యోగులకు వర్క్ ఫ్రమ్ హోమ్ కేటాయించారు. సైరాంగ్ గ్రామం వద్ద ఉన్న ట్లావంగ్ నది ఉప్పొంగడంతో 30కిపైగా కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

**అసోంలో ముగ్గురు, మేఘాలయలో ఇద్దరు మృతి:** మరోవైపు అసోంలోనూ ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిశాయి. వేర్వేరుగా జరిగిన వర్షం సంబంధిత ఘటనల్లో ముగ్గురు మృతి చెందగా, 17 మందికి గాయాలయ్యాయి. సంతిపూర్ జిల్లాలోని చెట్టు కూలి పాఠశాలపై పడడంతో 12 మంది చిన్నారులు గాయపడ్డారు. రాష్ట్రంలో ప్రతికూల వాతావరణం కొనసాగనున్నట్లు సిఎం హిమంత్ బిస్వశర్మ చెప్పారు. మే ఘాలయాలో భారీవర్షాల కారణంగా ఇద్దరు ప్రాణాలు కోల్పోగా, 500 మం ది గాయపడ్డారు. 24 గంటల పాటు కురిసిన అకాల వర్షాలకు 17 గ్రామాలపై ప్రభావం చూపింది 10 ఇళ్లు ధ్వంసమయ్యాయి.

**అరుణాచల్ ప్రదేశ్‌కు రెడ్ అలర్ట్:** అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రానికి భారత వాతావరణ శాఖ కీలక హెచ్చరికలు జారీ చేసింది. రాబోయే మూడు రోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా అత్యంత భారీవర్షాలు కురిసేఅవకాశం ఉందని హెచ్చరించిం ది. 'పాపుమ్ పారే, పశ్చిమ కమెంగ్ జిల్లాల్లోని ఏకాంత ప్రదేశాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉం ది.

## ఆకస్మిక దాడులు

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. ఆర్‌టిఏ కార్యాలయాల్లో అనధికార వ్యక్తులతో కలిసి అధికారులు అక్రమాలకు పాల్పడినట్లు తేలింది. ఇక ఖమ్మం జిల్లా అశ్వారావుపేట్ చెక్ పోస్టులో అనధికార వ్యక్తులు డబ్బులు వసూలు చేసి అధికారులకు ఇచ్చినట్లు తేలింది. ఉదయం 10 గంటల నుంచి మొదలైన ఏసిబి దాడులు సాయంత్రం ఆరు గంటల వరకు కొనసాగాయి. కరీంనగర్, సిద్దిపేట్,మహబూబ్‌నగర్ ఆర్‌టిఏ కార్యాలయంలో ఎలాంటి నగదు పట్టుబడలేదు. అయితే ఇక్కడ ప్రైవేటు వ్యక్తులు వాహన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. ఆర్‌టిఏ కార్యాలయాల్లో పట్టుబడిన నగదు వివరాలు ఇలా ఉన్నాయి. బండ్లగూడలో రూ.48370, మలకపేటలో రూ.22000, టోలిచౌకిలో రూ.43 360, మహబూబాబాద్‌లో రూ.61900, అశ్వారావ్‌పేట్ చెక్‌పోస్టులో రూ.34050నగదును స్వాధీనం చేసుకున్నారు.ఏసిబి ఆకస్మిక తనిఖీల్లో ఏజెంట్లు, బ్రోకర్లను అదుపు లోకి తీసుకుని అధికారులు విచారిస్తున్నారు.

## సాక్ష్యాలు మార్చేస్తారు

(మొదటి పేజీ తరువాయి)

చేరడానికి ఉపకరించాడనీ, కొన్ని హోల్‌సేల్ కంపెనీలలో లాభాలు పొందానికి ఆమె తరపున ఈ చెల్లింపులు చేశారని ఇ డి పేర్కొంది. ''మెస్సర్స్ ఇండో స్పిరిట్స్‌లో అరుణ్ పిళ్ళై షేరుకు అంతిమ బాధ్యురాలు కె.కవిత అనే విషయం చాలా స్పష్టంగా తేటతెల్లమైందనీ, ఈ ఎక్సైజు విధానం రూపొందించడంలో ముడుపులు చెల్లించే పథకం కింద నేర ప్రక్రియలో తుది లాభాలు సాధించేందుకు ఇండో స్పిరిట్స్ ద్వారా ఆమె వాస్తవికంగా భాగస్వామురాలుగా ఉన్నారని కేంద్ర దర్యాప్తు సంస్థ ఢిల్లీ హైకోర్టుకు తెలియజేసింది. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో నివాసం నుండి కవితను ఇడి అధికారులు ఈ ఏడాది మార్చి 15వ తేదీన అరెస్టుచేసి ఢిల్లీకి తరలించారు. తర్వాత సిబిఐ అధికారులు ఆమెను తీహార్ జైలు నుండి అరెస్టు చేశారు. ఐతే ఈ కేసులతో తనకు ఎలాంటి సంబంధం లేదని కవిత తన బెయిలు పిటిషన్‌లో వాదించారు.

## గత ప్రభుత్వం ఉద్యమకారులపై బనాయించిన అక్రమ కేసులను తక్షణమే ఎత్తివేయాలి

తెలంగాణ ప్రజాస్వామిక వేదిక



ప్రజాపక్షం / హైదరాబాద్ : తెలంగాణ ఉద్యమకారులపై పెట్టిన కేసులను తక్షణమే ఎత్తివేయాలని ప్రజా సంఘాల నాయకులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ప్రజాస్వామిక వేదిక ఆధ్వర్యంలో హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సిపిఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్‌పాషా, మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్, పృథ్వీరాజ్, సాగరా బేగం, ప్రొఫెసర్ వెంకటరాజయ్య, ప్రొఫెసర్ అన్వర్ ఖాన్, నర్సింహాలు మాట్లాడారు. ఈ సందర్భంగా అజీజ్‌పాషా మాట్లాడుతూ బిఆర్‌ఎస్ ప్రజావ్యతిరేక పాలనను వ్యతిరేకిస్తూ ఉద్యమించిన వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులపై బనాయించిన అక్రమ కేసులను తక్షణమే ఎత్తివేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉద్యమించిన ఉద్యమకారులపై ఇప్పటికీ అనేక కేసులు ఉన్నాయని, వాటిని కూడా వెంటనే ఎత్తివేయడంతో పాటు తెలంగాణ ఉద్యమ సమయంలో అన్ని విధాలుగా నష్టపోయిన ఉద్యమకారులను ఆదుకుని వారి డిమాండ్లను పరిష్కరించాలన్నారు. జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ఉద్యమకారులపై ఇంకా కేసులు తొలగించకపోవడం దుర్మార్గమన్నారు. వెంటనే ఉద్యమకారులపై ఉన్న కేసులను వెంటనే ఎత్తివేయాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామని, లేనట్లయితే న్యాయపరంగా పోరాటం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

## ''పౌర సరఫరాల అవినీతి''పై ఆరోపణలకే పరిమితమైన బిజెపి: పెద్ది సుదర్శన్ రెడ్డి

ప్రజాపక్షం / హైదరాబాద్: పౌర సరఫరాల సంస్థ అవినీతిపైన బిజెపి కేవలం ఆరోపణలకే పరిమితమైందని, కేంద్ర ప్రభుత్వానికి ఎందుకు ఫిర్యాదు చేయడం లేదని బిఆర్ఎస్ మాజీ ఎంఎల్‌ఎ పెద్ది సుదర్శన్ రెడ్డి ప్రశ్నించారు. ఎఫ్‌సిఐపైన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఎందుకు సమీక్షించడం లేదన్నారు.హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సివిల్ సప్లయ్ టెండర్లను పొడిగించకుండా వెంటనే వాటిని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. పౌర సరఫరాల శాఖ కుంభకోణాలపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వాస్తవాలు మాట్లాడలేదని, దాటవేసే ధోరణిలో ఉన్నారని ఆరోపించారు. టెండర్లను రద్దు చేస్తున్నట్లు ఎందుకు ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించలేదని ప్రశ్నించారు. సన్న బియ్యం టెండర్లను ఎల్‌జి సంస్థ దక్కించుకున్నట్టు పౌర సరఫరాల శాఖ ఎండి ఉత్తర్వులు ఇచ్చారన్నారు.టెండర్ల ధర కంటే అదనంగా మిల్లర్ల వద్ద నుండి డబ్బులను వసూలు చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో విత్తనాల సరఫరాపై ప్రభుత్వానికి అవగాహన లేదని, ఆదిలాబాద్‌లో రైతులపై జరిగిన లాఠీ ఛార్జ్‌ను ఆయన ఖండించారు. ఎన్నికల కోడ్ ముగియగానే సివిల్ సప్లయ్ భవన్‌ను బిఆర్‌ఎస్ ముట్టడిస్తుందని హెచ్చరించారు. బిడ్డర్స్ విశాఖపట్నంలో ప్రత్యేక బ్యాంక్ ఖాతాలు తెరిచి, మిల్లర్ల ద్వారా డబ్బులు ఆయా ఖాతాలో వేయించుకుంటున్నారని ఆరోపించారు. తమ ఆరోపణలు నిజమా?కాదా ? అనేది అధికారులు తేల్చాలన్నారు.

## ఏకీకృత ఆర్థిక ఫలితాలను ప్రకటించిన ఎల్‌ఐసి

LIC
भारतीय जीवन बीमा निगम
LIFE INSURANCE CORPORATION OF INDIA

ప్రజాపక్షం / హైదరాబాద్ : మార్చి 31, 2024తో ముగిసే సంవత్సరానికి సంబంధించిన స్వతంత్ర, ఏకీకృత ఆర్థిక ఫలితాలను లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్‌ఐసి) డైరెక్టర్‌ల బోర్డు ఆమోదించింది. తమ స్వతంత్ర ఫలితాల ముఖ్య అంశాలను వెల్లడించింది. పన్ను తర్వాత లాభం రూ. 40,676 కోట్లు, పాల్గొనే పాలసీదారులకు బోనస్ రూ. 52,956 కోట్లు, బోర్డు తుది డివిడెండ్ రూ. 6 ఒక్కో షేరుకు అదనంగా రూ. 4 మధ్యంతర డివిడెండ్ ముందుగా ప్రకటించారు. వ్యక్తిగత వ్యాపారంలో నాన్‌పార్ ఎపిఇ వాటా 943 బిపిఎస్ పెరిగి 18.32 శాతానికి చేరుకుంది. నాన్‌పార్ ఎపిఇ 104.94 శాతం పెరిగి రూ.7,041 కోట్లకు చేరుకుంది. భారతీయ ఎంబెడెడ్ విలువ (ఐఇవి) 24.92 శాతం పెరిగి రూ.7,27,344 కోట్లకు చేరింది. ఎయుఎం 16.48 శాతం పెరిగి రూ.51,21,887 కోట్లకు వచ్చింది. కొత్త వ్యాపారం (విఎన్‌బి) విలువ 4.66 శాతం పెరిగి రూ.9,583 కోట్లకు చేరుకుంది. విఎన్‌బి మార్జిన్ (నికర) 60 బిపిఎస్ పెరిగి 16.8 శాతానికి వచ్చింది. సాల్వెన్సీ రేషియో 1.87 నుంచి 1.98కి పెరిగిందని బోర్డు వివరించింది.

## సాధారణం కంటే అధిక వర్షపాతం

ప్రజాపక్షం / హైదరదాబాద్ : మరో మూడు, నాలుగు రోజుల్లో నైరుతి రుతు పవనాలు కేరళను తాకే అవకాశం ఉన్నదని, ఇందుకు వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించా రు. ఈసారి రుతపవన సీజన్‌లో సాధారణం కంటే అధిక వర్షాలు కురుస్తాయనే అంచనాల్లో అధికారులు ఉన్నారు. మధ్య, దక్షిణ భారత దేశంలో సా ధారణం కంటే ఎక్కువగా, వాయువ్య భారతంలో సాధారణం, ఈశాన్య భా రతంలో సాధారణం కంటే తక్కువగా వర్షాలు కురుస్తాయన్నారు. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు కొనసాగే రుతుపవనాల సీజన్‌లో సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదవుతుందని చెప్పారు. దేశంలో వర్షాలపైనే ఆధారపడ్డ అత్యధిక వ్యవసాయ ప్రాంతాలు కలిగిన కోర్ మాన్సూన్ జోన్‌లో సాధారణం కంటే అధిక వర్షాలు కురుస్తాయని తెలిపారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్ ఈ కోర్ జోన్ పరిధిలోకి వస్తాయి. జూన్‌లో సాధారణ వర్షపాతం నమోదవుతుందన్నారు.

## జివో 510 ద్వారా జరుగుతున్న అన్యాయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి



ప్రజాపక్షం / హైదరాబాద్: ఎన్‌హెచ్‌ఎంలో పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జివో 510 ద్వారా జరుగుతున్న అన్యాయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఎన్.హెచ్.ఎం కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు టిజెఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్‌ను కోరారు. ఈ మేరకు ఎన్.హెచ్.ఎం కాంట్రాక్ట్,అవుట్ సోర్సింగ్ (ఏఐటియుసి) రాష్ట్ర ఉపాధ్యక్షులు బాలసుబ్రమణ్యం, సురేష్, లోకేష్ , ఆయుష్ సంగారెడ్డి అధ్యక్షుడు శ్రీనివాస్ , హైదరాబాద్ జిల్లా నాయకుడు నవ కాంత్ , గౌరీ, చంద్రకళ , శ్రీలక్ష్మి ,మధు తదితరులు పాల్గొన్నారు. నాలుగువేల మంది ఉద్యోగులకు జివో 510ద్వారా అన్యాయం జరుగుతుందని వారు తెలిపారు. ఈ సందర్భంగా కోదండరామ్ మాట్లాడుతూ అన్యాయం జరిగి వారందరికీ న్యాయం చేసేందుకు కృషి చేస్తానని హామీనిచ్చారు. 510 జివో ద్వారా అన్యాయం జరిగిన ఉద్యోగులకు రెగ్యులర్ బేసిక్ ఉద్యోగల వేతనంతో పాటు, క్యాడర్ ఫిక్సేషన్ చేసి,వీటిని 2018 నుంచి అమలు చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

## 'ప్రభుత్వ ఆసుపత్రుల' సమస్యలను పరిష్కరించండి





'కింగ్ కోఠి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి'ని సందర్శించిన ఎఐవైఎఫ్ ప్రతినిధి బృందం

ప్రజాపక్షం / హైదరాబాద్: హైదరాబాద్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) డిమాండ్ చేసింది. హైదరాబాద్ జి ల్లా పరిధిలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో పేషంట్లకు అన్ని రకాల మందులను అందుబాటులో పెట్టాలని, ఖాళీగా ఉన్న డాక్టర్లు, నర్సు పోస్టులను భర్తీ చేయాలని తెలిపింది. ఈ మేరకు ఎఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో కింగ్ కోఠిలోని జిల్లా ఆసుపత్రిని ఎఐవైఎఫ్ ప్రతినిధి బృందం పలు అంశాలపై మంగళవారం సర్వే నిర్వహించింది. సర్వే అనంతరం ఎఐవైఎఫ్ ప్రతినిధి బృందం ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.జి. రాజేంద్రనాథ్‌కు తెలియజేస్తూ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న పరిస్థితులు, పేషంట్లకు అం దుతున్న వైద్యం, అందుబాటులో ఉన్న మందులు, వైద్యుల కొరత తదితర అంశాలపై ఆరా తీసింది. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, ఎఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రజా ఆరోగ్యం పట్ల రాష్ట్ర ప్రభుత్వం ప్ర త్యేక దృష్టి సారించాలన్నారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో అన్ని రకాల డయాగ్నోసిస్ సేవలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని అన్నారు. మెరుగైన వైద్య సేవలను బాధ్యతతో అందించాలని వారు డిమాండ్ చేశారు. కింగ్ కోఠిలోని జిల్లా ఆసుపత్రిలో గత పది రోజులుగా సీటీ స్కాన్ సేవలు అందుబాటులో లేవని, సీటీ స్కాన్ పరీక్షలకు వస్తున్న పేషంట్లకు తీవ్ర నిరాశ ఎదురై, రూ.2వేలతో ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లకు వెళుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో 22 ర కాల ప్రధాన మందుల కొరత ఉన్నదని, మరుగుదొడ్లు సక్రమంగా లేవని, వాష్ బేసిన్‌లకు పైపులు లేక మురుగునీరు పేషంట్‌ల కాళ్ళపై పడుతున్నాయని తెలిపారు. ఆసుపత్రి ఆవరణ చెత్త చెదారంతో అపరిశుభ్రంగా మారిందన్నారు. కాంట్రా క్ట్ పద్ధతిలో ఉన్న డాక్టర్లు, ఇతర వైద్య సిబ్బందిని పర్మినెంట్ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి. సత్య ప్రసాద్, ఎఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్, జిల్లా కార్యవర్గ సభ్యులు మాజీద్, అనిల్, కిరణ్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ కెఎల్ యూనివర్సిటీకి ప్రభుత్వ భూమి కేటాయించొద్దు

ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్

ప్రజాపక్షం / హైదరాబాద్: కెఎల్ ప్రైవేట్ యూనివర్సిటీకి ప్రభుత్వ భూమి కేటాయించొద్దని, విద్యావ్యాపారం చేసే ప్రైవేట్ యూనివర్సిటీకి ప్రభుత్వ భూమి మార్పిడి చేస్తే పోరాటం తప్పదని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠ రెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం మీడియాతో వారు మాట్లాడుతూ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, గాజులరామారం గ్రామం సర్వే నెంబర్ 411,412,413, 427,428 వివిధ సబ్ డివిజన్ లో ఉన్న 5.05 ఎకరాల భూమి కెఎల్ యూనివర్సిటీ 2014 నుండి 2018 మధ్య కాలంలో రైతుల వద్ద నుండి పట్టా భూములు కొనుగోలు చేసి యూనివర్సిటీ పేరు మీద మార్చుకుంటున్నదని, ఈ స్థలం పక్కన ఉన్న సర్వే నెంబర్ 354 లో 15.30 ఎకరాలు గల ప్రభుత్వ భూమిలో 5 ఎకరాలు తమ యూనివర్సిటీకి కేటాయించాలని కోర్టుకు వెళ్లడం, ఆ ప్రభుత్వ భూమిని ఎంఆర్ఓ, రెవెన్యూ ఉన్నతాధికారులు భూమి మార్పిడికి సిద్ధమైనట్టు సమాచారం తెలుస్తున్నదన్నారు. ఈ ప్రభుత్వ భూమి దుండిగల్ గండి మైసమ్మ నుండి మియాపూర్ వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్నదని, కోట్ల రూపాయలలో దాని ధర ఉన్న నేపథ్యంలో రెవెన్యూ అధికారులు అత్యుత్సాహంతో ప్రైవేట్ కెఎల్ యూనివర్సిటీకి భూమి మార్పిడి ప్రక్రియ చేయాలని ఉవ్విళ్లూరుతున్నట్టు కనబడుతున్నదన్నారు. ఈ వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని భూమి మార్పిడి ప్రక్రియను ఆపేయాలని వారు డిమాండ్ చేశారు.

## జూన్ 15, 16తేదీల్లో 'దక్షిణ్ భారత్ ఉత్సవాలు-2024'



ప్రజాపక్షం / హైదరాబాద్: పర్యటక రంగంలో పట్టుబడి అవకాశాలు, ఉపాధి కల్పనలపై అవగాహన కల్పించేందుకు 'దక్షిణ్ భారత్ ఉత్సవాలు – 2024' జూన్ 15,16 తేదీలలో బెంగుళూర్‌లో నిర్వహిస్తున్నట్లు తెలంగాణ టూరిజం ప్రిన్సిపాల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ తెలిపారు. దక్షిణ భారత్ ఉత్సవాలను విజవంతం చే సేందుకు మంగళవారం రాయల్టన్ హోటల్లో రోడ్‌షోను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కర్నాటక, తెలంగాణ టూరిజం శాఖ డైరెక్టర్లు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా శైలజ రామయ్యర్ మాట్లాడుతూ.. ఫెడరేషన్ ఆఫ్ కర్నాటక ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఎఫ్‌కెసిసిఐ), కర్ణాటక ప్రభుత్వం పర్యాటక శాఖ సహకారంతో బెంగుళూరులోని ప్యాలెస్ గ్రౌండ్స్‌లో జరిగే దక్షిణ్ భారత్ ఉత్సవాలు – 2024లో తెలంగాణ టూరిజం అధికారులు పాల్గొంటారన్నా రు. దక్షి ణ భారత రాష్ట్రాల పర్యాటక సామర్థ్యాన్ని ప్రదర్శించడం, పెట్టుబడి అవకాశాలు మరియు ఉపాధి కల్పనకు ప్రాధాన్యత ఈ కార్యక్రమం లక్ష్యంమని పేర్కొన్నారు. దక్షి ణ భారతదేశాన్ని ప్రధాన పర్యాటక రంగంగా తీర్చిదిద్దడం, పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి ఉన్న ఎంఎస్ఎంఇలను ఆహ్వానించడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ రోడ్ షోకులో కర్ణాటక టూరిజం డైరెక్టర్ డాక్టర్ రామ్ ప్రసాత్ మనోహర్ గౌరవ అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షిణ్ భారత్ ఉత్సవ్ సమ్మిళిత వృద్ధిని పెంపొందించడానికి, ఉపాధి అవకాశాలను సృష్టించడానికి మరియు ప్రపంచ పర్యాటక మ్యాప్లో దక్షిణ భారతదేశాన్ని ముందంజలో ఉంచడానికి ఈ ఉత్సవాలు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో టూరిజం శాఖ ఉన్నతాధికారులు రమేష్ చంద్ర లాహోటి, గోకే, ఉమారెడ్డి, కె శివషణ్ముగం, టూరిజం కమిటీ చైర్మన్ జి కె శెట్టి, కో ఆర్డినేటర్ శ్రీ వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే రేషన్ కార్డులు

''ఎక్స్ ''వేదికలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

ప్రజాపక్షం / హైదరాబాద్: ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే రేషన్ కార్డులను పంపిణీ చేస్తామని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్‌కార్డులను అందజేస్తామన్నారు. ఈ మేరకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తన 'ఎక్స్' వేదికలో ట్వీట్ చేశారు. ఇల్లు లేని ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని, అర్హులందరికీ కొత్త పెన్షన్లు కూడా ఇస్తామని, ఆగస్టు 15వ తేదీ లోగా రైతు రుణమాఫీ చేస్తామని స్పష్టం చేశారు. అన్ని గ్రామాల్లో పాఠశాలలు, రోడ్లు, కమ్యూనిటీ హాళ్లు నిర్మిస్తామని, ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతామని తెలిపారు.

## రాష్ట్ర అవతరణ వేడుకలకు రండి

సోనియా గాంధీని ఆహ్వానించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

పదేళ్ల దేశ పురోగతి 'ప్రోగ్రెస్ కార్డు'ను బిజెపి విడుదల చేయాలని వ్యాఖ్య

ఢిల్లీలో మీడియాతో ఇష్టాగోష్టి



ప్రజాపక్షం / హైదరాబాద్: జూన్ 2వ తేదీన జరిగే తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలకు రావాల్సిందిగా ఎఐసిసి అగ్ర నాయకురాలు సోనియా గాంధీని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ధి ఉత్సవాలకు వచ్చేందుకు సోనియా గాంధీ సూత్రప్రాయంగా అంగీకరించారని తెలిపారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం సోనియా గాంధీతో సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో సిఎం మాట్లాడుతూ తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు సోనియాగాంధీని ఆహ్వానించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించిందని, ఆ మేరకు తెలంగాణ ప్రజల తరఫున సోనియా గాంధీని ఆహ్వానించినట్లు తెలిపారు. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం తెలంగాణ ప్రజలకు గొప్ప పండుగ రోజు అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. దేశంలో ధరల పెరుగుదల, నిరుద్యోగం, ఎస్‌సి, ఎస్‌టి, ఓబిసి రిజర్వేషన్లు రద్దు చేయడం, రాజ్యాంగాన్ని మార్చడం అంశాలను లేవనెత్తితే, బిజెపికి పాకిస్థాన్ గుర్తొస్తుందన్నారు. ఈ క్రమంలోనే పదేళ్ల దేశ పురోగతి ప్రోగ్రెస్ కార్డును బిజెపి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పదేళ్ల పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు గాంధీ కుటుంబాన్ని టార్గెట్ చేస్తున్నారని రేవంత్‌రెడ్డి విమర్శించారు. దేశ ప్రధాని, ప్రధాని కుర్చీని కాంగ్రెస్ ఎప్పుడూ అగౌరవ పరచలేదని తెలిపారు. డిపాజిట్లు కూడా రానిచోట మెజారిటీ సీట్లు వస్తాయని బిజెపి బీరాలు పలుకుతుందని, మోదీ గ్యారెంటీ వారంటీ ఖతం అయ్యిందని ఎద్దేవా చేశారు. బిజెపి మాటలు వినేందుకు దేశ ప్రజలు సిద్ధంగా లేరని, బిజెపిని గద్దె దించాలని దేశ ప్రజలు నిర్ణయించుకున్నారని ఆయన అన్నారు. ఇండియా కూటమి కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికలు వచ్చినప్పుడల్లా ప్రధాని మోదీకి పాకిస్థాన్ గుర్తొస్తుందని, పాకిస్థాన్ ప్రధాని పుట్టినరోజు వేడుకలకు ఎవరు వెళ్లారని సిఎం ప్రశ్నించారు. మోదీ ఇష్టం మేరకు వెళ్లి పాక్ ప్రధానిని కౌగిలించుకున్నారని వ్యాఖ్యానించారు.

## రాహుల్ గాంధీ ప్రధాని అయితే పాత చట్టాలను మారుస్తారు

కాంగ్రెస్ పార్టీ సినియర్ నేత వి.హనుమంతరావు



ప్రజాపక్షం / హైదరాబాద్ : బ్రిటిష్ కాలంలో తెచ్చిన చట్టాలలో మార్పులు చేయాల్సిన అవసరం ఉందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ ఎం.పి. వి. హనుమంతరావు అన్నారు. గాంధీ భవన్‌లో ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ నల్సార్ వర్సిటీ వి.సి. సూచించిన చట్టాలను, మార్పులను స్వాగతిస్తున్నట్లు చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ కేసు దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఎలాంటి పురోగతి లేదన్నారు. చట్టాలలో సమూలంగా మార్పు జరగాలన్నారు. రాహుల్ గాంధీ ప్రధాని అయితే ఇలాంటి చట్టాలను మారుస్తాడన్నారు. జ్యూడిషియల్ రిమాండ్‌ను 14 రోజుల కంటే ఎక్కువ రోజులు పెంచాలన్నారు. చట్టాలపై ప్రజలకు నమ్మకం పోతుందని, నల్సార్ యూనివర్సిటీ వి.సి. కొత్తగా మూడు చట్టాలను సూచించారని తెలిపారు. దోషులకు త్వరగా శిక్ష పడుతుందని, బాధితులకు త్వరగా న్యాయం జరుతుందన్నారు. పేదల ఇంట్లో ఆడపిల్లలను తీసుకెళ్లి రేపు చేసి చంపితే ఇప్పటి వరకు ఆ కుటుంబాలకు న్యాయం జరగలేదన్నారు. నర్మదా బచావోలో రైతులకు న్యాయం జరగటానికి 23 ఏండ్లు పట్టిందన్నారు. వారి తరుపున మేఘా పాట్కర్‌కి ఎంతో పోరాటం చేసిందన్నారు. దోషులకు త్వరగా శిక్ష పడితే తప్పు చేయకుండా అందరిలో భయం ఉంటుందన్నారు. అందరికి ఉపయోగ పడే చట్టాలను తేవడానికి ఎన్నో అడ్డంకులు ఉన్నాయన్నారు. ఇందిరాగాంధీ పంచిన భూములు కూడా ఇప్పుడు దొంగల చేతిలోకి పోయాయని అన్నారు. లిక్కర్ కేసులో కేసులో పురోగతి లేదన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కూడా దోషులను వెంటనే శిక్షించాలని కోరారు. క్రిమినల్ నయిమ్ దాచిన డబ్బులు ఏమైనవి, ఆయన డైరీ ఎక్కడికి పోయిందని ప్రశ్నించారు.

## సౌమ్య కేసులో స్పందించిన ప్రభుత్వం

కృతజ్ఞతలు వ్యక్తం చేసిన సిపిఐ జాతీయ కార్యాదర్శి నారాయణ



ప్రజాపక్షం / హైదరాబాద్: అమెరికాలో రోడ్డు ప్రమాదంలో మరణించిన యాదగిరిగుట్టకు చెందిన విద్యార్థిని సౌమ్య (22) మృతదేహాన్ని హైదరాబాద్‌కు తరలించేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టడంపై సిపిఐ జాతీయ కార్యాదర్శి డాక్టర్ కె.నారాయణ కృతజ్ఞాతలు తెలిపారు. ఉన్నత చదువుల కోసం అమెరికాకు వెళ్లిన సౌమ్య ఆదివారం ఫ్లోరిడాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. సమాచారం అందుకున్న సౌమ్య కుటుంబ సభ్యులు దుఖ్ఖసాగరంలో మునిగారు. అయితే అమెరికా నుంచి సౌమ్య మృతదేహాన్ని తీసుకురావడంలో ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని నారాయణ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం సౌమ్య మృతదేహాన్ని తల్లి దండ్రులకు అప్పగించేందుకు సత్వరంగా తగిన ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సంబంధిత అధికారులను ఆదేశించింది.తన విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకుని ప్రభుత్వం వెంటనే స్పందించిన తీరుపట్ల నారాయణ కృతజ్ఞాతలను తెలియజేశారు.

## రాష్ట్ర రాజముద్రలో కాకతీయ తోరణం, చార్మినార్ ఉంటే రాచరిక పోకడనా?

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి రామారావు

ప్రజాపక్షం / హైదరాబాద్: ప్రముఖ కళాకారుడు అలె లక్ష్మణ్ తయారు చేసిన రాష్ట్ర రాజముద్రలో తెలంగాణ చరిత్రకు, సాంస్కృతిక వారసత్వానికి, 'గంగాజమునా తహజీబు'కు ప్రతీకలైన కాకతీయ తోరణం, చార్మినార్ ఉంటె అది రాచరిక పోకడనా అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు అని ప్రశ్నించారు. ఈ మేరకు కెటిఆర్ తన ఎక్స్‌లో ట్విట్ చేశారు. రాష్ట్ర గీతంలో మాత్రం అదే చార్మినార్, గోల్కొండ నవాబుల గొప్ప వెలుగే చార్మినార్ అని పాడుకోవాలని, కాకతీయ కళాప్రభల కాంతిరేఖ రామప్ప అని అదే రాచరిక పరిపాలన గురించి ప్రస్తుతించాలి కెటిఆర్ అన్నారు. అసలు ముఖ్యమంత్రి, మంత్రిమండలిలో ఉన్న ఒక్కరికైనా రాష్ట్రగీతంలో ఏమున్నదో తెలుసా అని ఎద్దేవా చేశారు.

## ఎన్‌టిఆర్‌కు ఘన నివాళి









ప్రజాపక్షం / హైదరాబాద్ : దివంగత మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు ఎన్‌టిరామారావు 101వ జయంతిని పురస్కరించుకొని హైదరాబాద్ ఎన్‌టిఆర్ ఘాట్ వద్ద ఆయనకు కుటుంబసభ్యులు నివాళులర్పించారు. హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌లోని ఎన్‌టిఆర్ ఘాట్‌లో సినినటులు బాలకృష్ణ, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురంధేశ్వరి, నందమూరి రామకృష్ణ, లక్ష్మి పార్వతి, జూనియర్ ఎన్‌టిఆర్, కల్యాణ్ రామ్, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంఎల్‌ఎ బక్కని నర్సింహులు, మాజీ మంత్రులు మోత్కుపల్లి నర్సింహులు, గొరట్ల బుచ్చయ్య చౌద రి, టిడిపి తెలంగాణ సమన్వయకర్త కంభంపాటి రామ్మోహన్ రావులు పలుమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎన్‌టిఆర్ ట్రస్ట్ సౌజన్యంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని రక్తదా నం చేశారు. నందమూరి రామకృష్ణ ముఖ్యఅతిథిగా పాల్గొని రక్తదానం చేశారు. మీడియా కమి టీ ఛైర్మన్ ప్రకాశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## త్వరలో తెలంగాణ సిఎస్, డిజిపి మార్పు?

ఆల్ ఇండియా సర్వీసెస్ అధికారుల బదిలీల నేపథ్యంలో మార్పులుంటాయని సమాచారం

అవినీతి, అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులకు ఉద్వాసన

రంగం సిద్ధం చేసుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం?





ప్రజాపక్షం / హైదరాబాద్: త్వరలో ఆల్ ఇండియా సర్వీసెస్ అధికారుల బదిలీలు భారీగా జరగనున్నట్లు సమాచారం. దీంతో తెలంగాణ సహా పలు రాష్ట్రాల్లో ఉన్నతాధికారులు స్థానాలలో మార్పులు, చేర్పులు జరిగే అవకాశం ఉంది. అందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి, డిజిపిలతో పాటు పలువురు సీనియర్లకు స్థాన చలనం కలగనున్నట్లు కనిపిస్తోంది. రానున్న రాష్ట్ర బడ్జెట్ రూపకల్పన నేపథ్యంలో సమర్థుడైన అధికారి కోసం ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చర్యలు చేపట్టినట్లు తెలిస్తోంది. మరోవైపు పోలీస్ శాఖలో సైతం సీనియర్ ఐపిఎస్‌ల బదిలీలు కూడా జరగవచ్చని అధికారవర్గాలు అంటున్నాయి. ఇటీవల జరిగిని అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్ఎస్ ఓడిపోయి, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఇప్పటికే కొంత మంది ముఖ్యమైన అధికారులను మార్చారు. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరించారనే ఆరోపణలు ఉన్న పలు శాఖల ఉన్నతాధికారులను బదిలీ చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సన్నద్ధమౌతున్నట్టు సమాచారం. జూన్ 2వ తేదీన తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సం, 4వ తేదీన లోక్‌సభ ఎన్నికల ఫలితాల అనంతరం రాష్ట్రంలో భారీగా ఉన్నతాధికారుల బదిలీలు ఉంటాయని చెబుతున్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో అవినీతి, అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారుల జాబితాను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.

ప్రజాపక్షం
బుధవారం, మే 29

# విరోధులా, ప్రత్యర్థులా?

రాజకీయాల్లో ప్రత్యర్థులు తప్ప విరోధులు ఉండరనేది ఒకనాటి మాట. అయితే ఎప్పుడైతే (2014) భారతీయ జనతాపార్టీ నరేంద్రమోదీ నాయకత్వంలో తొలిసారి కేంద్రంలో అధికారం స్వాధీనం చేసుకుందో, భారత జాతీయ కాంగ్రెస్‌ను రూపుమాపే ఎజండా (కాంగ్రెస్ ముక్త్ భారత్) చేపట్టిందో అప్పుడు ప్రత్యర్థులు అనే సౌమ్యమైన పదం తెరమరుగైంది; శత్రుత్వం పెచ్చరిల్లింది. దానిని అనుసరించే రాజకీయ పారిభాషికపదకోశంలోకి వ్యక్తిగత నిందాపూర్వక పదాలు ప్రవేశించాయి. రాజకీయపార్టీల సొంత ఏజన్సీలుగా పని చేస్తున్న సోషల్ మీడియా సైట్స్ విచ్చలవిడితనానికి హద్దులు అదుపు లేకుండా పోయాయి. నీచమైన బజారుభాషలో ప్రత్యర్థుల వ్యక్తిగత జీవితాలపై బురదచల్లుడు కొనసాగుతోంది. ఎన్నికల సమయంలో ఇది మరీ పైత్యం పులుముకుంది. ఈ ప్రచారకులు పైశాచిక ఆనందం పొందవచ్చుగానీ, రాజకీయ వాతావరణాన్ని ఎంత నీచంగా కలుషితం చేస్తున్నారో ఆలోచించి ఉండరు. బుర్రలు తాకట్టుపెట్టినవారు ఉచ్ఛనీచాలగూర్చి ఆలోచించలేరు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిపై బిజెపివారు ఇటీవల మరీ నీచమైన ప్రచారానికి దిగారు. అందుకుతగ్గ భాషలోనే ప్రత్యారోపణలు పొందారు. బిజెపివారు విడుదల చేసిన చౌకబారు అడ్వర్టైజ్‌మెంట్లను హైకోర్టు నిలిపివేయగా, వారు అంతటితో సరిపెట్టుకోకుండా తమకు అన్యాయం జరిగిపోయిందంటూ సుప్రీంకోర్టుకెక్కి చీవాట్లు తిన్నారు. బిజెపివారి అడ్వర్టైజ్‌మెంట్లు 'ప్రాథమికంగా అవమానించేవిగా' ఉన్నాయని న్యాయమూర్తులు జె.కె.మహేశ్వరి, కె.వి.విశ్వనాథన్ అభిప్రాయపడ్డారు. 'వ్యక్తిగతంగా కించపరచే, నిందలువేసేవిగా' ఉన్న ఆ వ్యాపార ప్రకటనలపై హైకోర్టు ఇచ్చిన నిలుపుదల ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోవటానికి న్యాయమూర్తులు తిరస్కరించారు. 'మీ గూర్చి మీరు గొప్పలు చెప్పుకోవచ్చు. మీరే అత్యుత్తములమని మీరు చెప్పుకోవచ్చు...అయితే వైరం పెంచటానికి మేము (కోర్టు) మీకు తోడ్పడలేము' అని జస్టిస్ విశ్వనాథన్ బిజెపి తరపు న్యాయవాది ద్వారా ఆ పార్టీకి సున్నితంగా మొట్టికాయవేశారు. ఆ వ్యాపార ప్రకటనలు 'ఓటర్లకు ప్రయోజనకరం కాదు. అవి చర్చను దిగజార్చుతాయి' అన్నారు. 'మీరు ఇక్కడికి వచ్చి విషయాలను ఎందుకు తీవ్రతరం చేస్తున్నారని' జస్టిస్ మహేశ్వరి ప్రశ్నించారు. హైకోర్టు సింగిల్ జడ్జీ తమ వాదన వినకుండానే తనంతట తాను తాత్కాలిక నిలుపుద ఉత్తర్వు జారీ చేశారని బిజెపి న్యాయవాది మొరపెట్టుకున్నారు. ఈ అడ్వర్టైజ్‌మెంట్లపై తృణమూల్ కాంగ్రెస్ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. ఇసి మే 18న బిజెపికి సంజాయిషి నోటీసు జారీ చేసింది. మే 21 లోగా పార్టీ జవాబు ఇవ్వాలి. ఇసి ప్రొసీడింగ్స్ జరుగుతుండగానే తృణమూల్ కాంగ్రెస్‌పార్టీ మే 20న హైకోర్టుకు వెళ్లిందని బిజెపి న్యాయవాది ఫిర్యాదు చేశారు. జూన్ 4 (ఓట్ల లెక్కింపు రోజు) వరకూ వర్తించేలా హైకోర్టు చక్రం అడ్డు వేసింది. కావాలనుకుంటే చట్టం ప్రకారం మళ్ళీ హైకోర్టుకు వెళ్ళే అవకాశం ఇస్తూ పిటిషన్ ఉపసంహరణకు ధర్మాసనం అనుమతి మంజూరు చేసింది. బిజెపి బహిరంగంగానే రాజకీయ పార్టీల ప్రవర్తనకు సంబంధించిన నమూనా ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించింది. అయినా కోర్టు నుండి ఉపశమనం పొందే ప్రయత్నంలో భంగపాటుకు గురైంది. ప్రధానమంత్రి ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా కుల, మత విభజన ప్రసంగాలు చేస్తున్నా ఆయనను సంజాయిషీ కోరే ధైర్యం లేనిది మన 'స్వతంత్ర' ఎన్నికల కమిషన్. ఎన్నికల కోడ్ ఏమి చెబుతున్నదో చూడండి. ''ఇతర రాజకీయపార్టీలను విమర్శించేటప్పుడు వాటి విధానాలు, కార్యక్రమం, గత పనితీరు రికార్డుకు, పనికి పరిమితం కావాలి. ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తల రాజకీయజీవిత కార్యకలాపాలతో సంబంధంలేని వ్యక్తిగత జీవితంలోని అన్ని అంశాలపైన విమర్శకు దూరంగా ఉండాలి. ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలపై నిరాధార ఆరోపణలు లేదా వక్రీకరణపై ఆధారపడి విమర్శ చేయరాదు''. ఈ ఆదేశాలు ఇప్పటివి కావు, అవి ఎప్పటినుండో ఇంత స్పష్టంగా ఉన్నాయి. కానీ రాజకీయపార్టీల నాయకులు వాటిని ఘోరంగా ఉల్లంఘిస్తున్నా ఎన్నికల కమిషన్ చేష్టలుడిగి కూర్చోవటమే విచారకరం.

# ఆకలి చక్రాన్ని ఎలా విచ్ఛిన్నం చేయాలి?

**మే 28న ప్రపంచ ఆకలి దినోత్సవం**

ఆకలితో ఉన్నవారికి ముందు అన్నం పెట్టు, ఆ తర్వాత వేదం చెప్పు అంటారు స్వామి వివేకానంద. గాలి, నీరు తర్వాత ఆహారం మూడవ అత్యంత ప్రాథమిక మానవ అవసరం. ప్రతి సంవత్సరం మే 28న ప్రపంచ ఆకలి దినోత్సవాన్ని జరుపుకుంటారు. దీర్ఘకాలిక ఆకలితో బాధపడుతున్న వందల మిలియన్ల మంది ప్రజల గురించి అవగాహన కల్పించడం లక్ష్యం. ప్రజలు ఆకలితో జీవించకుండా ఉండేలా స్థిరమైన, శాశ్వతమైన పరిష్కారాన్ని ఇది రూపొందిస్తుంది. 2030లో దాదాపు 600 మిలియన్ల మంది ప్రజలు దీర్ఘకాలికంగా పోషకాహార లోపంతో బాధపడతారని అంచనా వేయబడింది. ప్రపంచవ్యాప్తంగా ఆకలి, పోషకాహార లోపానికి పరిష్కారాలకోసం చెబుతుంది. సంఘర్షణ, వాతావరణ మార్పు, పేదరికం వంటి ఆహార అభద్రతకు దోహదపడే వివిధ కారకాలపై దృష్టి పెడుతుంది. విద్య, మెరుగైన వ్యవసాయ పద్ధతులు, సమాజ సాధికారత ద్వారా సమస్యలను పరిష్కరించడానికి ప్రయత్నాలను వెతకడం దీని లక్ష్యం. ఆహార కొరత, పోషకాహారలోపం అనేవి తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీస్తుందనే కఠినమైన వాస్తవాన్ని నొక్కిచెబుతుంది. ఈ సంవత్సరం థీమ్ అభివృద్ధి చెందుతున్న తల్లులు అభివృద్ధి చెందుతున్న ప్రపంచం. పోషకాహార లోపం గురించి అవగాహన పెంచడం, ఆకలి చక్రాన్ని విచ్ఛిన్నం చేయడంలో ప్రపంచానికి మద్దతు ఇవ్వడం లక్ష్యంగా పెట్టుకుంది.

## ఆహార హక్కు

ప్రతి ఒక్కరికి తగిన ఆహారం పొందే హక్కు ఉంది. ఆహారం, జీవితం, స్వేచ్ఛ,పని, విద్య వంటి మానవ హక్కులు యూనివర్సల్ డిక్లరేషన్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ మరియు అంతర్జాతీయ ఒప్పందాల ద్వారా గుర్తించబడ్డాయి. ప్రపంచవ్యాప్త పురోగతి ఉన్నప్పటికీ మిలియన్ల మందికి ఇప్పటికీ తగినంత ఆహారం అందుబాటులో లేదు. ప్రపంచ ఆహార మరియు వ్యవసాయ సంస్థ ( ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ యఫ్ఎఒ) ప్రకారం ఆకలి అనేది శరీరానికి తగినంత ఆహారాన్ని తీసుకోకపోవడం వల్ల కలిగే అసౌకర్యం లేదా బాధాకరమైన శారీరక అనుభూతి. ప్రపంచ రైతులు ఇప్పటికీ ప్రపంచ జనాభాకు సరిపడా కంటే ఎక్కువ తిండికి తగినంత ఆహారాన్ని ఉత్పత్తి చేస్తున్నారు. అయినా ఆకలి కొనసాగుతోంది. సంఘర్షణ, పదేపదే వాతావరణ షాక్‌లు, ఆర్థిక మాంద్యం కారణంగా ప్రపంచవ్యాప్తంగా 783 మిలియన్ల మంది ప్రజలు ఆకలిని ఎదుర్కొంటున్నారు. 3.1 బిలియన్ల కంటే ఎక్కువ మంది ప్రజలు( 42 శాతం ) ఆరోగ్యకరమైన ఆహారాన్ని కొనుగోలు చేయలేకపోతున్నారు. ఇది పేదలు, బలహీన వర్గాలను తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. ఆకలిని పోషకాహార లోపంగా కూడా సూచించవచ్చు అని తెలిపింది. ఆహార సంక్షోభాలపై తాజా గ్లోబల్ రిపోర్ట్ ప్రకారం 59 దేశాల్లో దాదాపు 282 మిలియన్ల మంది ప్రజలు 2023లో తీవ్రమైన ఆకలిని అనుభవించారు. ప్రపంచవ్యాప్తంగా మునుపటి సంవత్సరంతో పోలిస్తే 24 మిలియన్ల మంది పెరిగారు. పిల్లలు, మహిళలు ఈ ఆకలి సంక్షోభాలలో ముందంజలో ఉన్నారు. 32 దేశాలలో 5 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న 36 మిలియన్ల మంది పిల్లలు తీవ్రమైన పోషకాహార లోపంతో బాధపడుతున్నారని నివేదిక చూపిస్తుంది. 2023లో తీవ్రమైన పోషకాహార లోపం మరింత తీవ్రమైంది. ముఖ్యంగా సంఘర్షణలు మరియు విపత్తుల కారణంగా స్థానభ్రంశం చెందిన వ్యక్తులు పెరిగారు. 2023లో 7,05,000 కంటే ఎక్కువ





మంది ప్రజలు ఐపిసి ఫేజ్ 5 విపత్తు స్థాయిలో ఉన్నారని నివేదించింది. ఈ రిపోర్ట్స్ చరిత్రలో ఇదే అత్యధిక సంఖ్య. ఇంకా 2016 నుండి నాలుగు రెట్లు పెరిగింది అని తెలిపింది. గాజా స్ట్రిప్, దక్షిణ సూడాన్, బుర్కినా ఫాసో, సోమాలియా,మాలీలతో పాటు 80 శాతం మంది కరువును ఎదుర్కొంటున్నారని తెలిపింది.. జిఆర్ఎఫ్సి 2024 భవిష్యత్తు ఔట్‌లుక్ ప్రకారం గాజా స్ట్రిప్‌లో సుమారు 1.1 మిలియన్లు, దక్షిణ సూడాన్‌లో 79000 మంది ప్రజలు జూలై 2024 నాటికి విపత్తు ఐపిసి ఫేజ్ 5 లో ఉంటారని అంచనా వేయబడింది. సంఘర్షణ అభద్రతను తీవ్రతరం చేయడం, ఆర్థిక షాక్‌ల ప్రభావాలు, విపరీతమైన వాతావరణ సంఘటనల ప్రభావాలు తీవ్రమైన ఆహార అభద్రతను కొనసాగిస్తున్నాయి. గ్లోబల్ హంగర్ ఇండెక్స్ 2023 ప్రకారం, బెలారస్, బోస్నియా, హెర్జెగోవినా, చిలీ, చైనాలు తక్కువ ఆకలి స్థాయిలను కలిగి ఉన్నాయి. యెమెన్, మడగాస్కర్, సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్‌లలో పరిస్థితి ఘోరంగా ఉంది.సంక్షోభాలు సామాజిక, ఆర్థిక అసమానతలను తీవ్రతరం చేశాయి. ప్రపంచ వ్యాప్తంగా ఆకలిని తగ్గించడంలో పురోగతికి ఆటంకం కలిగించాయి. ప్రపంచ ఆహార, వ్యవసాయ సంస్థ (ఎఫ్ ఎఒ) ఆహార హక్కు మార్గదర్శకాలను విడుదలచేసింది. ఇవి తగిన ఆహారం కోసం మానవ హక్కును గ్రహించడానికి దేశాలు చేపట్టవలసిన కార్యక్రమాలను సూచిస్తాయి. ఆహార హక్కు మార్గదర్శకాలు ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక హక్కును అర్థం చేసుకొని అమలు కోసం చేపట్టాల్సిన చర్యలను సిఫార్సు చేస్తాయి. వాటిని మూడు విభాగాలుగా విభజించారు. మొదటి విభాగం మార్గదర్శకాల లక్ష్యాన్ని, రెండోది జవాబుదారీ యంత్రాంగాల హక్కు అమలుకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించడంతో పాటు పంతొమ్మిది మార్గదర్శకాలను, మూడోది అంతర్జాతీయ సంస్థలు ఆహారం కోసం మానవ హక్కును నెరవేర్చడానికి చేపట్టవలసిన చర్యలను సూచిస్తుంది. మార్గదర్శకాలు 2030 ఎజెండాను సాధించడంలో చెప్పుకోదగ్గ పురోగతిని సాధించడానికి దోహదపడ్డాయి.

## తల్లికి పోషకాహారం

ప్రపంచవ్యాప్తంగా యుద్ధం, కరువు, వాతావరణ మార్పులు మరెన్నో కారణంగా మహిళలు, పిల్లలు పోషకాహార లోపాన్ని ఎదుర్కొంటున్నారు. ప్రపంచ వ్యాప్తంగా, ఐదు సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలలో 45 శాతం మరణాలకు పోషకాహార లోపం కారణమని అంచనా వేయబడింది. ఒక బిలియన్ కంటే ఎక్కువ మంది కౌమార బాలికలు, మహిళలు నేడు పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. ప్రభావాలు తల్లి నుండి బిడ్డకు వ్యాపిస్తాయి. పోషకాహారలోపం ఉన్న తల్లులు పోషకాహార లోపం ఉన్న పిల్లలకు జన్మనిస్తారు. ఇది పిల్లల మెదడు అభివృద్ధి, వారి భవిష్యత్తుపై కోలుకోలేని ప్రభావాలకు దారితీస్తుంది.

## ఆహార భద్రత

ఆహార భద్రత అంటే తగినంత మొత్తంలో సరసమైన, పౌష్టికాహారానికి విశ్వసనీయమైన ప్రాప్యతను కలిగి ఉండటం. ఆరోగ్యం, శ్రేయస్సు, ఆర్థిక స్థిరత్వానికి ఇది కీలకం. శారీరక, మానసిక అభివృద్ధికి సరైన పోషకాహారం చాలా అవసరం. ఆహార అభద్రత ఆర్థిక అస్థిరత, సామాజిక అశాంతికి దారితీస్తుంది. స్థిరమైన ఆహార సరఫరా గొలుసులు బలమైన కార్మిక మార్కెట్‌లకు మద్దతునిస్తాయి.ఆర్థిక వృద్ధిని ప్రోత్సహిస్తాయి. స్థిరమైన వ్యవసాయ పద్ధతులు సహజ వనరులను కాపాడతాయి, జీవవైవిధ్యాన్ని ప్రోత్సహిస్తాయి. స్థిరమైన వ్యవసాయ పద్ధతులను అమలు చేయడం ద్వారా భవిష్యత్ తరాలకు స్థిరమైన ఆహార సరఫరాను నిర్ధారించగలము.

## ఆకలి చక్రం అంటే ఏమిటి?

ఆరోగ్యకరమైన ఆహారం, సరైన పోషకాహారం లేకపోవడం వల్ల కుటుంబాలు వారి ఆర్థిక వనరులను క్షీణింపజేసే చక్రంలో చిక్కుకోవచ్చు. ఒక వ్యక్తి లేదా కుటుంబానికి ఆహార అభద్రత ఏర్పడినప్పుడు చాలాసార్లు వారు తక్కువ పోషక విలువలు కూడిన ఆహారాన్ని కొనుగోలు చేస్తారు. ఇవి దీర్ఘకాలిక వ్యాధులు మరియు మానసిక క్షోభను కలిగిస్తాయి. అదే సమయంలో దీర్ఘకాలిక ఆకలి మరియు పోషకాహార లోపం, ఉద్యోగం, విద్య పనితీరును ప్రతికూలంగా ప్రభావితం చేస్తుంది. పేదరికం నుండి తప్పించుకోవడం మరింత కష్టతరం చేస్తుంది. ఆర్థిక ఒత్తిడి మరిన్ని ఒత్తిడిలను జోడిస్తుంది. ఇది మరింత ఆర్థిక కష్టాలను కలిగిస్తుంది మరియు గృహస్థులు తీవ్రమైన ఆహార అభద్రతను అనుభవించేలా చేస్తుంది. ప్రపంచవ్యాప్తంగా 42 శాతం మంది ప్రజలు ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోలేదు. ఇది దీర్ఘకాలిక ఆకలి చక్రాన్ని శాశ్వతం చేస్తుంది. చాలా తక్కువ ఆదాయ గృహాలకు తాజా పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, తక్కువ కొవ్వు పాల ఉత్పత్తులు, ప్రోటీన్లు వంటి పోషకాలు అధికంగా ఉండే ఆహారాలు అవసరం. ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందరికీ మరింత అందుబాటులోకి తేవాలి. ఆహార అభద్రతను ప్రభావితం చేసే మరో అంశం అసమానత యొక్క లోతుగా పాతుకుపోయిన వ్యవస్థలు. ఆకలి అనేది తరచుగా పేదరికం యొక్క లక్షణం. ఆకలితో పోరాడాలంటే మనం దాని ప్రధాన కారణం అయిన అసమానతలతో పోరాడాలి. ఆహార వృథాన్ని తగ్గించాలి. ప్రపంచ ఆకలిని పరిష్కరించడంలో ఆహార పరిశ్రమ కీలక పాత్ర పోషిస్తుంది. స్థిరమైన వ్యవసాయ పద్ధతులను అనుసరించాలి, ప్రోత్సహించాలి. ఆహార వ్యర్థాలను తగ్గించాలి. స్థానిక రైతులకు మద్దతు ఇవ్వాలి. స్థిరమైన పద్ధతులు దీర్ఘకాలిక ఆహార భద్రతను నిర్ధారించడంలో సహాయపడతాయి.

జనక మోహన రావు దుంగ
8247045230

# చేనేతను ఛిద్రంచేస్తున్న జిఎస్‌టి

భారతదేశం చేనేత వస్త్రానికి పుట్టి నిల్లు. కోట్లాది ప్రజలకు ఉపాధి కల్పించ గల కుటీర పరిశ్రమ. మనదేశంలో వ్యవసాయం తర్వాత ఎక్కువ మందికి ఉపాధి కల్పించేది ఒక్క చేనేత పరిశ్రమ మాత్రమే. దేశవ్యాప్తంగా దాదాపు 90 లక్షల కుటుంబాలు ఆధారపడి బతుకుతున్నాయి. అంతేకాదు భారత చేనేతకు ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు కూడా ఉంది. బ్రిటిష్ పాలనా కాలంలో మనదేశంలో కుటీర పరిశ్రమలన్నీ పూర్తిగా దెబ్బతిన్నాయి. స్వాతంత్ర్యానంతరం ఈ రంగాన్ని కాపాడుకోవాలనే లక్ష్యంగా ప్రభుత్వాలు తీర్మానించుకున్నాయి. తదనుగుణంగా దేశ ఆర్థికవ్యవస్థ ప్రారంభమైనప్పటి నుంచి చేనేత రంగానికి పన్ను మినహాయింపు కల్పించారు. ఈ రంగ ఉత్పత్తులు, ముడిసరకు వగైరాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏ విధమైన ప్రత్యక్ష పరోక్ష పన్నులు వేయరాదని భారత రాజ్యాంగంలోని అధికరణ 43లో స్పష్టంగా పేర్కొనడం కూడా జరిగింది. దానిలో కుటీర పరిశ్రమల సంరక్షణ, పరిరక్షణ ప్రభుత్వాల బాధ్యత అని పేర్కొన్నారు. కానీ, తర్వాత కాలంలో చేనేతకు గ్రహణం పట్టింది. పవర్లూమ్ రంగప్రవేశంతో చేనేతకు ఆదరణ తగ్గింది. ప్రభుత్వాలు రక్షణ కల్పించలేకపోవడం వల్ల చేనేత పరిశ్రమకు కష్టాలు పెరిగాయి. పోటీని తట్టుకొని నిలబడే పరిస్థితి క్రమంగా క్షీణించింది. ప్రపంచీకరణ నేపథ్యంలో ఈ పరిశ్రమ మరింత బలహీనపడింది. ఫలితంగా చేనేత కార్మికుల వలసలు పెరిగాయి. మరోవైపు పోత్సాహకాలను ప్రభుత్వాలు నెమ్మదిగా తగ్గించుకుంటూ వచ్చాయి. ఫలితంగా చేనేత రంగం సంక్షోభం దిశగా ప్రయాణించడం మొదలయ్యింది. 2011 లెక్కల ప్రకారం దేశంలో 43.3 లక్షల కుటుంబాలు చేనేతరంగంలో ఉంటే, తాజా లెక్కలప్రకారం 30.44 లక్షల కుటుంబాలే మిగిలాయి. 25 శాతం కుటుంబాలు పరిశ్రమను విడిపోవడం శోచనీయం. జిఎస్టి అమలులోకి రాకముందే దేశవ్యా ప్తంగా వస్త్రాలపై సింగిల్ పాయింట్ పన్ను ఉండేవి. పన్ను చెల్లించాక ఎన్ని లావాదేవీలు నిర్వహించినా అదనపు పన్ను ఉండేది కాదు, విలువ ఆధారిత పన్ను (వ్యాట్) అమల్లోకి వచ్చాక చేనేతపై ఐదు శాతం పన్ను విధించారు. తర్వాత కార్మికుల నుంచి వ్యతిరేకత రావడంతో అది ఎత్తేశారు. కేంద్ర ప్రభుత్వం కొన్నేళ్ల క్రితం జిఎస్టి అమల్లోకి తేవడంతో 2017లో మళ్లీ 5 శాతం పన్ను అమల్లోకి తెచ్చారు. దీనిపై చేనేత కార్మికులు ఎంత పోరాటం చేసిన వెనక్కు తగ్గలేదు. పైగా చేనేత, జౌళిరంగానికి చెందిన అనేక బోర్డులు, నియంత్రణ, అభివృద్ధి సంస్థలను కేంద్రప్రభుత్వం రద్దు కూడా చేసింది. వీటితోపాటు వస్త్రపరిశ్రమ ఆధునీకరణతో చేనేత కార్మికుల బతుకులు దేశంలో దినదినగండంగామారాయి. దీనికిఅనుగుణంగా నూలు, రసాయనాలు, రవాణా సౌకర్యాలు రోజురోజుకి పెరిగిపోవడం భారం అయింది. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో ప్రభుత్వం ఆదుకోవాల్సిందిపోయి



గతంలో ఉన్న 5 శాతానికి అదనంగా జిఎస్టిని మరో 7 శాతం జిఎస్టి వేసి మొత్తం కలిపి ఉత్పత్తులపై 12 శాతంగా భారాన్నిమోపింది. ఈ పెంపు భారందేశంలోని చేనేతరంగంపై కోలుకోలేని దెబ్బతీయనుంది.

## ప్రధాని మోదీ శుష్కవాగ్దానాలు

చేనేత ఉత్పత్తులకు సంపూర్ణంగా మద్దతు ఇద్దాం! చేనేతకు చేయూతనిస్తూ 'ఆత్మ నిర్భర్ భారత్, దిశగా ప్రయత్నాలను బలోపేతం చేద్దాం అంటూ ఈ ఏడాది ఆగస్టు 7వ తేదీన జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ సందేశం ఇచ్చారు. నాలుగు నెలలు గడవకముందే కేంద్ర ప్రభుత్వం చేనేతరంగాన్ని నిర్వీర్యం చేసే, నేతన్నల వెన్ను విరిచే నిర్ణ యం తీసుకుంది. చేనేత, జౌళి పరిశ్రమలపై ప్రస్తుతం 5 శాతంగా ఉన్న జిఎస్టిని రాబోయే నూతన సంవత్సరం జనవరి ఒకటి నుంచి ఏకంగా 12 శాతానికి పెంచేందుకు పచ్చ జెండా ఊపింది. ఇప్పటికే సవాలక్ష సమస్యలకు తోడు కరోన వంటి విపత్కర పరిస్థితులలో అవ సాన దశలో ఉన్న చేనేత రంగానికి ఈ నిర్ణయం మరణ శాసనమే. చిత్రం ఏమిటంటే ఇతర ఉత్పత్తులకు ఒకే రకమైన జిఎస్టి అమలు అవుతుంటే చేనేత వస్త్రాలపై మాత్రం విభిన్న రకాలు అమలవుతున్నాయి. చిలువనూలు నుంచి రంగు, రసాయనాలపై తయారైన వస్త్రాలపై జిఎస్టి విధిస్తున్నారు. అంటే చేనేత మగ్గంపై తయారుచేసే వస్త్రాలపై 40 శాతం నుంచి 50 శాతం వరకు జిఎస్టి పడుతుంది. ఈ రంగంపై ఆధారపడిన కార్మికుల ఆదాయాలు చూస్తే చాలా స్వల్పంగా ఉన్నాయి. తక్షణమే చేనేత వస్త్రాలపై పెంచిన జీఎస్టీని తగ్గించాలని చేనేత కార్మికులు, వస్త్ర వ్యాపారులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. చేతి కష్టంతో ఎంతో కళాత్మకంగా రూపొందించే చేనేత వస్త్రాల ధరలు కాస్త ఎక్కువగా ఉండటంతో ఇప్పటికీ ఆశించిన స్థాయిలో ఉండటం లేదు. జౌళి రంగంలోనూ సూక్ష్మ, చిన్న పరిశ్రమలను ఆదుకోవలసిన అవసరం ఉంది. ఇదా ప్రోత్సాహం? : చేనేతకు అండగా నిలవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. వృత్తి సేవారంగంగా చేనేతను పాలకులు ప్రోత్సహించాలి. దానికి పరిశ్రమ హోదా ఇచ్చి రాయితీలు, ప్రోత్సాహకాలను అందించాలి. కేంద్ర ప్రభుత్వం ఆత్మ నిర్భర్ భారత్ పథకాన్ని తెచ్చినప్పటికీ చేనేతకు, చిన్నజౌళి పరిశ్రమలకు ఒరిగిందేమీలేదు. రంగులు, రసాయనాలు, నూలు ధరలు గత ఏడాదినుండి బాగా పెరిగాయి. కరోనా తర్వాత బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు చేనేత పరిశ్రమను ఆదుకునేందుకు ముందుకు రావడంలేదు. భారీ పెట్టు బడులు పెట్టే సంస్థలకి రాయితీలు లభిస్తున్నాయి. రాష్ట్రాల సంగతి అటుంచితే, కేంద్రం నుంచి చేనేత కార్మికుల కోసం సమర్థ పథకం ఒకటి ఆసరాగా నిలవడం లేదు. ఇప్పుడు జిఎస్టి 12 శాతానికి పెంచ డం వల్ల చేనేతకు జౌళి రంగంలోని చిన్న పరిశ్రమలకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. చేనేతను కాపాడుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక ప్యాకేజీ సత్వరం ప్రకటించాలి. చేనేత కార్మికుల వలసలు, అప్పులతో ఆత్మహత్యలు, బలవంతపు మరణాలు నుండి కాపాడాలి.

కె.బాపురావు
సెల్:95533 07006

# సాంస్కృతిక అధోజగత్-రేవ్ పార్టీ

వందల సంవత్సరాలకు పూర్వం పాశ్చాత్య దేశాలలో పార్టీలంటే లింగ బేధం లేకుండా అలవాటున్న వారందరూ ఒకచోటచేరి కేవలం మద్యం సేవించడం. కాలక్రమంలో ఈ పార్టీలు మార్పు చెందుతూ మద్యం సేవించడంతో పాటు డ్యాన్స్ చేసే పార్టీలుగా రూపుదిద్దుకున్నాయి. 1990 నాటికి ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలలో ఈ డాన్స్ పార్టీలలో మద్యంతో పాటు అమ్మాయిలతో అశ్లీల నృత్యాలు చేయించడమే కాకుండా, యాంఫేటమిన్, ఎల్ఎస్డీ, కెటామైన్, మెథాంఫేటమిన్ , కొకైన్ , గంజాయి వంటి మాదకద్రవ్యాలు రహస్యంగా వినియోగించడం ప్రారంభమై రేవ్ పార్టీల విషసంస్కృతి ప్రపంచానికి పరిచయమైంది. భారతదేశంలో పాశ్చాత్య సంస్కృతి రోజు రోజుకు పెరిగిపోతోంది. ఈ క్రమంలోనే పాశ్చాత్య దేశాల రేవ్‌పార్టీల సంస్కృతి మనదేశంలో కూడా వ్యాప్తి చెందుతుంది. సెలెబ్రిటీలు, డబ్బున్న బడాబాబులు అక్కడే చదువుకోవటమో, లేదా తీరిక సమయాల్లో అక్కడికివెళ్లి తనివితీరా ఎంజాయ్ చేసి వస్తుండటమో జరుగుతోంది. ఇలా అక్కడున్న కొన్ని కల్చర్ల రుచికి అలవాటు పడిన సెలెబ్రిటీలు, ప్రముఖుల పిల్లలు అదే ట్రెండ్‌ను ఇక్కడ కూడా కొనసాగించే ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగా మన దేశానికి వచ్చిందే ఈ రేవ్ పార్టీ. భారతదేశంలో రేవ్ పార్టీల ధోరణి గోవా నుంచి ప్రారంభమైంది. హిప్పీలు దీనిని గోవాలో ప్రారంభించారు. తరువాత ఇటువంటి పార్టీల ధోరణి అనేక నగరాల్లో పెరుగుతూ వచ్చింది. గత కొన్ని సంవత్సరాలుగా హిమాచల్‌లోని కులు లోయ, బెంగుళూరు, పూణే, ముంబై వంటి అనేక నగరాలు వీటికి హాట్స్పాట్లుగా నిలిచాయి. కాస్త వైల్డ్ బిహేవియర్తో చేసుకునే ఈ రేవ్ పార్టీలో పాల్గొనే వారిని రేవర్స్ అని పిలుస్తారు.రేవ్ అన్న పదం జమైకా భాష నుంచి వచ్చింది. చెవులు దద్దరిల్లే మ్యూజిక్తో ఈ పార్టీలలో యువతీ యువకులు ఆల్కహాల్ తో పాటు డ్రగ్స్ ను కూడా తీసుకుంటూ చీకటిలో లేజర్ లైట్ల వెలుగులో మ్యూజిక్ సుప్లే చేస్తుంటే ఒళ్ళు మరిచి వివేకం కోల్పోయి వాయివరసలు లేకుండా డాన్సులు చేస్తుంటారు. యువత అన్నీ మరిచి చిందులు వేయడానికి ఈ రేవ్ పార్టీలో అన్ని ఏర్పాట్లు ఉంటాయి. ఈ రేవ్ పార్టీ కల్చర్ చట్ట విరుద్ధమైన కార్యకలాపాలకు వేదికగా మారుతుంది.రేవ్ పార్టీ సుదీర్ఘంగా సాగే పార్టీ. ఈ పార్టీలో పాల్గొనాలంటే పెద్ద మొత్తంలో డబ్బు ఖర్చు చేయాల్సి ఉంటుంది. రేవ్ పార్టీలు 24 గంటల నుంచి మూడు రోజుల వరకు నిర్వహిస్తారు.ఒకప్పటి రాక్ 'ఎన్ రోల్ యుగం, హిప్పీ యుగం, డిస్కో మరియు ర్యాప్ లాగా ఇప్పుడు ఈ రేవ్ యుగం. అయితే వీటన్నిటికంటే ఈ ' రేవ్' ది ఏ హద్దులు లేని విచ్చలవిడి సంస్కృతి. ఈ రేవ్ పార్టీలో పాల్గొనాలంటే మద్యం సేవించడం, డ్రగ్స్ తీసుకోవడం, విచ్చలవిడిగా వ్యభిచారం చేయడం, అవసరానికి మించినధనం కలిగి ఉండటం లాంటి అవలక్షణాలు ఉండాలి.అందుకే ఈ రేవ్ పార్టీలకు ఎంపిక చేసిన కొంతమందికి మాత్రమే అవకాశం కల్పిస్తారు.

గోప్యతపై పూర్తి శ్రద్ధ వహిస్తారు. 'రేవ్' అంటే మంచైనా చెడైనా హద్దు లేకుండా ప్రవర్తించడమే.హద్దులు, జాత్యహంకారం, పక్షపాతం, లింగభేదం, నియమాలు, తుపాకీలు, ద్వేషం ఇలాంటివి ఏమీ లేకుండా కేవలం శాంతి, ప్రేమ, ఐక్యత, గౌరవంతో నిండిన ప్రపంచం లోకి తీసుకెళ్లడమే 'రేవ్' సంస్కృతని సమర్థించుకునే ప్రబుద్ధులు కూడా ఉన్నారు. నిజమే డ్రగ్స్‌కు బానిసలైన మనుషులకు ఇవేవీ ఆలోచించే స్పృహ ఉండదు కదా. దేశానికి వెన్నెముకగా నిలవాల్సిన యువత వేరే ప్రపంచమని సమర్థించుకుంటూ మత్తు పదార్థాలకు బానిసలైతే భావి తరాల పరిస్థితి ఏమవుతుందో ఆలోచించండి.

ననుబోలు రాజశేఖర్,
9885739808,8330969808

పౌర సమాజ శ్రేయస్సే లక్ష్యంగా

# ఐరాస శాంతి కపోతాలు

**29 మే 'అంతర్జాతీయ ఐరాస శాంతి స్థాపకుల దినం' సందర్భంగా**



ఐక్యరాజ్యసమితి ఏర్పాటు చేసిన ప్రపంచ శాంతి సంరక్షణ దళంలోకి (యూయన్ పీస్ కీపర్స్) 18– 29 ఏండ్ల వయసున్న యువ స్వచ్ఛంద సేవా కార్యకర్తలుగా మిలిటరీ, పోలీసు, పౌరులను ఎంపిక చేసి ప్రపంచ పౌర సమాజ రక్షణ, ప్రమాదకర ప్రదేశాల్లో సహాయం, యుద్ధ క్షతగాత్రులను ఆదుకోవడం, ఆకలిచావుల్ని ఆపడం, విపత్తు చేయూత, అశాంతి నెలకొన్న ప్రాంతాల్లో బలగాలను మోహరించడం లాంటి పలు మానవీయ మిషన్లకు నిర్వహిస్తూ ప్రపంచ శాంతి నెలకొల్పే ప్రయత్నాలను ఐరాస శాంతి పరిరక్షణ దళాలు నిర్వహిస్తున్నాయి. అంకితభావం, ధైర్యం, సేవా తత్పరత చూపించే ఐరాస శాంతి స్థాపన దళ సభ్యుల నిస్వార్థ విశ్వహిత విధులను ప్రస్తుతించడం, విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన వీరులకు నివాళులు అర్పించడం, అసమాన ప్రతిభ కనపరిచిన యోధులకు పురస్కారాలు ప్రదానం చేయటానికి ప్రతి ఏటా 29 మే రోజున 'అంతర్జాతీయ ఐరాస శాంతి స్థాపన దళ దినం (ఇంటర్నేషనల్ డే ఫర్ యూయన్ పీస్ కీపర్స్)' పాటించుట ఆనవాయితీగా వస్తున్నది. ప్రపంచ శాంతి పరిరక్షణ విధుల్లో అవిశ్రాంతంగా పని చేస్తూ నేటి వరకు దాదాపు 4000 మంది అమరత్వం పొందడం జరిగింది.

ప్రపంచ మానవాళి ఎదుర్కొన్న కోవిడ్19 విపత్తు వేళ ఐరాస శాంతి స్థాపక దళం మానవ శ్రేయస్సు కోసం మరింత శ్రమించాల్సి వచ్చిందని మనకు తెలుసు. 29 మే 1948న ఐరాస ఏర్పాటు చేసిన శాంతి పరిరక్షణ దళం తొలిసారి మిడిల్ ఈస్ట్ ప్రాంతంలో అరబ్–ఇజ్రాయిల్ యుద్ధ కాల్పుల విరమణ విధులు నిర్వహించుటతో ప్రారంభమైన దళ ప్రస్థానం నేటికి 72 యూయన్ శాంతి స్థాపన మిషన్లలో ఒక మిలియన్ యువతీయువకులు తమ అమూల్య సేవలను అందించి, అనేక మిలియన్ల ప్రపంచ ప్రజలను కాపాడగలిగారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 14 శాంతి పరిరక్షణ ఆపరేషన్లలో 125 దేశాలకు చెందిన 1,00,000మంది మిలిటరీ, పోలీసు, పౌరులు శాంతి స్థాపన యజ్ఞంలో తమ సేవలను అందిస్తున్నారు. అంతర్జాతీయ ఐరాస శాంతి పరిరక్షణ దళ దినం వేదికగా ఐరాస ప్రధాన కార్యాలయం, న్యూయార్క్ వద్ద శాంతి దళ ప్రేమికుల సేవలను కొనియాడడం, 'డగ్ హమ్మర్‌స్కోల్డ్, 'మిలిటరీ జెండర్ అడ్వకేట్ ఆఫ్ ది ఇయర్' పతకాల ప్రదానం, విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన వీరులకు శ్రద్ధాంజలి ఘటించడం జరుగుతున్నది. యూయన్ పీస్‌కీపర్లుగా మహిళలను కూడా తీసుకోవాలన్న నిర్ణయం ప్రకారం, పలు దేశాల మహిళలు పోలీస్, పైలెట్, మిలిటరీ పరిశీలకులు లాంటి రంగాల ద్వారా ధీరవనితలుగా సేవలందిస్తున్నారు. ఐరాస శాంతి స్థాపన మిషన్లలో ఇండియా ప్రధాన భూమికను నిర్వహిస్తున్నది. ఇప్పటి వరకు 5,400 మంది దేశ బలగాలు సైప్రస్, కాంగో, లెబనాన్, మిడిల్ ఈస్ట్, సూడాన్, పశ్చిమ సహార, సోమాలియా లాంటి పలు ప్రాంతాల్లో విశిష్ట సేవలను అందించడం జరిగింది. 2002లో జరిగిన ఐరాస సర్వసభ్య సమావేశంలో తీసుకున్న తీర్మానం ప్రకారం 29 మే 2003 నుంచి అంతర్జాతీయ ఐరాస శాంతి స్థాపన దళ దినం పాటించుట ఆనవాయితీగా మారింది. అంతర్జాతీయ ఐరాస శాంతి స్థాపన దళ దినం2024 నినాదంగా 'ఉజ్వల భవిత తగ్గట్లు : కలిసి మెరుగ్గా నిర్మిద్దాం (ఫిట్ ఫర్ ది ఫ్యూచర్ : బిల్ బెట్టర్ టుగెదర్)' అనే అంశాన్ని తీసుకోవడం జరిగింది. ప్రపంచ మానవాళి అనుభవిస్తున్న కరోనా విపత్తు సమయాన ఐరాస శాంతి పరిరక్షణ దళం విభాగపు బాధ్యతలు మరింతగా పెరిగాయి.

విశ్వశాంతి, ప్రజా భద్రతే ఊపిరిగా విధులలో ప్రాణాలను సహితం లెక్కచేయక శ్రమిస్తున్న శాంతి యువ కపోతాల సేవలను ప్రస్తుతిద్దాం. ప్రపంచ శాంతి సర్వవ్యాప్తం కావాలని ఆశిద్దాం.

డా: బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

## అనుమతులు లేకుండా మట్టి తరలింపు



**ప్రజాపక్షం/గుండాల :** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం లోని అన్ని గ్రామాలలో అనుమతులు లేకుండా అక్రమంగా నల్ల మట్టిని అక్రమార్కులు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమార్కులు సంబంధిత రెవెన్యూ, భూగర్భ శాఖ అధికారులకు మామూళ్లు ఇచ్చి దందాను ఎదేచ్ఛగా కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ,ప్రైవేటు స్థలాలల నుండి మట్టిని తరలించాలంటే తప్పని సరిగా అనుమతులు తీసుకొని, పన్నులు చెల్లిస్తూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం మట్టిని తరలించాల్సి ఉంటుంది కాని అక్రమార్కులకు ప్రభుత్వ నిబంధనలు పట్టకుండా ఇష్టం వచ్చినట్లుగా మట్టిని తవ్వి తరలిస్తూ కోట్లు సంపాదిస్తూ ప్రభుత్వానికి గండి కొడుతున్నారు. జేసిబిలతో మట్టిని ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా మట్టిని రూ. 5వేల నుండి, రూ. 7వేల వరకు అమ్ముకుంటున్నారు. యథేచ్ఛగా మట్టిని అక్రమంగా తరలిస్తున్న వారిని పట్టించుకునే నాధుడే కరువయ్యారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు, పోలీసు శాఖ వారు స్పందించి మట్టి అక్రమ రవాణాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## ఉద్యోగరీత్యా ఉన్నతస్థాయికి ఎదగాలి




ఎంఎల్ఎ బాలునాయక్

**ప్రజాపక్షం/దేవరకొండ :** విద్యార్థులు కష్టపడి చదివి ఉద్యోగ రిత్యా ఉన్నత స్థాయికి ఎదగాలని ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎస్టీ మేరిస్ హైస్కూల్ లో ఏర్పాటు చేసిన 202324 విద్యా సంవత్సరంలో పదవ తరగతి ఫలితాలలో 100శాతం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు సర్టిఫికేట్స్, మెమోంటోలను ఎంఎల్ఏ అందజేశారు. భవిష్యత్తులో ఇంకా బాగా కష్టపడి చదివి ఉన్నత స్థాయిలో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం ఎంఎల్ఏ ను ప్రిన్సిపాల్ నక్షత్రమ్మ, ఉపాధ్యాయ బృందంతో కలిసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నేరేడుగొమ్ము ఎంపిపి బిక్కునాయక్, ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు ఉన్నారు.

## శోభాయాత్రలో ప్రభుత్వ విప్ బీర్ల



**ప్రజాపక్షం/ఆలేరు :** ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలో హనుమాన్ శోభాయాత్రలో ఆలేరు శాసనసభ్యులు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పాల్గొని ముందుగా పూజలు నిర్వహించి హనుమాన్ శోభయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన భక్తి భావంతో కొనసాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ గంధమల్లా అశోక్, మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశ్వరరాజు, గ్రామ శాఖ అధ్యక్షుడు విజేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి చాద రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్, కాటంరాజు, బండపల్లి మహేష్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## 1 నుండి ట్రాఫిక్ కొత్త నిబంధనలు

అతిక్రమిస్తే భారీ జరిమానాలు

**ప్రజాపక్షం/అలంపూర్ :** జూన్ 1వ తేదీ నుండి కొత్త ట్రాఫిక్ నిబంధనలు అమల్లోకి రానున్నాయని వాటిని అతిక్రమిస్తే భారీ జరిమానాలు తప్పవని అలంపూర్ సబ్ ఇన్స్పెక్టర్ నాగరాజు హెచ్చరించారు. మంగళవారం ఆయన నూతన ట్రాఫిక్ నిబంధనలు గురించి వివరించారు. అతివేగంతో వాహనం నడిపుతూ పట్టుబడితే రూ.1000 నుంచి రూ.2000 వరకు జరిమానా కట్టాల్సి ఉంటుందన్నారు. లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే రూ.500, మైనర్ వాహనం నడిపితే రూ.25 వేలు జరిమానా విధించనున్నట్లు తెలిపారు.

## వర్షం వస్తే 3 కిలోమీటర్ల మేర యాతన



ఈ రహదారికి వెళ్లాలంటే రైతులకు, వాహనాదారులకు కష్టాలే

**ప్రజాపక్షం/మునగాల :** వర్షకాలంలో కొద్దిపాటి వర్షం వచ్చిన ఈ రహదారికి వెళ్లాలంటే రైతులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఈ రహదారి మండల పరిధిలోని బరాఖత్‌గూడెం గ్రామ శివారులోని ఎన్ఎస్‌పి కాలువ వద్ద నుండి ఎక్లాస్‌ఖాన్ పేట రోడ్డు వెళ్లే వరకు చాల విశాలంగా ఉండేది.కాని రైతులు పొలాల గట్లను చెక్కడం ద్వారా రహదారి ఇరుకుగా ఏర్పడింది. నేడు ఈ రహదారి మూడు కిలో మీటర్ల మేర గుంతలమయంగా మారిపోయింది. గత పదేళ్లుగా రైతులు ప్రభుత్వాలకు మొరపెట్టుకున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పట్టించుకున్న పాపన పోలేదు. గత ఎన్నికల్లో ప్రస్తుత ఎంఎల్ఏ పద్మావతిరెడ్డి ఈ రహదారికి నిధులు వెచ్చించి పనులు చేపడతామని చెప్పినట్లు రైతులు పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చి నాలుగు నెలలైన ఈ రహదారికి నిధులు విడుదల చేయలేదని రైతులు అంటున్నారు. ఈ రహదారికి పనులు చేపడితే మూడు గ్రామాలకు రాకపోకలు సాగుతాయని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే నిధులు విడుదల చేసి పనులు పూర్తి చేయాలని రైతులు, గ్రామస్తులు కోరుతున్నారు.

# ఫీజు దోపిడీ..!

## ప్రైవేట్ విద్యాసంస్థల్లో నియంత్రణ ఏది...?



**ప్రజాపక్షం/ సూర్యాపేట ప్రతినిధి :** ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు ఇష్టానుసారంగా ఫీజులు పెంచుతూ దోపిడికి పాల్పడుతున్నారు. ప్రతి విద్యాసంవత్సరం 20 నుండి 30శాతం వరకు ఫీజులు పెంచుకుపోతున్నారు. పాలకులు ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడికి కళ్లెం వేస్తామని ఏళ్ళ తరబడి నుండి చెబుతున్న ఆచరణలో పెట్టడం లేదు. దీంతో యాజమాన్యాలు ఎవరికి వారు ఫీజులు పెంచుకుంటూ పోతుండడంతో పేదింటి విద్యార్థులకు ప్రైవేట్ విద్య అందని ద్రాక్షలా మారింది. సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా అధికారులు తెలిపిన లెక్కల ప్రకారం 248 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. యాజమాన్యాలు ఎల్‌కేజీ నుండి మొదలుకోని పదవ తరగతి వరకు వేలల్లో ఫీజులు వసూళ్లు చేస్తున్నారు. సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్ల, తిరుమలగిరి మున్సిపల్ కేంద్రాల్లో ప్రైవేట్ పాఠశాలలు పెద్ద మొత్తంలో ఉండగా జిల్లాలో 23 మండలాల్లో కూడా కనీసం మండల కేంద్రంలో రెండు నుండి మూడు ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయి. యాజమాన్యాలు వసూళ్లు చేస్తున్న ఫీజుల విషయాన్ని పరిస్థిలిస్తే ఎల్‌కేజీ చదివే విద్యార్థికి రూ. 25వేల నుండి మొదలుకోని రూ. 40వేల వరకు వసూళ్లు చేస్తున్నారు. ఇలా 5వ తరగతి వరకు ప్రతి సంవత్సరం తరగతికి 20 నుండి 30శాతం వరకు ఫీజులు పెంచుకుంటుపోతున్న పరిస్థితి. 6వ తరగతి తరువాత ఐఐటీ ఫౌండేషన్ పేరుతో అదనంగా వసూళ్లు చేస్తున్నారు. 6వ తరగతి విద్యార్థికి 60వేల నుండి 75వేల వరకు ఫీజు తీసుకుంటున్నారు. 10వ తరగతి విద్యార్థులకు రూ. 80 నుండి రూ. 1.5లక్షల ఫీజును ముక్కుపిండి వసూళ్లులు చేస్తున్నారు. దీనికి తోడు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఐఐటీ, టాలెంట్, ఈ టెక్నో, ఒలంపియాడ్, ఎక్సలెంట్, ఎలైట్ వంటి ఆకర్షణీయమైన పేర్లతో కార్పోరేట్ స్థాయిలో విద్యను అందిస్తామంటూ బ్రోచర్లను ముద్రిస్తూ గ్రామ స్థాయిలో నుండి మొదలుకోని పట్టణ స్థాయి వరకు పెద్ద ఎత్తున ప్రచారాలు నిర్వహిస్తున్నారు. దీనికి తోడు పాఠశాలలో పని చేయాలంటే ప్రతి ఉపాధ్యాయులకు, సిబ్బందికి అడ్మిషన్లు చేపించాలనే నిబంధనలు పెడుతున్నారు.

### ఫీజు నియంత్రణ ఏది..?

ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు నియంత్రణ చేయడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారు. విద్యాసంవత్సరం ప్రారంభంలో కాస్తా హడావుడి చేస్తూ వారి దోపిడిని అడ్డుకట్ట వేస్తామని ప్రకటనలు చేస్తూ చేతులు దులుపుకుంటున్నారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమని గ్రహించిన సామాన్యులు సైతం తమ పిల్లల భవిష్యత్ కోసం వారి తహతకు మించి ప్రైవేట్ పాఠశాలల్లో తమ పిల్లలను చదివించేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీన్ని ఆసరగా చేసుకుంటున్న ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఇదే అదునుగా చేసుకోని వారిని జలగల్లా పీల్చుకుంటూ ఫీజుల దోపిడికి పాల్పడుతున్నారు. గత పాలకులు ఫీజు నియంత్రణ కోసం ఎన్నో జీఓలు ఇచ్చారు. అవి ఏవి కూడా అమలుకు నోచుకోలేదు. వసూళ్లు చేసిన ఫీజుల్లో యాజమాన్యాలు 50శాతం వేతనాలకు, 15శాతం పాఠశాల నిర్వహణకు, మరో 15శాతం విద్యుత్, అద్దెకు, ఇంకో 15 శాతం సిబ్బంది బీమా భవిష్యత్ నిధికి కేటాయించాలని నిబంధనలు జారీ చేసిన ఎక్కడ కూడా ఇది అమలుకు నోచుకోకపోవడం గమనార్హం.

### ప్రతిదీ వ్యావారమే...

ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విద్యతో పాటు ప్రతిది వ్యాపారంగానే చూస్తున్నారు. విద్యార్థుల నుండి అందినకాడికి దోచుకునేందుకు యూనిఫాంల నుండి మొదలుకోని టై, బెల్టు, షూలతో పాటు పాఠ్యపుస్తకాలు, నోటు బుక్కులు, పెన్ను, పెన్సిల్ ల వరకు అమ్మేందుకు ప్రత్యేకంగా స్కూల్ ఆవరణంలోనే దుకాణాన్ని తెరుస్తున్నారు. ఏ విద్యార్థికి ఏది అవసరం ఉన్న అందులోనే కొనుగోలు చేయాలన్న నిబంధన పెడుతున్నారు. ఆ వస్తువులను బహిరంగ మార్కెట్ కంటే 50శాతం అధిక ధరలకు అమ్మి సోమ్ము చేసుకుంటున్నారు. విద్యార్థుల తల్లి దండ్రుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకోవడంతో పాటు ప్రభుత్వ ఆజమాయిషి లేకపోవడంతో వీరు ఆడిందే ఆట పాడిందే పాటగా సాగుతుంది. ఇప్పటికైన పాలకులు స్పందించి ప్రైవేట్ పాఠశాలల దోపిడికి కళ్లెం వేయ్యాలని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు.

## తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు ఏర్పాట్లు

జిల్లా కలెక్టర్ ఎస్ వెంకట్రావ్




**ప్రజాపక్షం/ సూర్యాపేట కలెక్టరేట్ :** జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు జిల్లా వ్యాప్తంగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్ వెంకట్రావ్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్, శాసన మండలి ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎన్నికల సంఘం సూచనల మేరకు ఆవిర్భావ వేడుకలు జరుపుకోవాలని సూచించారు. జిల్లాలో ఎక్కడ కూడా వేడుకల్లో కోడ్ వైలేషన్ కాకుండా చూడాలన్నారు. ఆవిర్భావ వేడుకల్లో ఉద్యమకారుల త్యాగాలు, స్మరించుకోవాలన్నారు. జిల్లాలో గ్రామ పంచాయతీలలో నుండి జిల్లా పరిషత్ కార్యాలయాలు, మున్సిపాలిటిలల్లో వేడుకలు నిబంధనల మేరకు జరుపుకోవాలని సంబంధిత అధికారులను సూచించారు. కలెక్టరేట్ ఆవరణలో ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వేడుకల్లో శకటాలు, స్టాల్స్, ఆస్తుల పంపిణీ లాంటివి చేపట్టరాదని, సాంస్కృతిక కార్యక్రమంలో తక్కువ బృందాలతో చేపట్టాలని, ఎక్కడ కూడా ఫ్లాగ్ కోడ్ 2002ను అనుసరించి ప్లాస్టిక్ జెండాలు ఆవిష్కరణలో చేపట్టరాదని సూచించారు. శాసన మండలి ఎన్నికలు అధికారులు, సిబ్బంది సమర్ధవంతంగా ఎక్కడ కూడా సమస్యలు ఉత్పన్నం కాకుండా విజయవంతంగా నిర్వహించినందుకు అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బిఎస్ లత, అదనపు ఎస్‌పి నాగేశ్వర్ రావు, ఎఆర్ అదనపు ఎస్‌పి జనార్ధన్ రెడ్డి, సిఈఓ అప్పారావు, డిఆర్‌డిఓ మధుసూదన్ రాజు, డిఎఫ్ఓ సతీష్ కుమార్, డిఈఓ అశోక్, డిపిఓ సురేష్ కుమార్, సిపిఓ కిషన్, డిఎస్ఓ మోహన్ బాబు, డిడబ్ల్యూఓ వెంకటరమణ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### 15లోగా సిఎంఆర్ డెలవరీ పూర్తి చేయాలి

ఖరీఫ్ సీజన్ 2023/24కు సంబంధించిన సిఎంఆర్ పెట్టని వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ఎస్ వెంకట్రావ్ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఖరీఫ్ సీజన్ 2023 /24గాను సిఎంఆర్ రైస్ డెవరీపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 15లోగా సిఎంఆర్ డెవరీ చేయాలన్నారు. నిర్దేశిత సమయంలోగా మిల్లర్లు వారికి కేటాయించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. సిఎంఆర్ పకాయి ఉన్న రైస్ మిల్లర్లు సకాలంలో మిల్లింగ్ చేసి సిఎంఆర్ అప్పగించకపోతే అట్టి మిల్లులపై చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశానికి హాజరు కాని రైస్ మిల్లుల యజమానులకు రెవెన్యూ సమన్స్ ఇవ్వాలని జాయింట్ కలెక్టర్‌ను ఆదేశించారు. మిల్లుల వారిగా వారి లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. అదనపు కలెక్టర్ లత, అదనపు ఎస్‌పి నాగేశ్వర్ రావు, ఎఆర్ అడిషనల్ ఎస్‌పి జనార్ధన్ రెడ్డి, డిఎస్ఓ మోహన్‌బాబు, సివిల్ సప్లై డిఎం రాములు, డిఎం మార్కెటింగ్ సోమశేఖర్ శర్మ, ఎఎస్ఓ పుల్లయ్య, కోదాడ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు, కార్యదర్శి మధు, జయప్రకాష్, సూర్యాపేట మిల్లర్స్ అసోసియేషన్ కార్యదర్శి చంద్రశేఖర్, డిటిసిఎస్‌లు రాంరెడ్డి, రాజశేఖర్, నాగలక్ష్మీ , విజయశేఖర్, మిల్లుల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

## రెచ్చిపోతున్న కల్తీపాల వ్యాపారులు



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** ఎస్వోటీ పోలీస్‌లు వరుస దాడులు చేస్తున్నప్పటికీ మండల వ్యాప్తంగా కల్తీ పాల వ్యాపారులు రెచ్చిపోతూ ప్రాణాలతో చెలగాట మాడుతున్నారు. తాజాగా మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం ముక్తాపూర్, భీమనపల్లి కనుముక్కల గ్రామాలలో కల్తీ పాలు తయారు చేస్తూ విక్రయిస్తు వ్యాపారాలు చేస్తున్న వారిపై వరుస దాడులు జరిపారు. కల్తీ పాలు తయారుచేస్తున్న ముగ్గురు అదుపులోకి తీసుకొని పోచంపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ముక్తాపూర్ గ్రామానికి చెందిన కల్తీ వ్యాపారి సన్న ప్రశాంత్ అనే వ్యక్తిని పట్టుకొని అతని వద్ద నుండి 60 లీటర్ల కల్తీ పాలు, 250 హైడ్రోజన్ పెరాక్సైడ్, 8 ప్యాకెట్ల దోల్పూర్ స్కిమ్డ్ మిల్క్ పౌడర్ స్వాధీనం చేసుకున్నారు. కల్తీ పాల వ్యాపారం చేస్తున్న మిగిలిన ఇద్దరు వ్యక్తుల నుండి కల్తీ పాల తయారీకి ఉపయోగపడే మెటీరియల్ స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పచెప్పారు.ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుగుతున్నట్లు ఎస్సై భాస్కర్ రెడ్డి తెలిపారు

## తూతూ మంత్రంగా తనిఖీలు

పత్తి విత్తనాల కొరత సృష్టిస్తున్న డీలర్లు..
చర్యలు తీసుకోవాలని రైతు సంఘం డిమాండ్

**ప్రజాపక్షం/డిండి :** ప్రభుత్వం వ్యవసాయ అధికారులు పత్తి విత్తనాల విక్రయ అనుమతిపొందిన డీలర్లు రైతులకు నాణ్యమైన పత్తి విత్తనాలు కేవలం రూ. 864కే అందించాలని సూచించిన ఎక్కడ అధికారుల ఆదేశాలను పాటించకుండా డీలర్లు పత్తి విత్తనాల కొరత సృష్టించి రూ. 1300లకు పైగా విత్తనాలను రైతులకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారని అధికారులు వ్యవసాయ అధికారులు ముమ్మరంగా దాడులు నిర్వహించి కొరత సృష్టించి అధిక ధరలకు పత్తి విత్తనాలు అమ్ముకుంటున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని లైసెన్స్ తిరస్కరించాలని సిపిఐ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎండి. మైనోద్దీన్ మంగళవారం అధికారులకు సూచించారు. సీజన్ ప్రారంభంలోనే ఇలాంటి అక్రమాలకు డీలర్లు పాల్పడి రైతులను మోసం చేస్తే ఊరుకునేది లేదని తక్షణమే వ్యవసాయ అధికారులు అప్రమత్తమై రైతులకు న్యాయం చేయాలని కోరారు. రైతులకు ప్రభుత్వ సబ్సిడిపై సరిపడా జీలుగా, జనుము విత్తనాలు సరఫరా చేయాలని వ్యవసాయ అధికారులను మైనోద్దిన్ కోరారు.

## ఫిట్‌నెస్‌లేని పాఠశాల బస్సులపై చర్యలు తీసుకోవాలి

**ప్రజాపక్షం/గుండాల :** రాష్ట్రంలో పాఠశాలలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఫిట్‌నెస్ లేని పాఠశాలల బస్సులపై అధికారులు చర్యలు తీసుకోవాలని మండల వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ పాఠశాలలో ఉన్న బస్సులను అధికారులు తనిఖీ చేసి ఫిట్‌నెస్ లేని వాహనాలను తనిఖి చేసి చర్యలు తీసుకోవాలని ఫిట్‌నెస్ లేని వాహనాలు నడపడం వలన రోడ్డు మధ్యలో వాహనాలు చెడిపోయి విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని అనుభవజ్ఞులేన డ్రైవర్లను ఎంపిక చేసి విద్యార్థుల భవిష్యత్తును కాపాడే విధంగా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న తరుణంలో తక్షణమే మండల వ్యాప్తంగా ఉన్న పాఠశాలల వాహనాలకు ఫిట్‌నెస్ పరీక్షలు చేసి ఫిట్ నెస్ లేని వాహనాలను సీజ్ చేయాలని ఆర్డిఏ అధికారులను ప్రజలు కోరుతున్నారు.

## బ్యాలెట్ బాక్సుల స్ట్రాంగ్‌రూమ్‌కు సీల్




**ప్రజాపక్షం /నల్లగొండ :** నల్లగొండ, ఖమ్మం, వరంగల్ శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నికల పోలింగ్ ఆదివారం ముగిసిన తర్వాత ఆయా జిల్లాల నుండి బ్యాలెట్ బాక్సులను సోమవారం నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని అనిశెట్టి దుప్పలపల్లి గోదాంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లలో ఉంచి ఎన్నికల పరిశీలకుల సమక్షంలో వాటికి సీల్ వేశారు. నల్లగొండ,ఖమ్మం,వరంగల్ శాసన మండలి పట్టభద్రుల నియోజకవర్గం పరిధిలోకి వచ్చే 12 జిల్లాల నుండి వచ్చిన బ్యాలెట్ బాక్సులన్నింటిని అనిశెట్టి దుప్పలపల్లి గోదాంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములలో ఎన్నికల సంఘం పరిశీలకులు రాహుల్ బొజ్జ సమక్షంలో, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు ,వారి ఏజెంట్లు హాజరుకాగా, జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి దాసరి చందన, జిల్లా ఎస్పీ చందనా దీప్తి ఆధ్వర్యంలో బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూములలో భద్రపరచడం జరిగింది. బ్యాలెట్ బాక్సులు భద్రపరిచిన స్ట్రాంగ్ రూముల వద్ద గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగింది.దుప్పలపల్లి గోదాం మొత్తం పూర్తిగా స్థానిక పోలీస్ తో పాటు, సిఆర్పిఎఫ్ భద్రతలో ఉంచడం జరిగింది. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, డిఎఫ్ఓ రాజా శేఖర్,డిఆర్‌డిఓ నాగిరెడ్డి,డిపివో మురళి, పిఆర్‌ఈఈ భూమన్న, ఎస్ బి డి ఎస్ పి రమేష్, బిజెపి నుండి ఎలక్షన్ ఏజెంట్ నాగం వర్షిత్ రెడ్డి,తీన్మార్ మల్లన్న ఏజెంట్ కాళీ,అభ్యర్ధి రవి,బిఆర్ఎస్ నుండి అధికారిక ఏజెంట్ తదితరులు ఉన్నారు.

## ఎంఎల్‌సి నియోజకవర్గవ్యాప్తంగా 72.44% పోలింగ్

అత్యధికంగా యాదాద్రి జిల్లాలో 78.59 శాతం
అత్యల్పంగా ఖమ్మం జిల్లాలో 67.62 పోలింగ్ శాతం నమోదు

**ప్రజాపక్షం / నల్లగొండ ప్రతినిధి :** నల్లగొండ, వరంగల్, ఖమ్మం శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నికలకు ఈ నెల 27న నిర్వహించిన పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. పోలింగ్ అనంతరం అన్ని జిల్లాల నుండి పోలైన బ్యాలెట్ బాక్సులను భారీ భద్రత మధ్య నల్లగొండ సమీపంలోని అనిశెట్టి దుప్పలపల్లి వద్ద ఉన్న వ్యవసాయ గోడౌన్ లోని స్ట్రాంగ్ రూమ్‌కు చేరాయి. నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, జనగాం, హనుమకొండ, వరంగల్, ములుగు, మహబూబాబాద్, సిద్దిపేట, జయశంకర్ భూపాలపల్లి, ఖమ్మం ,భద్రాద్రి కొత్తగూడెం 12 జిల్లాలలో ఉన్న నాలుగు లక్షల 63,839 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు వారి ఓటు హక్కు వినియోగించుకునేందుకు 605 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు ఎంఎల్ సి ఎన్నికల పోలింగ్ అన్ని 12 జిల్లాల పరిధి లో 27వ తేదీ ఉదయం 8 గంటలకు ప్రారంభమై ఎలాంటి అంతరాయం లేకుండా శాంతియుత వాతావరణం జరిగింది. కొన్ని జిల్లాలలో సాయంత్రం 7 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. గ్రాడ్యుయేట్ ఎంఎల్ సి నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 72.44 పోలింగ్ నమోదు కాగా, అత్యధికంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో 78.59 పోలింగ్ నమోదయింది. అత్యల్పంగా ఖమ్మం జిల్లాలో 67.62 పోలింగ్ శాతం నమోదయింది. జిల్లాల వారీగా తుది పోలింగ్ శాతం వివరాలు యాదాద్రి భువనగిరి జిల్లా 78.59 జనగాం 76.34 , సిద్దిపేట 76.13 , ములుగు 74.58 జయశంకర్ భూపాలపల్లి 73.62 , నల్లగొండ 73.29 , సూర్యాపేట 73.15 , వరంగల్ 72.68 ,హనుమకొండ 72.45 , మహబూబాబాద్ 72.15 , భద్రాద్రి కొత్తగూడెం 69.95, ఖమ్మం 67.62 నమోదయింది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అన్ని 12 జిల్లాల జిల్లా ఎన్నికల అధికారులు పోలింగ్ కేంద్రాలలో అవసరమైన మౌలిక సౌకర్యాలను కల్పించడం జరిగింది. ఎంఎల్‌సి ఎన్నికలలో ఓటు వేయడంలో ఓటర్లు ఎలాంటి గందరగోళానికి గురికాకుండా, అలాగే చెల్లని ఓట్లను నివారించేందుకు ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఓటు వేసే సమయంలో ఓటర్లు చేయవలసిన పనులు, చేయకూడని పనులపై ఫ్లెక్సీలను ప్రదర్శించడం జరిగింది. గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికలలో యువత ప్రత్యేకించి మహిళలు పెద్ద ఎత్తున క్యూలైన్లలో నిలబడి ఓటు వేయడం విశేషం. అన్ని 12 జిల్లాల జిల్లా కలెక్టర్లు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరించిన అడిషనల్ కలెక్టర్లు, పోలీస్ అధికారులు, జిల్లా స్థాయి అధికారులు, ఎంఎల్ సి ఎన్నికల పోలింగ్‌ను ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవడం జరిగింది. పోలింగ్ సందర్భంగా అన్ని 12 జిల్లాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ ను విధించడమే కాకుండా, పోలింగ్ కేంద్రాలలోకి సెల్ ఫోన్లు, ఇంకు పెన్నులు, వాటర్ బాటిళ్ల వంటివి తీసుకురాకుండా నిషేధం విధించడం జరిగింది. పోలింగ్ సందర్భంగా చట్ట వ్యతిరేక కార్యక్రమాలు, చిన్న చిన్న సంఘటనలు వంటివి జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు చర్యలు తీసుకోవడం జరిగింది. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద హెల్ప్ డెస్క్ లతోపాటు, ప్రథమ చికిత్స సౌకర్యాలను ఏర్పాటు చేయడమైనది. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారితో పాటు,నల్లగొండ, వరంగల్ , ఖమ్మం శాసనమండలి పట్టభద్రుల ఉపఎన్నికల రిటర్నింగ్ అధికారి నల్లగొండ జిల్లా కలెక్టర్ 12 జిల్లాలలో నిర్వహించిన పోలింగ్ ప్రక్రియను వెబ్ క్యాస్టింగ్ ద్వారా పర్యవేక్షించడం జరిగింది. నల్లగొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంతో పాటు, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం నుండి 12 జిల్లాలలో ఏర్పాటు చేసిన 605 పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించడం జరిగింది.

### కృతజ్ఞతలు తెలిపిన ఎన్నికల అధికారి

నల్లగొండ, ఖమ్మం, వరంగల్ శాసనమండలి పట్టభద్రుల ఉప ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడంలో సహకరించిన పోటీలో ఉన్న అభ్యర్థులు, రాజకీయ పార్టీలు, పట్టభద్రులైన ఓటర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, పోలీసు, రెవెన్యూ అధికారులు,12 జిల్లాల సిబ్బంది,జిల్లా కలెక్టర్‌లకు జిల్లా ఎన్నికల అధికారి, నల్లగొండ,ఖమ్మం, వరంగల్ శాసనమండలి పట్టభద్రుల ఉపఎన్నికల రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన కృతజ్ఞతలు తెలిపారు.

# సన్నాల వైపు రైతన్న చూపు

- తెలంగాణ సోనా రకానికి డిమాండ్
- ఉమ్మడివరంగల్ జిల్లాలో పెరగనున్న సాగు
- అదనంగా 1.85లక్షల సాగుకు అవకాశం



**ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి :** రాష్ట్రంలో రైతులు పండించే సన్న వడ్లకు క్వింటాళుకు రూ. 500 చొప్పున బోనస్ ఇచ్చే పథకాన్ని వచ్చే వర్షకాలం సీజన్ నుంచే అమలుచేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఖరీఫ్‌లో సన్న రకం వరి సాగు గణనీయంగా పెరుగనుంది. సాధారణ వరి సాగు విస్తీర్ణం కన్నా అదనంగా 15 నుంచి 20 శాతం పెరగవచ్చని వ్యవసాయఅధికారులు అంచనా వేస్తున్నారు. సాధారణంగా ఖరీఫ్‌లో వరి సాగు 80 నుంచి 82 శాతం ఉంటుంది. రబీలో దొడ్డ రకాలనే రైతులు ఎక్కువగా సాగుచేస్తారు. ఖరీఫ్‌లో నీటి అందుబాటు, సానుకూల వాతావరణం దృష్ట్యా రైతులు సహజంగానే సన్న రకం వరి సాగు వైపు ఎక్కువ చూపుతారు. దీనికి తోడు రాష్ట్ర ప్రభుత్వం క్వింటాళుకు రూ. 500 బోనస్ ప్రకటించడంతో సహజంగానే రైతులు సన్నాల సాగుకు మరింత ఎక్కువ చేపట్టే అవకాశాలున్నాయి.ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డుదారులతోపాటుహాస్టళ్లకు,మధ్యాహ్నభోజనానికి సన్న బియ్యం ఇవ్వాలని నిర్ణయించింది. అయితే డిమాండ్‌కు తగ్గ సన్న బియ్యం అందుబాటులో లేకపోవడంతో ఇతర రాష్ట్రాల నుంచి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**9.27 లక్షల ఎకరాల్లో వరి సాగు**

ఉమ్మడి వరంగల్ సాగు ప్రణాళికలను వ్యవసాయ శాఖ అప్పుడే సిద్ధం చేసింది. వరి సాగు ప్రతిపాదనలను రూపొందించింది. వచ్చే వర్షకాలంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 9.27 లక్షల ఎకరాల మేర వరి సాగు కావచ్చని అంచనా. హన్మకొండ జిల్లాలో 1.48 లక్షలు, వరంగల్ జిల్లాలో 1.35 లక్షలు, జనగామ జిల్లాలో 2.10 లక్షలు, మహబూబాబాద్‌లో 2.17 లక్షలు, ములుగు జిల్లాలో 1.12 లక్షలు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 1.05 లక్షల ఎకరాల్లో వరి సాగు ప్రతిపాదనలు ప్రణాళికల్లో పొందుపర్చారు. అయితే ఎప్పుడైనా సాధారణంగా ఈ మొత్తంలో సన్న రకాల సాగు7.41 లక్షల మేరకు ఉంటుంది. మిగతాది దొడ్డు రకం, అయితే రూ. 500 బోనస్ ప్రకటనతో సీన్ రివర్స్ కానుంది. వచ్చే వర్షకాలం సీజన్‌లో సన్న రకాల సాగు అదనంగా 15 నుంచి 20 శాతం1.85లక్షల ఎకరాలు పెరగవచ్చని అంచనా వేస్తున్నారు.ఖరీఫ్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో సన్నాల సా గు మొత్తంగా 9.26 లక్షల ఎకరాలు ఉండవచ్చని చెబుతున్నారు. దొడ్డు రకాల సాగు దాదాపు ఉండకపోవచ్చని భావిస్తున్నారు. ఒకవేళ స్థానికంగా ఉండే అనుకూల పరిస్థితులు, అవనివార్య కారణాలు, మరింత పెరిగే వరి సాగు విస్తీర్ణం దృష్ట్యా దొడ్డు రకం సాగు లక్ష నుంచి రూ. 1.50 లక్షల ఎకరాల మేరకు ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. ఎకరాకు వరి దొడ్డు రకం 24 నుంచి 25 క్వింటాళ్ల వరకు వస్తే సన్నరకం 20 నుంచి 22 క్వింటాళ్లు వస్తుంది. ప్రస్తుతం మద్దతు ధర సన్న రకం రూ. 2203, దొడ్డ రకం రూ. 2183 చెల్లిస్తున్నారు. అయితే సన్నరకం వడ్లకు క్వింటాళుకు రూ.500 బోనస్ ఇవ్వాలన్న ప్రభుత్వ నిర్ణయం వల్ల రైతుకు సన్న రకం వడ్లకు ఎకరానికి అదనంగా రూ. 11 వేల వరకు లభిస్తాయి. అందువల్ల ఖరీఫ్‌లో సన్నరకం సాగుకే అన్నదాత ఎక్కువ మొగ్గు చూపడం ఖాయంగా కనిస్తోంది.

**దిగుబడి తగ్గినా..**

సాధారణంగా సన్న రకాల సాగులో రిస్క్ కాస్త ఎక్కువే. పైగా దొడ్డు రకాలతో పోలిస్తే సన్నాలకు దిగుబడి తక్కువ. దొడ్డ రకాలు సగటున ఎకరానికి 30 నుంచి 35 బస్తాల వరకు దిగుబడి వస్తుంది. సన్నాలకు 2 నుంచి 3 క్వింటాళ్ల దిగుబడి తక్కువగా ఉంటుంది. దొడ్డు రకాలతో పోలిస్తే సాగు సమయం ఎక్కువ. దీనితోపాటు చీడ పీడల బెడద ఎక్కువగా ఉంటుంది. అయితే ధర విషయానికి వచ్చేసరికి సన్నాలకు విపరీతమైన డిమాండ్ ఉంది. దొడ్డు రకాలతో పోలిస్తే సన్న రకాలకు క్వింటాళుకు ప్రయివేట మార్కెట్‌లో క్వింటాళుకు రూ. 2500 పైగా అమ్ముడుపోతున్నాయి. మార్కెట్ వరకు తీసుకెళ్లకుండానే పొలాల వద్దనే ప్రయివేటు వ్యాపారులు ఎక్కువ ధర చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. దీనికి తోడు ఇంటి అవసరాలకు కొత్త ధాన్యాన్ని రైతు తీసి పెట్టుకుంటున్నారు. దీనితో ప్రభుత్వానికి అవసరమైన సన్న బియ్యం మార్కెట్‌లో దొరకడం లేదు. ఈ కారణంగా ప్రభుత్వం సన్న రకాలకు బోనస్ ఇవ్వాలని నిర్ణయించింది.

**సన్న రకాల విత్తనాలకు డిమాండ్**

సన్నాలకు రూ. 500 బోనస్ ఇవాలన్న నిర్ణయం వల్ల సాగులో చోటు చేసుకునే మార్పులు, చేర్పులను దృష్టిలో పెట్టుకొని వ్యవసాయ శాఖ సాగు ప్రణాళికలను సవరించే పనిలో పడింది. సన్నాల సాగు విస్త్రీం పెరిగే అవకాశాలున్న నేపథ్యంలో ఆ మేరకు విత్తనాలను అందుబాటులో ఉంచే దిశగా దృష్టి సారిస్తున్నారు. సన్నాల్లో 20కి పైగా రకాలు ఉన్నాయి. వీటిలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో తెలంగాణ సోనాకు మంచి డిమాండ్ ఉంది. బీపీటీ, సాంబమసూరి, ఆమన్, కూనారం 1618 తదితర రకాలకు రైతులు ఎక్కువగా సాగుచేస్తున్నారు.

## నల్లగొండకు బ్యాలెట్ బాక్సులు

**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఉపఎన్నిక పోలింగ్ జిల్లాలో 76.34 శాతం జరిగిందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ తెలిపారు. బ్యాలెట్ బాక్సులను ఓట్ల లెక్కింపు జరిగే నల్లగొండకు తరలించడం జరిగిందన్నారు. మంగళవారం కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ మాట్లాడుతూజనగామ రెవెన్యూ డివిజన్ పరిధిలో 76.48 శాతం జరగగా స్టేషన్‌ఘనపూర్ డివిజన్ పరిధిలో 76.10 శాతం జరిగిందన్నారు. జిల్లాల్లో పట్టభద్రుల ఓట్లు 23వేల 419 ఉండగా 17వేల 879 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు. పురుషులు 14వేల 915 మందికి గాను 11వేల 598 మంది, మహిళ ఓటర్లు 8503 మందికి గాను 6వేల 280 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారన్నారు. జనగామ రెవెన్యూ డివిజన్ పరిధిలో 14వేల 886 మంది ఓటర్లకుగాను11వూల385మంది,స్టేషన్‌ఘనపూర్ పరిధిలో 8వేల 533 మందికి గాను 6వేల 494మంది ఓటు వేశారన్నారు.

**నల్లగొండ కౌంటింగ్ కేంద్రానికి పోలింగ్ బాక్సులు**

ఎమ్మెల్సీ ఉప ఎన్నికల పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులు జిల్లా కేంద్రంలోని కలెక్టర్ సమీకృత భవనానికి తీసుకురాగా అక్కడి నుండి కౌటింగ్ జరిగే నల్లగొండలోని స్ట్రాంగ్ రూంకు తరలించడం జరిగిందని జిల్లా కలెక్టర్ తెలిపారు.

## ఓట్ల లెక్కింపులో నిబంధనలు పాటించాల్సిందే

**ప్రజాపక్షం/హన్మకొండప్రతినిధి:** వర ంగల్ పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికల ఓట్ల లెక్కింపును ఈసీఐ నిబంధనల మేరకు సమర్థవంతంగా నిర్వహించేందుకు పూర్తిస్థాయిలో శిక్షణ పొందాలని హన్మకొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జూన్ 4వ తేదీన వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఈవీఎంల ద్వారా నిర్వహించే నియోజకవర్గాల ఓట్ల లెక్కింపును సమర్థవంతంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సిక్తాపట్నాయక్ మాట్లాడుతూ ఏనుమాముల మార్కెట్‌లో జూన్ 4న ఓట్ల లెక్కింపును సమర్థవంతంగా చేపట్టేందుకు పూర్తిస్థాయిలో అవగాహన పొందాలన్నారు. కౌంటింగ్ రూమ్‌లో 17 ఉంటాయని, కంట్రోల్ యూనిట్ నుంచి బటన్ నొక్కి ఫలితాలు చెప్పేటప్పుడు ప్రజాప్రతినిధులందరికీ తెలియజేయాలన్నారు. అదనపు కలెక్టర్‌లు కలెక్టర్‌లు రాధికా గుప్త, వెంకట రెడ్డి, పరకాల, వరంగల్ పశ్చిమ ఏఆర్‌ఓలు డాక్టర్ కె. నారాయణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎసిబి సోదాలు..అదుపులోకి ఆరుగురు

మహబూబాబాద్ రవాణాశాఖ కార్యాలయంలో గాలింపు

ఎసిబి డిఎస్‌పి సాంబయ్య



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** మహబూబాబాద్ జిల్లా రవాణాధికారి కార్యాలయంలో ఏసీబీ అధికారులు ఆకస్మిక సోదాలు నిర్వహించారు. మహబూబాబాద్ ఆర్టీఏ కార్యాలయంలో అవకతవకలపై ఉన్న సమాచారం మేరకు డిజి ఆనంద్ ఆదేశించగా సోదాలు నిర్వహించినట్టు సోదలలో భాగంగా ఆరుగురు ఎజెంట్లను అదుపులోకి తీసుకుని సోదాలు చేయగా వారివద్ద కొన్ని వాహనాలకు సంబంధించిన డాకిమెంట్లతో పాటు లెర్నింగ్ లైసెన్సులు, లైసెన్సులు, ఫిట్నెస్ సర్టిఫికేట్ ల కొరకు దరఖాస్తులతో పాటు 45100 రూపాయలు దొరికినట్టుగా, అధికారులు గవర్నమెంట్ రిజిస్టర్ లో డిక్లర్ చేసినదాని కన్నా చాలా ఎక్కువ మొత్తంలో డబ్బు ఉందని డిటిఓ గౌస్ పాషా డ్రైవర్ సుబ్బారావు వద్ద 16500 రూపాయలతో పాటు కొన్ని వాహనాల తాళాలు తీసుకుని విచారిస్తున్నట్టు తెలిపి ఏజెంట్ వ్యవస్థ లేని కార్యాలయంలో ఏడుగురు ఎజెంట్లను ఎందుకు పెట్టారు అనేదానిపై విచారణ చేస్తున్నట్టు ఆ ఎజెంట్లపై తగిన చర్యలు తీసుకుంటామని డిఎస్పీ అన్నారు. ఈ సోదాలలో డిఎస్పీ సాంభయ్యతో పాటు ఇన్స్పెక్టర్లు ఎల్ రాజు, ఎస్ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఓట్ల లెక్కింపుపై అవగాహన తప్పనిసరి



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపుపై అవగాహన పొందాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపుపై భువనగిరి పార్లమెంట్ పరిధిలోని జనగామ, వరంగల్ పార్లమెంట్ పరిధిలోని స్టేషన్‌ఘనపూర్, పాలకుర్తి నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వయించారు. కలెక్టర్ మాట్లాడుతూ కౌంటింగ్ రూంలో 17టేబుల్స్ ఏర్పాటు చేస్తారని, కంట్రోల్ యూనిట్ నుండి బటన్ నొక్కి ఫలితాలు చెప్పేటప్పుడు ప్రజాప్రతినిధులు అందరికి తెలియజేయాలని, బిగ్గరగా చెప్పాలన్నారు. జడ్‌పి సీఇఓ అనిల్‌కుమార్, ఏఓ రవీందర్, కౌంటింగ్ సూపర్‌వైజర్లు , కౌలింగ్ ఎజెంట్లు, మైక్రో అబ్జర్వర్లు పాల్గొన్నారు.

## లోతట్టు ప్రాంతాలపై అవగాహన

బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే



**ప్రజాపక్షం/వరంగల్‌టౌన్:** రానున్న వర్షాకాలం నేపథ్యంలో సానిటరీ ఇన్స్పెక్టర్ లకు నగర వ్యాప్తంగా ఉన్న లోతట్టు ప్రాంతాలపై సంపూర్ణ అవగాహన ఉండాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే పేర్కొన్నారు.మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయ కౌన్సి ల్ హాల్లో సానిటరీ ఇన్స్పెక్టర్ల తో జరిగిన సమావేశంలో కమిషనర్ పాల్గొని సమర్థవంతంగా నిర్వహించుటకు పలు సూచనలు చేశారు.ఐటీనిపుణులుగూగుల్ ఎర్త్ మ్యాపు ద్వారా నగరంలో ముంపునకు గురయ్యే ప్రాంతాలను దృశ్య మాధ్యమం (పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా) ప్రదర్శించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ బల్దియా వ్యాప్తంగా 66 డివిజన్ లకు చెందిన సానిటరీ ఇన్స్పెక్టర్ల కు వారికి కేటాయించిన డివిజన్ లలో ముంపునకు గురి అయ్యే ప్రాంతాలపై పూర్తి పరిజ్ఞానం ఉండాలని, అట్టి సమస్యలకు పరిష్కారాన్ని చేపట్టాల్సిన చర్యలపై అవగాహన ఉండాలని, సామర్థం మేరకు నిర్మించని డ్రైన్‌లసమాచారాన్ని అందించాలని, వర్షాలు కురిసే క్రమంలో నగరం లోని పలు ప్రాంతాల్లో డ్రైన్ లు పొంగడానికి గల కారణాలు అన్వేషించాలని, అట్టి సమాచారాన్ని గూగుల్ మ్యాప్ ద్వారా సేకరించి అందజేయాలని అన్నారు. కొన్ని ప్రాంతాల్లో గార్బేజి దంపింగ్ అనుకున్న స్థాయి లో జరగడం లేదని అనధికారిక డంపింగ్ చేస్తే గుర్తించి పెనాల్టీ లు విధించాలని, ప్రతి నిత్యం ఉదయం మధ్యాహ్నం సాయంత్రం 3 దఫాలుగా డంపింగ్ జరగాలని, డ్రైన్ లలో డిసిల్టింగ్ జరిగేలా చూడాలని, ఫాగింగ్ సక్రమం గా జరిగేలా ఎస్ ఐ లు పర్యవేక్షణ జరపాలని కమీషనర్ అన్నారు. సి ఏం హెచ్ ఓ డా॥ రాజేష్ శానిటరీ సూపర్ వైజర్లు సాంబయ్య, నరేందర్, భాస్కర్ తో పాటు శానిటరీ ఇన్స్పెక్టర్లు ఐటి నిపుణులు శ్రీనివాస్ విజయ్ పాల్గొన్నారు.

## నెలాఖరులోగా ధాన్యం కొనుగోళ్లు పూర్తి



కలెక్టర్ వల్లూరి క్రాంతి టెలికాన్ఫరెన్స్

**ప్రజాపక్షం/ సంగారెడ్డి ప్రతినిధిః** ఈ నెల ఆఖరులోగా దాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని, చిన్నరైతుల ధాన్యం ముందుగా కొనుగోలు చేయాలని, తూకం వేసిన దాన్యం ను వెంటనే మిల్లులకు తరలించాలని ఆర్టీవోలు ,తహసీల్దార్లతో జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి సోమవారం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులతో ఆమె మాట్లాడుతూ జిల్లాలు దాన్యం కొనుగోలు కేంద్రాలు 211 ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కేంద్రాలలో ఇప్పటి వరకు 81 కేంద్రాలలో దాన్యం కొనుగోలు పూర్తియినట్టు తెలిపారు. మిగిలిన కేంద్రాల్లో కొనుగోలు పూర్తిచేసి కేంద్రాలు, మూసివేయాలని, తెలిపారు. దాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. నిర్దిష్ట గడువులోగా జిల్లాలో దాన్యం కొనుగోలు పూర్తి అయ్యేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. మిల్లుల వద్ద లారీలు వెంటవెంటనే ఖాళీ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. దాన్యం కొనుగోళ్లకు సంబందించి కొనుగోలు కేంద్రాలలో రైస్ మిల్లర్ల వద్ద డాటా ఎంట్రీ ఆన్లైన్ ప్రక్రియ వెంటనే పూర్తి చేసి రైతులకు బిల్లులు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తాహసీల్దారులు, తమ వద్ద దరణి అప్లికేషన్లు పెండింగ్‌లో లేకుండా చూడాలని ధరణి అప్లికేషన్లను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణి దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలని ఆన్లైనో వాటి పరిష్కారం వివరాలు నమోదు చేయాలని అవసరమైతే ఆయా శాఖల అధికారులు సంప్రదించాలని సూచించారు.

## ఫేక్ రిజిస్ట్రేషన్ కేసులో 9 మంది అరెస్ట్

**ప్రజాపక్షం/మనోహరాబాద్:**మండలంలోని కూచారంలో 1000 గజాల స్థలానికి సంబంధించి నకిలీ పత్రాలు తయారుచేసి ఫేక్ రిజిస్ట్రేషన్ చేసినందుకు9మందినిందితులనుఅరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్‌కు చెందిన మల్లవరుపు అరుణ్‌కుమార్ అనే వ్యక్తి 8 మందితో కలిసి మోతీనగర్‌కు చెందిన స్వాతి సత్యనారాయణ మూర్తి దంపతులకు మనోహరాబాద్ మండలంలోని కూచారం శివారులోని 1000 గజాల స్థలాన్ని గుర్తుచప్పుడు కాకుండా 80 లక్షల రూపాయలకు నకిలీ పత్రాలు సృష్టించి విక్రయించారు. అప్పటికే ఆ భూమి అసలు యజమాని దుర్గ అనే మహిళ పేరిట రిజిస్ట్రేషన్ అయింది.అయితే నిందితులుహైదరాబాద్‌రాంనగర్‌కుచెందిన లక్ష్మీ అనే మహిళకు డబ్బులు ఎర వేసి లక్ష్మీ ఆధార్ కార్డును దుర్గగా నకిలీ ఆధార్ కార్డు తయారుచేసి స్వాతి సత్యనారాయణ దంపతులకు లక్ష్మీ చేత రిజిస్ట్రేషన్ చేయించారు. సత్యనారాయణమూర్తి లింక్ డాక్యుమెంట్ కోసం ఆరా తీయగా,అమ్మిన వ్యక్తులు పొంతన లేని సమాధానాలు ఇవ్వడంతో అనుమానంతో ఫ్లాట్ దగ్గరకు వెళ్లి చూడగా,ఆ స్థలంలో వేరే వ్యక్తుల పేరుతో బోర్డు ఉండడం గమనించారు. బోర్డుపై ఉన్న నెంబర్లకు ఫోన్ చేసి చూడగా అసలు విషయం బయటపడింది. దీంతో మోసగాళ్లపై సత్యనారాయణమూర్తి గత నెలలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు నిందితులైన పిట్ల సాయికుమార్, వేముల ప్రభాకర్, ముంగునూరు లక్ష్మి, తూప్రాన్ సబ్ రిజిస్ట్రార్ సనత్‌నగర్ రమణలను మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై కరుణాకర్ రెడ్డి తెలిపారు. అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

## ధరణి ఆపరేటర్ లేడు..రిజిస్ట్రేషన్ ఎలా!





రైతులు రోజుల తరబడి ఆపరేటర్ లేక రిజిస్ట్రేషన్ నిలిచిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రజాపక్షం/ కమలాపూర్ః** ఇటీవల లంచం తీసుకుంటూ ఏసిపి అధికారులకు పట్టుబడ్డ తహశీల్ధార్ మాధవి తో పాటు ధరణి ఆపరేటర్ రాకేష్ పట్టుబడ్డారు. భూమి రిజిస్ట్రేషన్ కోసం లేక హైదరాబాద్ వంటి ప్రాంతాల నుంచి వచ్చి కమలాపూర్ తహశీల్ధార్ కార్యాలయానికి ప్రదక్షిణలు చేస్తున్నారు. దీంతో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల తహశీల్ధార్ కార్యాలయానికి 100 కిలోమీటర్ల నుంచి వచ్చిన అమెరికా వంటి దేశాలకు వెళ్ళాల్సిన వ్యక్తులు రిజిస్ట్రేషన్ కాక ఇబ్బందులకు గురవుతున్నారు. వెంటనే కలెక్టర్ స్పందించి కమలాపూర్ తహశీల్ధార్ కార్యాలయానికి పర్మినెంట్ ఆపరేటర్ ను నియమించకపోతే రైతులు ఆందోళన చేసే కార్యక్రమం చేపడతామని తెలిపారు. ఈ విషయం పై డిప్యూటి తహశీల్ధార్ ను వివరణ కోరగా రెండు, మూడు రోజుల్లో ఆపరేటర్ వచ్చే అవకాశం ఉందని తెలిపారు.

## మెదక్ జిల్లా జొన్న రైతులకు శుభవార్త

వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



**ప్రజాపక్షం/ సంగారెడ్డి ప్రతినిధిః** మెదక్ జిల్లాలో మార్క్ ఫెడ్ ద్వారా ప్రతి ఎకరాకు 8 క్వింటాళ్ల జొన్నలను మాత్రమే కొనుగోలు చేయడం వల్ల రైతులు పడుతున్న ఇబ్బందులను మంత్రి దామోదర్ రాజనర్సింహ అడిగి తెలుసుకున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోన జొన్న రైతుల పట్ల ప్రత్యేక చొరవ చూపి ప్రతి ఎకరాకు 8 క్వింటాళ్ల నుండి 12 క్వింటాళ్ల వరకు జొన్నలను కొనుగోలు చేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ రాసిన లేఖలో విజ్ఞప్తి చేశారు. ఈ లేఖకు రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రభుత్వ కార్యదర్శి తక్షణం స్పందించారు. మెదక్ జిల్లాలో ప్రతి ఎకరాకు 12 క్వింటళ్ల జొన్నలను మార్క్ పెడ్ ద్వారా కొనుగోలు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రతి ఎకరాకు 8 క్వింటాళ్ల జొన్నలను మార్క్‌పెడ్ ద్వారా కొనుగోలు చేయటం వల్ల రైతులు మిగితా పంటను ఎవరికి అమ్ముకోవాలో తెలియక ఇబ్బందులు పడుతున్న సమాచారం తెలుసుకొని వెంటనే మార్క్ ఫెడ్ ద్వారా ప్రతి ఎకరాకు 12 క్వింటాళ్ల జొన్నలను కొనుగోలు చేయాలని మంత్రి దామోదర్ రాజనిర్సింమ ,రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రభుత్వ కారదర్శికి లేఖ రాశారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రభుత్వ కార్యదర్శి మంత్రి దామోదర్ రాజనర్సింహ రాసిన లేఖకు స్పందించారు.

## అప్పుల బాధతో యువరైతు ఆత్మహత్య



**ప్రజాపక్షం/నిజాంపేట్:** అప్పుల బాధతో యువరైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన నిజాంపేట మండల పరిధిలోని నగరంలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. నిజాంపేట మండల పరిధిలోని నగరం గ్రా మానికి చెందిన కొమ్మట రాజు (25) వ్యవసాయ పెట్టుబడి నిమిత్తం సుమారు 2 లక్షల రూపాయలు అప్పుచేశాడు. పంట సరిగా పండక పోవడంతో అప్పు తీర్చే మార్గం లేక మనస్తాపంతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం ఉదయం జేసిబి డ్రైవింగ్ కి వెళ్తున్నాను అని ఇంట్లో చెప్పి వెళ్లి రాత్రి వరకు ఇంటికి తిరిగి రాలేదు. అతను చెట్టుకు ఉరివేసుకుని చనిపోయాడని స్థానికులు మంగళవారం ఉదయం మృతుని భార్య లక్ష్మి కి తెలిపారు. లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు నిజాంపేటపిఎస్ ఎస్‌హెచ్‌ఓ తెలిపారు. మృతునికి ఒక కూతురు, కొడుకు ఉన్నారు.

## జొన్నల కొనుగోలు కేంద్రం తనిఖీ



**ప్రజాపక్షం/ మునిపల్లి :** మునిపల్లి మండల పరిధిలోని పెద్ద చెల్మెడ సీవిసీఎస్ ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఏడి సత్యనారాయణ తనిఖీ చేశారు. కొనుగోళ్లు ఏలా జరుగుతున్నాయి, ఏ రోజుకారోజు జొన్నలను తరలిస్తున్నారా, అంటూ అధికారులు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అలాగే రైతులు కేంద్రానికి తీసుకవచ్చే దాన్యం విషయంలో రైతులకు ఏలాంటి ఇబ్బందులు ఉండోద్దని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా రైతులు నాణ్యత కూడిన ధాన్యాన్ని తీసుకురావాలని, రైతులకు సూచించారు. ఈ కొనుగోలు కేంద్రం ఈ నెల 30వ తేది వరకు ఉంటుందని అప్పటి లోగా ఎవరైనా రైతులు తమ వద్ద ఉన్న జొన్నలను సమీప కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు పొందాలన్నారు. ఈ విషయాన్ని రైతులు గమనించి జొన్నల కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏవో శివకుమార్, ఏఈఓ రహమాన్,సీపిసిఎస్ సోసైటీ కార్యదర్శి శివకుమార్, తదితరులు పాల్గొన్నారు.

## మానుకోట నెత్తుటి మరకలకు 14 సంవత్సరాలు

**ప్రజాపక్షం/నెక్కొండః** ఉమ్మడి రాష్ట్రంలో ప్రత్యేక రాష్ట్రం కోసం మలిదశ ఉద్యమం ఉగ్రూతలవుతున్న సమయంలో 2010 మే 28న ఉమ్మడి వరంగల్ జిల్లా మానుకోటలో ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఓదార్పు యాత్ర పేరుతో తెలంగాణలో పర్యటిస్తున్న సందర్భంగా తెలంగాణ వాదులు అడ్డగించారు. ఈ సందర్భంగా జరిగిన మానుకోట రైల్వేస్టేషన్‌లో కాల్పుల్లో చాలా మంది గాయపడ్డారు. నెత్తురు చెందించిన తెలంగాణ బిడ్డలు, ఈ సంఘటన యావత్ ఉమ్మడి రాష్ట్రంతో పాటు తెలంగాణలో తీవ్రమైన ఉద్రిక్తలకు దారి తీసింది. తర్వాత తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం అనంతరం మానుకోట గాయాన్ని మరిచిన నేతలు ఉద్యమకారులు, 14 సంవత్సరాల విలువైన కాలం మళ్ళముందే కదలాడుతున్నట్లుగా ఉంది ఆనాటి సంఘటన అంటున్న ప్రత్యక్షంగా అనాటి సంఘటనలో పాల్గొన్న తెలంగాణ ఉద్యమకారులు.

## నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** నకిలీ విత్తనాలు, పురుగుల మందులు రైతులను మోసం చేసి విక్రయిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని భూపాలపల్లి డి.ఎస్.పి సంపత్ రావు హెచ్చరించారు. మంగళవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని మెయిన్ రోడ్ లో ఉన్న వివిధ విత్తనాల షాపులను భూపాలపల్లి డిఎస్పీ సంపత్ రావు, సీఐ నరేష్ కుమార్ జిల్లా అగ్రికల్చర్ అధికారి ముగ్గురు కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ, ఫర్టిలైజర్ యజమానులు నిబంధనలకు విరుద్ధంగా నకిలీ విత్తనాలు మందులను ఒకవేళ విక్రయించినట్లు తేలితే పీడీ యాక్ట్ కేసు నమోదు చేయడం జరుగుతుందని అన్నారు. విత్తన షాపుల వారు అమ్మే ప్రతీ విత్తనానికి పురుగుమందులకు రసీదు ఇవ్వాలని నకిలీ విత్తనాలు నకిలీ పురుగుమందులు అమ్మినట్టు తేలితే చట్టప్రకారం కఠిన శిక్షలు ఉంటాయని డీఎస్పీ హెచ్చరికలు జారీ చేశారు. విత్తన షాపులను తనిఖీ చేసి నిలువలను పరిశీలించారు. పోలీసులు, అగ్రికల్చర్ అధికారులు పాల్గొన్నారు.

## యునెస్కో ఫీస్ మెసెంజర్ అవార్డుకు గోక ఎంపిక



**ప్రజాపక్షం/ నర్సంపేట :** నర్సంపేట పట్టణానికి చెందిన వనప్రేమి పర్యావరణ వేత్త గోక రామస్వామి ప్రతిష్టాత్మకమైన యూనెస్కో ఫీస్ మేసెంజర్ అవార్డుకు యూనేస్కో సెక్రటరి జనరల్ యోగేష్ కులశ్రేష్ట ఎంపిక చేసినుట్ల గోక రామస్వామి తెలిపారు. గత 40 సంవత్సరాలుగాయునేస్కో కార్యక్రమాలలో కాశ్మీర్ నుండి కన్యకుమారి వరకు సేవలందించారని, జూన్ 7, 8,9 తేదిలలో అస్సాం రాష్ట్రంలోని డిబ్రుగర్ లో జరిగే 18 బై అన్యూవల్ కాన్ఫరెన్స్ యునేస్కో గోవాకు ఫీస్ మేసెంజర్ అవార్డును ఆయనకు ప్రధానం చేయనున్నట్లు తెలిపారు. జూన్ 5న యూనైటెడ్ నేషన్ కాన్ఫరెన్స్ గౌహతిలో పాల్గొని జూన్ 7న డిబ్రుగర్‌లో పాల్గొని పాల్గొననున్నట్లు తెలిపారు. ఈకాన్ఫరెన్స్ లో దేశంలోని 40మంది యూనెస్కో ప్రతినిధులు పాల్గొంటారని, తెలంగాణ నుండి ధర్మపురి రాజ గోవింద్, గోక నాగేశ్వర్‌రావులకు కూడా ఆహ్వానం అందిందన్నారు. ఈ అవార్డుకు ఎంపిక చేసిన జాతీయ కార్యవర్గానికి గోక రామస్వామి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. యూనెస్కో ఫీజ్ మెసెంజర్ అవార్డుకు ఎంపికైన గోక రామస్వామిని నర్సంపేట స్వచ్ఛంద సంస్థల ప్రతినిదులు బెజ్జంకి ప్రభాకర్, బోయిన వెంకటస్వామిలు ప్రత్యేకంగా అభినందించారు.

## కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

**ప్రజాపక్షం/జనగామటౌన్:** ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా డీఐఈవో మాట్లాడుతూ మంగళవారం ఉదయం ప్రారంభమైన జనరల్ పరీక్షలకు మొత్తం 1357 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 1303 మంది విద్యార్థులు హాజరయ్యారని, 54 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారన్నారు. ఒకేషనల్‌లో 323 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 301 మంది హాజరయ్యారని, 22 మంది గైర్హాజరరయ్యారన్నారు. మధ్యాహ్నం జరిగిన జనరల్ పరీక్షలకు 471 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 451 మంది హాజరయ్యారని 20 మంది గైర్హాజరయ్యారన్నారు. ఒకేషనల్‌లో మొత్తం 142 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 134 మంది హాజరయ్యారని 8 మంది గైర్హాజరయ్యారన్నారు.

# పాఠ్యాంశంగా 'సురవరం' జీవిత చరిత్ర

**సాహితీ పురస్కార ప్రదానోత్సవంలో పద్మ భూషణ్ అవార్డు గ్రహీత డాక్టర్ వరప్రసాద్ రెడ్డి వినతి**






**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ వైతాళికులు, బహుముఖ ప్రజ్ఞాశాలి, సురవరం ప్రతాపరెడ్డి జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలని, ఆదిశగా ప్రభుత్వం ఆలోచించాలని శాంతా బయోటెక్నిక్స్ లిమిటెడ్ వ్యవస్థాపకులు, శాంతా వసంతా ట్రస్ట్ అధ్యక్షులు పద్మ భూషణ్ అవార్డు గ్రహీత డాక్టర్ కె.ఐ.వరప్రసాద్ రెడ్డి కోరారు. తెలంగాణ వైతాళికులు సురవరం ప్రతాప రెడ్డి 128వ జయంతిని పురస్కరించుకుని "సురవరం ప్రతాపరెడ్డి సాహిత్య వైజయంతి సాహితీ పురస్కారం – 2024"ను సీనియర్ పాత్రికేయులు తిరునగరి ఉడయవర్లుకు అందజేసి ఘనంగా సన్మానించారు. హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారకభవన్‌లోని సురవరం ప్రతాప రెడ్డి ఆడిటోరియంలో మంగళవారం సురవరం ప్రతాప రెడ్డి సాహిత్య వైజయంతి ట్రస్ట్ అధ్వర్యంలో జరిగిన సభకు ట్రస్ట్ అధ్యక్షులు డాక్టర్ ఎల్లూరి శివా రెడ్డి అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా పద్మభూషణ్ అవార్డు గ్రహీత డాక్టర్ కె.ఐ.వరప్రసాద్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ (టియుడబ్ల్యూజె) రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ, ట్రస్ట్ కార్యదర్శి సురవరం పుష్పలత హాజరయ్యారు. సభలో వరప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ తన అక్షరమే ఆయుధంగా చరిత్ర సృష్టించిన మహనీయులు సురవరం ప్రతాప రెడ్డి సాహిత్యాన్ని అక్షరీకరించిన పాత్రికేయులు తిరునగరి ఉడయవర్లుకు అందజేయడం ఎంతో సముచితమన్నారు. ఒక కవి తన కవిత్వం ద్వారా అందరి మన్నలను పొందాలకుంటారే తప్ప కవులను తయారుచేయాలను కోరని, కానీ ఎంతో ఉదార హృదయం గల సురవరం ప్రతాపరెడ్డి ఎంతోమందిని కవులుగా, సాహిత్యకారులుగా తీర్చిదిద్దిన మహనీయులని కొనియాడారు. అలాంటి మహావ్యక్తి జీవిత చరిత్ర పాఠ్యాపుస్తకాల్లో పొందపర్చితే అది భావితరాలకు ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉంటుందన్నారు. అదే విధంగా ఆ మహావ్యక్తి అవార్డును సాహిత్య రంగానికి కూడా వర్తింపజేయాలని, ఇక ప్రతి ఏటా రెండు పురస్కారాలను అందించేందుకు ట్రస్ట్ చర్యలు తీసుకోవాలని, అందుకు తన వంతు పూర్తి సహకారాన్ని అందజేస్తానని తెలిపారు. విరాహత్ అలీ మాట్లాడుతూ నిజాం నిరకుశ పాలన కాలంలో తన సాహిత్యం ద్వారా తెలంగాణ ప్రజల్లో సామాజిక చైతన్యాన్ని రగిలించడమే కాకుండా ఓ ఆంధ్ర పండితుడు తెలంగాణలో కవులే లేరంటూ అపహాస్యం చేస్తే 350 మంది తెలంగాణ కవులను ఒక చోట చేర్చి కవితా సంపుటి ద్వారా తెలంగాణ గడ్డ పౌరుషాన్ని చాటిచెప్పిన అక్షరయోధుడు సురవరం ప్రతాపరెడ్డి అని కొనియాడారు. కార్యక్రమంలో సిపిఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి , మాజీ ఎంపి సురవరం సుధాకర్ రెడ్డి, డాక్టర్ చెన్నయ్యతో పాటు పలువురు కవులు సురవరం ప్రతాప రెడ్డి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అనుమతి లేని విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేయండి

**ఎఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి అన్వర్**




**ప్రజాపక్షం/చర్లపల్లి :** అనుమతి లేని కళాశాలలు, పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎండి అన్వర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఇసిఐఎల్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రైవేట్, కార్పొరేటర్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని, అనుమతి లేని పాఠశాలలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల యాజమాన్యాలు విద్యావ్యాపారం చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఫీజుల పేరుతో లక్షల రూపాయలు దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. ఎల్‌కెజి ఫీజులు బీటెక్ ఫీజులతో సమానంగా ఉన్నాయన్నారు. అడ్మిషన్ ఫీజు పేరుతో అయిదు వేల నుండి యాభై వేల వరకు వసూలు చేస్తున్నారని, పాఠశాలల అవరణలో పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్స్ విక్రయిస్తున్నారన్నారు. పట్టించుకోవాల్సిన విద్యాశాఖ అధికారులే వారికి వత్తాసు పలుకుతూ అండగా ఉంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించి విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపధ్యంలో ఫీజుల నియంత్రణ చేపట్టాలని, అనుమతిలేని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు హరీష్, నాయకులు అరవింద్, సాయి, నరేష్, శివ, ఆదిత్య, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

## మతతత్వవాదాన్ని తిప్పికొట్టేలా ఎన్నికల ఫలితాలు : రాములు

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** మతతత్వవాదాన్ని తిప్పి కొట్టేలా పార్లమెంట్, ఎమ్మెల్సీ ఉప ఎన్నికల ఫలితాలు ఉంటాయని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు ఆశాభావం వ్యక్తం చేశారు. మంగళవారం సూర్యాపేట




జిల్లా హుజూర్‌నగర్ సిపిఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంపి, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికల్లో కాంగ్రెస్, వామపక్షాలు బలపర్చిన అభ్యర్థులు గెలవబోతున్నారన్నారు. జూన్ 2న తెలంగాణ అమరవీరుల సంస్మరణ దినోత్సవం, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందిరా వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, నాయకులు సోమగాని కృష్ణ, సుందరి పద్మ, జడ వెంకన్న, జక్కుల శ్రీనివాస్, మామిడి వెంకయ్య, గుండెబోయిన వెంకన్న, చక్రాల స్టాలిన్, యల్లావుల నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఏకకాలంలో రుణమాఫీ చేయాలి

**ఎఐకెఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్కయ్య**



**ప్రజాపక్షం/హన్మకొండ టౌన్ :** రైతులకు ఏకకాలంలో రుణ మాఫీ చేయాలని, వ్యవసాయ ప్రణాళిక రూపొందించాలని ఎఐకెఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్కయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ముమ్మడి శ్రీకాంత్ అధ్యక్షతన జిల్లా ఎఐకెఎస్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చుక్కయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వం 2021 నాటికి వ్యవసాయ ప్రణాళికను నిలిపివేసిందన్నారు. వ్యవసాయ విధానాన్ని రూపొందించి ప్రణాళికను ప్రకటించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రభుత్వాన్ని కోరారు. జూన్ 6న హన్మకొండలోని సుందరయ్య భవన్ హాలులో ఎఐకెఎస్ జిల్లా సమావేశం జరుగుతుందని, సమావేశంలో జిల్లాలోని రైతాంగం ఎదుర్కొంటున్న సీజనల్ సమస్యలపై, ప్రభుత్వం ఎన్నికల్లో ప్రకటించిన హామీలు జిల్లాలో అమలుపై చర్చించనున్నట్లు తెలిపారు. హన్మకొండలోని సుందరయ్య భవన్ హాలులో సమావేశం జరుగుతుందని, రైతు సంఘం ప్రతినిధులంతా హాజరుకావాలని కోరారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బండి పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి కార్మిక కుటుంబాల సంక్షేమానికి కృషి : సత్యనారాయణ



**ప్రజాపక్షం/మందమర్రి :** సింగరేణి కార్మిక ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలని, కార్మికులు, కార్మికుల కుటుంబాల సంక్షేమానికి కార్మిక వాడల్లో, సింగరేణి ప్రాంతంలో అభివృద్ధి పనులు చేపట్టాలని గుర్తింపు కార్మిక సంఘం ఎఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ మందమర్రి ఏరియా జీఎంను కోరారు. మంగళవారం ఏరియా జీఎంతో గుర్తింపు సంఘం ఎఐటియుసి నాయకులు సమావేశమై కార్మికుల సమస్యలు, సింగరేణి ప్రాంత అభివృద్ధిపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి హైస్కూల్‌లో వాకింగ్ ట్రాక్ మరమ్మతులు చేపించాలని, సిఇఆర్ క్లబ్‌లో స్విమ్మింగ్ పూల్ వాటర్ ఫిల్టరైజేషన్ చేయాలని, ఏరియాలోని గనుల్లో నూతన ఎస్‌డిఎల్ యంత్రాలను ప్రవేశ పెట్టాలని, కాలం చెల్లిన యంత్రాలతో నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యం కష్టం అవుతుందని తెలిపారు. కార్మిక సంఘం నాయకులు తెలిపిన అంశాలపై జీఎం సానుకూలంగా స్పందించారని సత్యనారాయణ తెలిపారు. సమావేశంలో రాగం మల్లేష్, తిరుపతి గౌడ్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యం




**ప్రజాపక్షం/సూర్యాపేట:** సూర్యాపేట జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వుడ్ ఎఆర్ ఎఐగా పనిచేస్తూ ఇటీవల మరణించిన వెంకటయ్య కుటుంబ సభ్యులకు మంగళవారం జిల్లా ఎస్‌పి రాహుల్ హెగ్డే పోలీస్ భద్రత స్కిం ద్వారా రూ.6లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి రాహుల్ హెగ్డే మాట్లాడుతూ పోలీస్ ఉద్యోగుల సంక్షేమమే తమ లక్ష్యం అన్నారు. వారి కుటుంబాల సంక్షేమం కోసం ఎప్పుడు పోలీస్ శాఖ పాటుపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఏఓ మంజుభార్గవి, పోలీస్ సంక్షేమ సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు రామచంద్రగౌడ్, సెక్షన్ సూపరింటెండెంట్ శ్రీకాంత్, ఎఎస్ఐ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ ప్రశ్నాపత్రాల వాల్యుయేషన్ తప్పులపై విచారణ : ఎఐఎస్ఎఫ్

**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** ఇంటర్ ప్రశ్నాపత్రాల వాల్యుయేషన్ తప్పులపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి రామారపు వెంకటేష్, మచ్చ రమేష్ డిమాండ్ చేశారు. తప్పుడు వాల్యుయేషన్ వల్ల నష్టపోయిన విద్యార్థులకు ఇంటర్ బోర్డు న్యాయం చేయాలని వారు కోరారు. ఇంటర్మీడియట్ బోర్డు అధికారుల నిర్లక్ష్యం ఫలితంగా ఇంటర్ ప్రశ్నాపత్రాల వాల్యుయేషన్ చేసిన వారు అలసత్వం వహించి తప్పులుగా ప్రశ్నాపత్రాలు దిద్దడం వల్ల వేలాది మంది విద్యార్థులకు నష్టం వాటిల్లిందని, మెరిట్ విద్యార్థికి మొదటి సంవత్సరంలో వచ్చిన మార్కులు రెండో సంవత్సరంలో వచ్చిన మార్కులు చూస్తే విచిత్రంగా ఉందన్నారు. విద్యార్థులు తమకు ఏ సబ్జెక్ట్‌లో ఎన్ని మార్కులు వస్తాయో ముందే పరీక్ష రాశాక ఊహించుకుంటారని, ఫలితాల అనంతరం మార్కులు చూసి షాక్‌కి గురయ్యారని తెలిపారు. రివాల్యుయేషన్, రీకౌంటింగ్‌తో పేపర్లు తెప్పించుకుని చూస్తే పేపర్ వాల్యుయేషన్‌లో ఇష్టానుసారంగా పేపర్లు దిద్దారని, వచ్చిన మార్కులు ఒకటైతే ఆన్‌లైన్‌లో ఇంకో రకంగా మార్కులు వేశారని తెలిపారు. ఇంటర్ ప్రశ్నాపత్రాల వాల్యుయేషన ఇష్టానుసారంగా చేసి విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఇంటర్మీడియట్ బోర్డు ముట్టడిస్తామని హెచ్చరించారు.

# జిపి కార్మికుల పెండింగ్ వేతనాలివ్వండి

**ఎఐటియుసిజిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామస్వామి, దేవేందర్‌రెడ్డి డిమాండ్**




**ప్రజాపక్షం/దేవరకొండ :** గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలని ఎఐటియుసి దేవరకొండ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి, కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డిలు మాట్లాడుతూ దేవరకొండ నియోజకవర్గంలోని పలు గ్రామ పంచాయతీలలో గ్రామ పంచాయతీ కార్మికులకు ఇవ్వాల్సిన వేతనాలు ఆరు నెలలు, మరి కొన్ని జీపిలలో 11 నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. గ్రామ పంచాయతీ ఖాలో ఉన్న డబ్బులన్ని అధికారులు, సర్పంచ్‌లు కాజేశారని ఆరోపించారు. పనిచేస్తున్న కార్మికులకు జీతాలు ఇవ్వకుండా వారిని ఇబ్బందికి గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇచ్చే తక్కువ వేతనాలు అయినా, సకాలంలో ఇవ్వకపోవడంతో కార్మికుల కుటుంబాలు రోజువారి ఖర్చులు వెల్లదీసుకునే పరిస్థితులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. గ్రామ పంచాయతీ కార్మికుల మల్టీపర్పస్ విధానం రద్దు చేసి పాత విధానాన్ని కొనసాగించాలని, గ్రామపంచాయతీ కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని, పనిభారం తగ్గించాలని, అధికారుల వేధింపులు ఆపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి డివిజన్ అధ్యక్షులు నూనె వెంకటేశ్వర్లు, కోశాధికారి జూలూరి వెంకట్రాములు, మండల కార్యదర్శి మల్లయ్య, జిపి కార్మిక సంఘం మండల కార్యదర్శి వీరయ్య, అధ్యక్షులు అంజమ్మ, బొజ్జ, పర్వతాలు, భారతి, దేవరాజ్, వినోద్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# ఫోన్ ట్యాపింగ్‌తో నీచసంస్కృతికి శ్రీకారం

**బ్లాక్‌మెయిల్ చేసి కెసిఆర్ కుటుంబం వేల కోట్ల రూపాయలు సంపాదించారు**

**కరీంనగర్ డిసిసి అధ్యక్షుడు సత్యనారాయణ**



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** ఫోన్ ట్యాపింగ్‌తో కెసిఆర్ కుటుంబంలో ఆయనతో కెటిఆర్, హరీష్‌రావులు నీచ, నికృష్ట సంస్కృతికి శ్రీకారం చుట్టారని కరీంనగర్ డిసిసి అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ విమర్శించారు. మంగళవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతిపక్ష నాయకుల ఫోన్లు ట్యాపింగ్ చేయ దం సిగ్గు చేటన్నారు. అందులో మాజీ ఐజి రాధాకిషన్ ఇచ్చిన వాంగ్మూలం లో తన పేరు చెప్పడం బాధాకరమన్నారు. తాను రాజకీయాల్లో సేవ చేయడానికి వచ్చిన వాడినని, చదువుకున్న డాక్టర్‌ను అని, తన ఫోన్ ట్యాపింగ్ చేశారని తెలియడంతో చాలా బాధపడ్డానని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని సంధర్భాల్లో మిత్రులతో, కుటుంబ సభ్యులతో మాట్లాడిన విషయాలు వేరే వాళ్లకు తెలిసినప్పుడు నాతో ఉండే పిఏని, కొంత మంది సన్నిహితులను అనుమానించాల్సి వచ్చిందన్నారు. పదేళ్ల అధికారంలో ఉన్న మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్, వారి కుటుంబ సభ్యులు ప్రతిపక్ష పార్టీ నాయకులు, స్వంత పార్టీ నాయకులు, కుటుంబ సభ్యుల ఫోన్లతో సహా ట్యాపింగ్ చేయడం దుర్మార్గమైన చర్య అని పేర్కొన్నారు. రాజకీయ నాయకులు ఫోన్లు కాకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారులు, బిజినెస్ పర్సన్ల ఫోన్లు ట్యాపింగ్ చేసి బ్లాక్‌మెయిల్ చేసి వేల కోట్ల రూపాయలు సంపాదించారన్నారు. ఫోన్ల ట్యాపింగ్ ద్వారా ప్రతిపక్ష పార్టీలు లేకుండా చేస్తామని విర్రవీగిన కెసిఆర్ కుటుంబానికి ప్రజలు మొన్నటి ఎన్నికల్లో సరైన బుద్ధి చెప్పారన్నారు. తాను జిల్లా పార్టీ అధ్యక్షుడిగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సన్నిహితుడిగా ఉండి జిల్లాలో పార్టీ బలోపేతం కోసం పనిచేసాను కానీ ఏ రోజూ అక్రమ వ్యాపారాలు, భూ దందాలు, ఇసుక దందాలు చేయలేదన్నారు. నా ఫోన్ ట్యాపింగ్ చేసి సాధించిందేమీ లేదన్నారు. ప్రజాస్వామ్యంలో ఇటువంటి నీచ నికృష్ట చర్యలు సరికావన్నారు ఈ విషయమై ముఖ్యమంత్రి , డిజిపిని కలిసి ఫిర్యాదు చేస్తానని, హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేస్తానని తెలిపారు. కరీంనగర్ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు మాట్లాడుతూ ఫోన్ ట్యాంపరింగ్ అనేది దుర్మార్గమైన చర్య అని, భారతదేశంలో ఎప్పుడైనా ఇలా జరిగిందా? అని ప్రశ్నించారు. కెటిఆర్, హరీష్‌రావు నీచ సంస్కృతికి శ్రీకారం చుట్టారన్నారు. కవ్వంపల్లి సత్యనారాయణ దళిత నాయకుడు, విద్యావంతుడు, పవిత్రమైన డాక్టర్ వృత్తి నుంచి వచ్చిన వాడని, ప్రజలకు సేవ చేయాలని రాజకీయాల్లోకి వచ్చారని, తాను మానకొండూర్ ఎమ్మెల్యే గా రెండు, మూడు సార్లు పోటీ చేసి ఓడిపోయారని, వారు ఆర్థికంగా ఎంతో నష్టపోయారని, అలాంటి వ్యక్తి ఫోన్ ట్యాంపరింగ్ చేసి అసెంబ్లీ ఎన్నికలు ఎలాగైనా మట్టి కరిపించాలని పన్నాగం పన్నారని, ఇలాంటి వ్యక్తులు రాజకీయాల్లో ఉండొద్దన్నారు. సమావేశంలో జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి పురుమల్ల శ్రీనివాస్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, పిసిసి కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్, నాయకులు మడుపు మోహన్, ఆకారపు భాస్కర్ రెడ్డి, మహిళా నేతలు జ్యోతి రజితరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలపై పోరాడేవారికే ప్రజలు పట్టంకడుతారు

**ప్రజాపక్షం/నేరేడుచర్ల :** సమస్యలపై పోరాడే వారికే ప్రజలు పట్టం కడుతారని, ఎన్నికల్లో వారికే విజయం సాధ్యమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొణతం చినవెంకటరెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ధూళిపాళ ధనుంజయనాయుడు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పారేపల్లి శేఖర్‌రావు, మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాష్ అన్నారు. మంగళవారం పట్టణంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల పట్టభద్రుల ఉప ఎన్నికల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న భారీ మెజార్టీతో గెలవబోతున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. అనేక సంవత్సరాలుగా ప్రజా, నిరుద్యోగుల సమస్యల పట్ల పోరాడుతున్న ప్రజాగొంతుక తీన్మార్ మల్లన్నకు మూడు జిల్లాల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఏడుగురు మంత్రులతో పాటు వామపక్ష పార్టీలు, టిడిపి, టిజేఎస్ పార్టీలు, బీసీ సంఘాలన్ని తీన్మార్ మల్లన్నకు వెన్నుదన్నుగా ఉన్నాయన్నారు. అటు పట్టభద్రుల మద్దతు, ఇటు ప్రజాప్రతినిధుల అండతో తీన్మార్ మల్లన్న గెలుపు నల్లేరు మీద నడకల్లా సాగనున్నదని వారు అన్నారు. సమావేశంలో సిపిఐ, సిపిఎం, కాంగ్రెస్, టిడిపి నాయకులు కొదమగండ్ల నగేష్, చిలకరాజు శ్రీను, ఇంజమూరి వెంకటయ్య, ఇంజమూరి వెంకటయ్య, రణపంగ నాగయ్య, రాచకొండ అజయ్, కొణతం చినసీతారాంరెడ్డి, కరీముల్లా, పాండు నాయక్, తాళ్ల సురేష్‌రెడ్డి, కొమర్రాజు వెంకట్, నీలా రామ్మూర్తి, ఆకారపు వెంకటేశ్వర్లు, గజ్జల కోటేశ్వరరావు, మచ్చ శ్రీను, కత్తి శ్రీనివాసరెడ్డి, గాజుల పున్నమ్మ తదితరులు పాల్గొన్నారు.



## సాయం చేసేందుకే(మొదటి పేజీ తరువాయి)

అఖిలేష్ యాదవ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకవైపు రాజ్యాంగాన్ని రక్షించే ఇండియా కూటమి ఉండగా, మరోవైపు రాజ్యాంగాన్ని రద్దు చేయాలని చూసే శక్తులు మరోవైపు ఉన్నాయన్నారు. రిజర్వేషన్లలో 50 శాతం పరిమితిని ఎత్తివేస్తామన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే 'అగ్నిపథ్' పథకాన్ని బుట్టదాఖలు చేస్తామని హామీనిచ్చారు. దేశ ప్రజలకు సేవ చేసేందుకు ఆ పరమాత్మే తనను పంపారని ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ స్పందించారు. మనలో ప్రతి ఒక్కరూ జీవసంబంధమైన వారు కానీ నరేంద్ర మోదీ జీవసంబంధమైన వారు కాదు. అంబానీ, అదానీలకు సాయం చేయాలని పరమాత్మ ఆయనను పంపారని ఎద్దేవా చేశారు. రైతులు, కార్మికులకు సేవ చేసేందుకు పరమాత్మ ప్రధాని నరేంద్ర మోదీని పంపలేదన్నారు. నిజంగా పరమాత్మ మోదీని పంపిఉంటే ఆయన పేదలు, రైతులకు సాయపడేవారని చెప్పారు. బడా పారిశ్రామికవేత్తలు, సంపన్నుల సేవలో మోదీ తరిస్తున్నారని మండిపడ్డారు. పేదల సమస్యలు, ధరల మంట, నిరుద్యోగం వంటి వాస్తవిక అంశాలను కాషాయ నేతలు విస్మరిస్తున్నారని ఆరోపించారు. కేంద్రంలో ఇండియా కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన వెంటనే దేశ ఆర్థిక వ్యవస్థను పరుగులు తీయిస్తుందన్నారు.

**చట్టబద్ధ పాలనకు ముగింపు పలికిన మోదీ...** మధ్యప్రదేశ్ సాగర్‌లో దళిత యువతి సోదరుడు హత్యకు గురికావడంపై బిజెపిపై రాహుల్‌గాంధీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రధాని మోదీ చట్టబద్ధ పాలనకు ముగింపు పలికారని మండిపడ్డారు. దళిత యువకుడి హత్య తన హృదయాన్ని తీవ్రంగా కలిచివేసిందని, మధ్యప్రదేశ్‌లో దళిత కుటుంబానికి బిజెపి నేతలు ఏం చేశారని ఆలోచిస్తే ఆగ్రహం కలుగుతుందన్నారు.

ఈ మేరకు రాహుల్ 'ఎక్స్'లో పోస్టు చేశారు. దళిత యువతి సోదరుడి హత్య ఘటన బిజెపి పాలనలో సిగ్గుపడాల్సిన విషయమని చెప్పారు. ఈ ప్రభుత్వం ఎప్పుడు కూడా నిందితులకు అండగా ఉంటుందని, బాధిత మహిళలను పట్టించుకోవడం లేదని విమర్శించారు.

## బ్లాక్ మార్కెట్‌కు పత్తి విత్తనం

(మొదటి పేజీ తరువాయి)

తదితర విత్తనాలకు డిమాండ్ ఉంది. ఇవి రోగాన్ని తట్టుకోవడంతో పాటు దిగుబడి పెరుగుతున్నట్లు రైతులు చెబుతున్నారు. అయితే ఈ విత్తనాలను వ్యాపారులు బ్లాక్ చేశారు. పై పేరున్న విత్తనాల ధర 840రూపాయలు ఉండగా రెండు వేల నుండి రెండు వేల ఐదువందల రూపాయలకు విక్రయిస్తున్నట్లు తెలుస్తుంది. రైతుకు ఇచ్చే చిట్టిలో మాత్రం ప్యాకెట్‌పై ఉన్న ధరలు ఎంట్రీ చేస్తున్నారు. అధికంగా వసూలు చేసే ధరను నమోదు చేయలేదు. ఇదేంటంటే ఇవి బ్లాక్‌లో ఉన్నాయి, దొరకడం లేదు..మీ ఇష్టం ఉంటే కొనుగోలు చేయడండి లేకుంటే లేదంటు వ్యాపారులు బుకాయిస్తున్న పరిస్థితి.

**నిఘా కరువు...** ప్రతి ఏటా పత్తి విత్తనాల విక్రయం సందర్భంగా టాస్క్‌పోర్లు అధికారులు ఫర్టిలైజర్ దుఖానాలను తనిఖీ చేసే వారు. ఈ ఏడాది ఎన్నికల బిజీలో ఉన్న అధికారులు అటు వైపు చూడడం లేదు. ఈ నెల 21న వ్యవాయ శాఖ డైరెక్టర్ బి గోపి జనగామ నుండే వ్యవసాయ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వయించారు. కల్తీ విత్తనాల విక్రయాలు జరగకుండా చూడాలని ఆదేశించారు. ఫర్టిలైజర్ షాపులపై నిఘా పెట్టడం కోసం పోలీస్, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులతో టాస్క్‌పోర్స్ కమిటీ వేయాలని ఆదేశించారు. జనగామ జిల్లాలో ఎక్కడా తనిఖీలు జరగడం లేదు. దీనితో ఎవరు ఎలాంటి విత్తనాలు విక్రయిస్తున్నారో తెలియని పరిస్థితి.

**కల్తీ విత్తనాల విక్రయాలను అరికట్టాలి : ఆది సాయన్న** జిల్లాలో కల్తీ విత్తనాల విక్రయాలను అరికట్టాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆది సాయన్న వ్యవసాయ అధికారులను కోరారు. వ్యాపారులు రైతుల నుండి అధికంగా డబ్బులు వసూలు చేయడంతో పాటు గతేడాది విత్తనాలు సైతం విక్రయిస్తున్నట్లుగా తెలుస్తుందన్నారు. ఫర్టిలైజర్ షాపుల్ని క్షుణంగా తనిఖీ చేయడంతో పాటు స్టాక్ రిజిస్టర్లు పరిశీలించాలని, అధిక ధరలకు వసూలు చేయడకుండా అడ్డుకోవాలని కోరారు.

## హైదరాబాద్ బుక్ ఫెయిర్‌కు డిపాజిట్ బాండ్ల అందజేత



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ బుక్ ఫెయిర్‌కు సంబంధించిన రూ. 78 లక్షల ఫిక్సిడ్ డిపాజిట్ బాండ్లను ఇటీవల ఎన్నికైన నూతన కమిటీకి బుక్‌ఫెయిర్ పూర్వ కోశాధికారి పి.రాజేశ్వరరావు అందజేశారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్ బుక్ ఫెయిర్ కార్యాలయంలో వ్యవస్థాపక కార్యదర్శి, పూర్వ కోశాధికారి పి.రాజేశ్వర్‌రావు, మాజీ కార్యదర్శి కోయ చంద్రమోహన్ నుండి నూతన అధ్యక్షుడు యాకూబ్, కోశాధికారి పి.నారాయణరెడ్డి, ఉపాధ్యక్షులు బాల్ రెడ్డి మొత్తం రూ 78.28 లక్షల విలువైన బాండ్స్‌ను అందుకున్నారు.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR - 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com

## పశుగ్రాసం కొరతతో పాడి రైతుల ఇబ్బందులు



ప్రజాపక్షం/షాబాద్ : రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలోని వివిధ గ్రామాల పాడి రైతులకు పశుగ్రాసం కొరత ఏర్పాడింది. గత నెల రోజుల నుండి ఎండలు ఎక్కువ కావడంతో భూగర్భ జలాలు అడుగంటడంతో బోర్లలో నీటి మట్టం దగ్గింది. రైతుల బోర్లు ఎండి పోవడంతో పశువుల కోసం వేసుకున్న పచ్చిగడ్డి ఎండిపోతుంది. దీంతో పశువులకు పశుగ్రాసం కొరత ఏర్పాడింది. పశువుల మేత కోసం రైతులు వివిధ మండలాల నుండి వరి గడ్డిని ట్రాక్టర్లపై కొనుగోలు చేస్తున్నారు. చాల మంది రైతులు పశుగ్రాసం కొరతతో పశువులను ఇతర రాష్ట్రాలకు విక్రయిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి పశువులకు పచ్చి మేతను అందించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని రైతులు వేడుకుంటున్నారు.



## 'మహాలక్ష్మి' చెల్లింపులపై ప్రభుత్వం స్పష్టతనివ్వాలి

ప్రజాపక్షం/హైదరాబాద్ : మహాలక్ష్మి పథకం కింద ఆర్‌టిసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణానికి సంబంధించి ఆర్టీసీకి చెల్లించాల్సిన నగదుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ట్రేడ్ యూనియన్ సీనియర్ నాయకులు, ఆర్టీసీ మాజీ బోర్డ్ సభ్యుడు ఎం.నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు. మహాలక్ష్మి పథకం కింద గత ఆరు నెలలు (డిసెంబర్ నుండి మే నెల వరకు) రాష్ట్ర ప్రభుత్వం మొత్తంగా ఆర్టీసీకి ఇవ్వాల్సింది ఎంత ? బడ్జెట్ రిలీజ్ ద్వారా ఆర్టీసీకి చెల్లించిన మొత్తం ఎంత అనే అంశం ఆర్థిక శాఖ మంత్రి, ఆర్‌టిసి ఉన్నతాధికారులు స్పష్టం చేయాలని నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. అదేవిధంగా 'బాండ్ చెల్లింపునకు సంబంధించి గత ఫిబ్రవరి 2వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెక్కు రూపంలో ఆర్టీసీకి చెల్లించిన రూ. 280 కోట్ల నగదుపై సైతం ఆర్‌టిసి యాజమాన్యం స్పష్టత ఇవ్వాలని నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు

## కలంయోధుడు 'సురవరం'



ప్రజాపక్షం/హైదరాబాద్ : పత్రికా సంపాదకుడు, పండితుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి సురవరం ప్రతాపరెడ్డి అని తెలంగాణ రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త కొనియాడారు. మంగళవారం, నాగోల్‌లోని కోఆపరేటివ్ బ్యాంక్ కాలనీలో సాంస్కృతిక సంస్థ ఆకృతి ఆధ్వర్యంలో, సుప్రసిద్ధ సాహితీ వేత్త సురవరం ప్రతాపరెడ్డి 128 వ జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ ఆనాటి నిజాం నిరంకుశ పాలనలో సామాన్య ప్రజల అణచివేతని వ్యతిరేకిస్తూ, సురవరం ప్రజలను చైతన్య వంతులను చేసిన మహానీయులని కొనియాడారు. తెలంగాణా లో కవులే లేరనే నిందా వ్యాఖ్యలను సవాలుగా తీసుకొని, 'గోల్కొండ కవుల చరిత్ర' పేరిట పలుకవుల రచనల సంచికగా వెలువరించిన ధీశాలి అన్నారు.. అన్యాయాలకు వ్యతిరేకంగా తన రచనా పటిమతో నిత్యం పోరాటం చేసిన కలం యోధుడు సురవరం అన్నారు.. విశిష్ట అతిథిగా ప్రభుత్వ సిటీ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ కోయి కోటేశ్వర రావు మాట్లాడుతూ తెలంగాణ చైతన్యానికి సురవరం ప్రతాప రెడ్డి తల్లి వేరు లాంటి వారని అన్నారు. తెలుగుభాషా సాహిత్యాల వికాసానికి ఆయన చారిత్రాత్మకమైన కృషి చేశారని అన్నారు. సభ అధ్యక్షులు ఆకృతి సుధాకర్ మాట్లాడుతూ సురవరం ప్రతాపరెడ్డి గొప్ప సాహితీ మార్గదర్శి అన్నారు.. కార్యక్రమంలో మదర్ థెరీసా ఫౌండేషన్ అధ్యక్షుడు చేపూరి శంకర్ , పలువురు సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

## తానాలో కీలక బాధ్యతలు నిర్వహించిన అంజయ్య చౌదరి



ప్రజాపక్షం/హైదరాబాద్: తెలుగు అసోసియేషన్ యుఎఇ కార్యనిర్వాహక సభ్యులు దుబాయ్‌లోని ఇండియన్ క్లబ్‌లో 'తానా మాజీ అధ్యక్షులు అంజయ్య చౌదరిలావు ఆత్మీయ సమ్మేళనం' నిర్వహించారు. అంజయ్య చౌదరిలావు గత ఒకటిన్నర దశాబ్ద కాలంలో తానాలో వివిధ కీలక బాధ్యతలను నిర్వహించారు. తానాలో అత్యంత ప్రతిష్టమైన ఎమర్జెన్సీ సర్వీస్ టీమ్,తానా టీమ్‌స్క్వేర్ నుండి అత్యంత కీలకమైన అధ్యక్ష పదవి వరకు ఆయన పలు సేవలను అందించారు. ఆయన నాయకత్వంలోనే విపత్కర పరిస్థితులలో ఉత్తర అమెరికాలోని తెలుగు వారికి సహాయ సహకారములు అందించారని తెలుగు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో యుఎఇ తెలుగు అసోసియేషన్ తరుపున ప్రస్తుత కార్య నిర్వాహక చైర్మన్ వివేకానంద్ బలుస , ప్రెసిడెంట్ మసివుద్దీన్, జనరల్ సెక్రెటరీ విజయ భాస్కర్ , ట్రెజరర్ శ్రీనివాస్ గౌడ్ , ఇంటర్నేషనల్ రిలేషన్స్ డైరెక్టర్ సురేంద్ర ధనేకుల, శ్రీధర్, భీమ్‌శంకర్ బంగారి, చైతన్య చకినాల , దినేష్ కుమార్ ఉగ్గిన , మురళి కృష్ణ నూకల , షేక్ షావలితో పాటు ఫారెస్ట్ నేషన్ ఎం.డి శరత్ నల్లమోతు హాజరయ్యారు.

## ఇంజినీరింగ్ ప్రవేశాలకు మెరుగైన శిక్షణ

### హైదరాబాద్, విజయవాడ, వైజాగ్‌లలో వేదాంతు సెంటర్లు ప్రారంభం




ప్రజాపక్షం/హైదరాబాద్ : ఇంజినీరింగ్ విద్య ప్రవేశాలకుగాను ఆన్‌లైన్ కోచింగ్ ద్వారా విద్యారంగంలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న వేదాంతు సంస్థ ఇప్పుడు ఆఫ్‌లైన్ కోచింగ్ వైపు రంగంలోకి ప్రవేశించింది. రానున్న రెండేళ్లలో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో 10కిపైగా సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు వేదాంతు వ్యవస్థాకులు, సిఇఒ వంశీ కృష్ణ తెలిపారు. హైదరాబాద్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఏలాంటి ఒత్తిడి లేకుండా విద్యను అభ్యసించడంమే లక్ష్యంగా గత 10 ఏళ్లుగా భారతీయ విద్యా రంగాన్ని మార్చడంలో వేదాంతు కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ఇందులో భాగంగానే ఈ విద్యా సంవత్సరం నుంచి హైదరాబాద్, విజయవాడ, వైజాగ్ కేంద్రంగా ఆఫ్‌లైన్ సెంటర్లను ప్రారంభించినట్లు ఆయన వెల్లడించారు. విస్తరలో భాగంగా తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల్లో విజ్ఞాన్‌తో భాగస్వామ్యం చేసుకున్నట్లు చెప్పారు. కేవలం రూ.4వేలు చెల్లించడం ద్వారా ఆన్‌లైన్‌ద్వారా ఇంటర్‌లోని అన్ని సబ్జెక్ట్‌లకు ఏడాది పాటు శిక్షణ పొందవచ్చాని, స్మార్ట్ పోన్, నెట్ ఉంటే చాలు మారు మూల గ్రామాల్లో ఉన్న విద్యార్థులు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉండదని వంశీ కృష్ణ తెలిపారు.

## కలుషిత ఆహారం తిని ఎనిమిది మంది ఆసుపత్రి పాలు

ప్రజాపక్షం/షాద్‌నగర్ : రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లోని ఓ బిర్యానీ సెంటర్‌లో కలుషిత ఆహారం తిని ఎనిమిది మంది ఆసుపత్రి పాలైన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. షాద్‌నగర్ మండల పరిధిలోని అప్పరెడ్డి గూడ గ్రామానికి చెందిన కావలి నరేందర్ తన పెళ్లి రోజు కావడంతో అతని కుటుంబ సభ్యులు దీక్షిత, తన్విక, మంగమ్మ, అనిరూద్, అభిలాష్, జోష్ణ, సాయి, శ్రీకర్ మొత్తం ఎనిమిది మంది కలిసి షాద్‌నగర్‌లోని సాయి బాబా ఫ్యామిలీ రెస్టారెంట్‌లో మండి బిర్యానీ కుటుంబ సభ్యులు అందరూ కలిసి తిన్నారు. తిన్న అరగంటలోనే అందరికి వాంతులు విరేచనాలు కావడం జరిగింది. వెంటనే కుటుంబ సభ్యులను శంషాబాద్ ప్రైయివేటు ఆసుపత్రిలో చేర్పించారు. కుటుంబ సభ్యుల పరిస్థితి విషమంగా ఉండడంతో అందరిని ఐసీయూలో అడ్మిట్ చేసి చికిత్స నిర్వహించారు. సంఘటన తెలుసుకున్న ఫుడ్ ఇన్స్పెక్టర్లు వచ్చి సాయిబాబా రెస్టారెంట్‌లోని మండి బిర్యానీని సీజ్ చేసి తనిఖీలు నిర్వహించారు. అపరిశుభ్రంగా ఉన్న రెస్టారెంట్స్, హోటల్స్‌ల పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



# నాటుసారా తయారీపై ఉక్కుపాదం



### పది రోజుల్లోనే 598 కేసుల నమోదు
### 383 మంది అరెస్టు..93 వాహనాలు సీజ్
### దాడుల్లో భారీగా పట్టుబడిన బెల్లం, స్పటిక
### నాటుసారా తయారీ కేంద్రాలపై దాడులు
### నార్కోటిక్స్‌పై నిఘా, ప్రత్యేక దాడులు

ప్రజాపక్షం/హైదరాబాద్: ఏదైనా మొదలెట్టడం సులభమే..మొదలెట్టిన కార్య లక్ష్యాన్ని చేరుకోవడానికి మాత్రం ఒక్కొక్క మెట్టు ఎక్కుకుంటూ లక్ష్యాన్ని చేరుకోవాల్సి ఉంటుంది.. తెలంగాణలో కనుమరుగయ్యిందని భావించిన నాటుసారా తయారీ మళ్లీ పురుడుపోసుకుందని భావించిన అబ్కారీశాఖ నాటుసారను తయారీని తుదిముట్టించడానికి పటిష్ట చర్యలు చేపట్టింది. ఆగస్టు 31 నాటికి తెలంగాణలో నాటుసారా తయారీని కనబడకుండా చేయాలని అబ్కారీ శాఖ కమిషనర్ ఇ.శ్రీధర్, ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి ఆదేశాలతో పది రోజుల నుంచ నాటుసార తయారీ, ముడి సరుకుల రవాణపై అబ్కారీ యంత్రాంగం ఉక్కుపాదం మోపింది. పది రోజుల్లో జరిపిన దాడులను పరిశీలిస్తే.. నాటుసారా తయారీకి వినియోగించే బెల్లం, స్పటిక(అలం)ను భారీగా పట్టుబడ్డాయి. నాటు సారా తయారీపై ఎక్కువగా దృష్టిపెట్టిన యంత్రాంగం ఈసారి ముడి సరుకుల రవాణను అడ్డుకోవడమే లక్ష్యం గా దాడులు నిర్వహిస్తూ ఉండడం విస్తుపోయే నిజాలు బయటకు వచ్చాయి.



### పది రోజుల్లోనే ఊహించని ఫలితాలు..

ఈ నెల 17న తెలంగాణలోని అన్ని జిల్లాలోని ఎక్సైజ్, ఎన్ఫోర్స్మెంట్ అధికారుల సమీక్షా సమావేశం జరిగింది. సమావేశంలో ఆగస్టు 31 నాటికి తెలంగాణలో నాటుసారాను పూర్తిగా నిలువరించాలని కమిషనర్ శ్రీధర్, డైరెక్టర్ విబి కమలాసన్‌రెడ్డి యంత్రాంగాన్ని అదేశించారు.ప్రధానంగా నాటుసారా తయారీ కేంద్రాలతో పాటు తయారీకి వినియోగించే ముడిసరుకుల రవాణపై నిఘా పెట్టాలని అదేశించారు. దీంతో ఎక్సైజ్, ఎన్ఫోర్స్మెంట్ యంత్రాంగం ఎక్కడిక్కడ నిఘా భారీగా బెల్లం సరఫరా చేసే వాహనాల్ని పట్టుకున్నారు. ఈ దాడుల్లో భారీగా బెల్లం, స్పటిక పట్టుబడింది. పది రోజుల్లో దాడులు నిర్వహించగా 2659 లీటర్ల నాటు సారాను, నాటుసారా తయారీకి వినియోగించే 19,477 కిలోల బెల్లం, 1617 కిలోల స్పటికను స్వాధీనం చేసుకున్నారు. రూ. 10 లక్షల మేర విలువ చేసే బెల్లం,రూ. లక్ష విలువ చేసే అలం(స్పటిక)ను పట్టుకునట్లు అంచనా వేశారు. మొత్తంగా పది రోజుల్లో నిర్వహించిన దాడుల్లో 598 కేసులు నమోదు చేసి 383మందిని అరెస్టు చేశారు. 93 వాహనాలను కూడ సీజ్ చేశారు. మరో 330 మంది ని తహసీల్దార్ ముందు బైండోర్ చేశారు. ఒకటికి రెండు మార్లు నాటు సారాతో పట్టుబడిన వారినుంచి రూ. రెండు లక్షల జరిమానాను కూడ కట్టించారు. నాటుసారా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహిస్తున్న సమయం లో నాటుసారా తయారీకి వినియోగించే 82,540 లీటర్ల బెల్లం పానకాన్ని నేల పాలు చేశారు.

### నార్కోటిక్స్‌పై ప్రత్యేక దాడులు..

నాటుసారా నిర్మూలనతోపాటు సిఎం అదేశాల మేరకు నార్కోటిక్స ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ దృష్టి సారించనుంది. తెలంగాణలో ఎక్కడ కూడా మత్తు మందుల అమ్మకాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని, మత్తు మందుల రవాణా, అమ్మకాలు సాగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సిఎం రేవంత్రెడ్డి ఎక్సైజ్‌తో పాటు పోలీస్ శాఖను అదేశించారు. ఈ మేరకు నార్కోటిక్ వినియోగ ప్రాంతాలను గుర్తించే పనిలో యంత్రాంగం నిమగ్నమయ్యింది. జూన్ 1నుంచి ఎక్సైజ్ ఎన్ఫోర్మెంట్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దాడులను ముమ్మరం చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. తెలంగాణలో మత్తు మందులతోపాటు నాటుసారా తయారీ, అమ్మకాలు లేకుండా చేయడమే లక్ష్యంగా ఎక్సైజ్ శాఖ సమయాత్తమయ్యింది. వీటన్నటితోపాటు ఎక్సైజ్ డిపార్ట్మెంట్‌లో మరో విభాగం నాన్ లిక్కర్ పెయిడ్ మద్యాన్ని ఇతర ప్రాంతాల నుంచి రాకుండా పట్టిష్టమైన ముందస్తు ప్రణాళికలతో ముందుకు సాగనున్నారు ఎక్సైజ్ అధికారులు.

# ప్రణాళికలు అమలులోకి తెచ్చిన నెహ్రూ

### రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు చల్లా నర్సింహా రెడ్డి



ప్రజాపక్షం/ రంగారెడ్డి ప్రతినిధి: పంచవర్ష ప్రణాళికలను అమలులోకి తీసుకువచ్చిన మహోన్నత వ్యక్తి మాజీ ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ అని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు చల్లా నర్సింహా రెడ్డి అన్నారు.మంగళవారం నాంపల్లిలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డిసిసి అధ్యక్షులు చల్లా నర్సింహా రెడ్డి ఆధ్వర్యంలో మాజీ ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ 60వ వర్ధంతి సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా చల్లా నర్సింహా రెడ్డి మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య పోరాటంలో జవహర్‌లాల్ నెహ్రూ ప్రముఖ పాత్ర పోషించారని తెలిపారు. కార్యక్రమంలో టిపిసి సి అధికారి ప్రతినిధి గౌరీ సతీష్,టి.కుమార్ రావు, సీనియర్ వైస్ ప్రెసిడెంట్స్,జనరల్ సెక్రెటరీ అల్లం భాస్కర్ రావు యాదవ్, రాజపుట్,కోటరీ,జనరల్ సెక్రెటరీ వరికుప్పల సుధాకర్, టిపిసిసి ప్రచార కమిటీ కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా పాల్గొన్నారు.

## ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అగ్నివీర్ వాయు భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

### ఆన్‌లైన్‌లో జూన్ 5 తుది గడువు
### జిల్లా ఉపాధి అధికారి వందన

ప్రజాపక్షం/హైదరాబాద్ : భారత వాయి సేనలో ఆగ్నివీర్ వాయు (సంగీతకళాకారుల కోటా) భర్తీకి సంబంధించి ఇండియన్ ఫోర్స్ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. అసక్తిగల అభ్యర్థులు జూన్ 5వ తేదీలోపు ఆన్ లైన్ వెబ్ పోర్దర్‌లో పేర్లను నమోదు చేసుకోవాల్సి ఉంటుందని జిల్లా ఉపాధి అధికారి ఎ.వందన తెలిపారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. ఇందుకు సంబంధించి ఇండియన్ ఎయిర్ ఫోర్స్ 3 ఎయిర్మెన్ సెలక్షన్ సెంటర్, కాన్పూర్, 7 ఎయిర్మెన్ సెలక్షన్ సెంటర్,బెంగుళూరులో ఇండియన్ ఎయిర్ ' ఫోర్స్ ద్వారా అగ్నివీర్ వాయు (మ్యూజిషియన్) ఇంటెక్ 01/2025 రిక్రూట్మెంట్ కోసం జాబ్ నోటిఫికేషన్ జారీ చేసిందని తెలిపారు. పెళ్లి కాని భారతీయ పురుషులు, మహిళల కోసం అగ్నివీర్ వాయు (సంగీతకారుడు) కోసం రిజి స్ట్రేషన్ ఆధారిత రిక్రూట్మెంట్ ర్యాలీని నిర్వహిస్తోందన్నారు. అగ్నిపథ్ పథకం ప్రవేశంతో, క్లరికల్,టెక్నికల్ కేడర్‌లో ఉద్యోగ అవకాశం కల్పించనున్నారని, ఉద్యోగం పొందిన వారిలో 4 సంవత్సరాల సర్వీసుకు పరిమితం చేయబడుతుందని, విశేష ప్రతిభాను కనబర్చిన అభ్యర్థులలో 25శాతం మందికి శాశ్వత ఉద్యోగ అవకాశం కల్పిస్తారని వెల్లడించారు. అభ్యర్థి అవివాహితులై ఉండి 2007 సంవత్సరంలో జనవరి 02 నుంచి జూలై 2వ తేదీ మధ్య పుట్టినవారు ఇందుకు అర్హులని తెలిపారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాల,బోర్డు నుండి కనీస పాస్ మార్కులతో మెట్రిక్యులేషన్, 10వ తరగతి ఉత్తీర్ణత లేదా సమాన విద్య కలిగి ఉండంతో పాటు సంగీతంలో (హిందుస్తానీ, కర్నాటిక్ మ్యూజిక్ తదితర అంశాల్లో పూర్తి ప్రావిణ్యులై వారికి అవకాశం కల్పించబడుతుందన్నాని తెలిపారు అర్హత గల వారు 5జూన్ వరకు వెబ్ పోర్టల్ https://agnipathvayu.cdac.inలో రిక్రూట్మెంట్ ర్యాలీలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. రిక్రూ మెంట్ ర్యాలీకి సంబంధించి పూర్తి వివరాల కోసం https:// agnipathvayu. cdac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని జిల్లా ఉపాధిఅధికారి పేర్కొన్నారు. భర్తీకి సంబంధించి మంగళవారం జిల్లా కలెక్టర్‌తో భారత వాయు సేనా వింగ్ కమాండర్ గురుప్రీత్ అత్వాల్ సమావేశం అయ్యారు.

# వర్షాకాలంలో ప్రతి జవాన్ అప్రమత్తం

ప్రజాపక్షం/ నార్సింగి: సిడిఎం ఏ,సర్కులర్ నంబర్ ప్రకారం నార్సింగి మున్సిపల్ కమిషనర్ టి.ప్రవీణ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు సానిటేషన్ ఇన్స్పెక్టర్ లచ్చిరాం సహకారంతో సూపర్వైజర్లు మంగళవారం తమ వార్డులలో వర్కర్లతో మీటింగ్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జవాన్లకు రానున్న వర్షాకాలంలో 24 గంటలు అప్రమత్తదిగా ఉండాలని సూచించారు ప్రే మాన్సూన్ కార్యక్రమం అన్ని వార్డులలో ప్రిపరేషన్ చేసుకోవాల్సిందిగా విలేజ్ జవాన్లకు తెలియజేయాలన్నారు.బుధవారం 12 గంటలకు మీ యొక్క తడి చెత్త పొడి చెత్త గురించి ఆటోల వారితో మరియు స్వీపర్లతో ,కామాటీలతో మీటింగ్ తీసుకొని వారికి వివరించాలని అన్నారు. రానున్న వర్షాకాలంలో మ్యానువల్స్ లో మట్టి లేకుండా చూసుకోవాలని రోడ్ల పక్కన ఎలాంటి మట్టి కుప్పలు చెత్త కుప్పలు,చేదారాలు ఉండకుండా వాటర్ డ్రైనేజ్ పక్కన చెట్లు చేరకుండాప్రతి రోజు శుభ్రం చేసుకోవాలని ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించాలని పేర్కొన్నారు.వచ్చే వర్షాకాలంలో ఏమైనా ఇల్లు పడిపోయే ప్రమాద పరిస్థితుల్లో ఉన్నట్లయితే వెంటనే సమాచారం అందించాలన్నారు వాటర్ పాయింట్స్ ఎక్కడున్నా అక్కడ చేరుకొని సమస్యను పరిష్కరించాలని అన్నారు.ప్రజలకు రాకపోకలు ఇబ్బంది కాకుండా మనమే చూసుకోవాల్సిన బాధ్యత మనపై ఉంది. కాబట్టి అందరూ అందుబాటులో 24/7 విధులకు హాజరు కావాలని శానిటేషన్ జవాన్లకు సూచించడం జరిగింది. ఈ విషయాలన్నీ ప్రతి ఒక్క కామాటికి,జవాన్లకు ,స్వీపర్లకు,డోర్ టు డోర్ అబ్బాయికి తెలియజేయాలని కన్సల్ట్ జవాన్లకు చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో కోకాపేట శానిటేషన్ జవాన్ మహిపాల్, గండిపేట హమ్మద్, మంచిరేవుల వంశీ,నార్సింగిలో జనార్ధన్ రెడ్డి,శ్రీధర్ పాల్గొన్నారు.



# రాష్ట్ర అవతరణ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు

### రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక





ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి: జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని, అధికారులు సమన్వయంతో పని చేస్తూ అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.శశాంక సంబంధిత శాఖాధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ శశాంక రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల నిర్వహణ ఏర్పాట్ల పై జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొంగరకలాన్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవన ఆవరణలో నిర్వహించే రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలలో అధికారులు,మీడియా, ఇతరులకు సీటింగ్ ఏర్పాట్లు చేయాలని రెవెన్యూ డివిజనల్ అధికారిని ఆదేశించారు. త్రాగునీరు,పారిశుధ్య ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ సందేశం రూపొందించేందుకు ఆయా శాఖలు సాధించిన ప్రగతి నివేదికలు జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారికి పంపించాలని తెలిపారు. పోలీసు గౌరవ వందనంతో పాటు వేడుకలలో పోలీసు బందోబస్త్ ఏర్పాట్లు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. వేదికను అందంగా అలంకరించాలని ఉద్యాన శాఖకు, విద్యుత్ అంతరాయం కలగకుండా చూడాలని విద్యుత్ అధికారులకు సూచించారు.పాఠశాలల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని డిఇఒ ను ఆదేశించారు. వేడుకల ఏర్పాట్లలో ఎక్కడ ఎలాంటి పొరపాట్లు జరగకుండా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు ప్రతిమా సింగ్,భూపాల్ రెడ్డి,జిల్లా రెవెన్యూ అధికారి సంగీత,కలెక్టరేట్ ఎఒ ప్రమీల రాణి,సిపిఒ సౌమ్య,జిల్లా అధికారులు,పోలీసు శాఖ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

### సజావుగా కౌంటింగ్ ప్రక్రియ

నిబంధనలను పక్కాగా పాటిస్తూ, ఓట్ల లెక్కింపు ప్రక్రియను సజావుగా నిర్వహించాలని కలెక్టర్ కె.శశాంక తెలిపారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయంలో బండారి శ్రీనివాస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో జూన్ 4న చేపట్టనున్న పార్లమెంటు నియోజకవర్గ ఓట్ల లెక్కింపును పురస్కరించుకుని కౌంటింగ్ సూపర్వైజర్లు,సహాయక మైక్రో అబ్జర్వర్లతో శిక్షణ తరగతులు నిర్వహించారు.కౌంటింగ్ నిర్వహణ సందర్భంగా పాటించాల్సిన నిబంధనలు, అనుసరించాల్సిన పద్ధతులపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చేవెళ్ల ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ శశాంక మాట్లాడుతూ చేవెళ్ల పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓట్ల లెక్కింపు పక్కాగా జరిగేలా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఉదయం 6 గంటలకు కౌంటింగ్ సిబ్బంది ఓట్ల లెక్కింపు కేంద్రం వద్దకు చేరుకోవాలని, రాండమైజేషన్ జరిపిన మీదట ఆ జాబితాను అనుసరిస్తూ వారికి ఆయా నియోజకవర్గాల వారీగా కేటాయించడం జరుగుతుందన్నారు. ఓట్ల లెక్కింపు కోసం మహేశ్వరం, రాజేందర్ నగర్,శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజక వర్గాలకు సంబంధించి 28 , మిగతా నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలైన చేవెళ్ల, పరిగి,వికారాబాద్, తాండూర్‌లకు సంబంధించి 14 చొప్పున టేబుల్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. నిర్ణీత సమయానికి ఓట్ల లెక్కింపు ప్రారంభించేందుకు వీలుగా సిబ్బంది అన్ని విధాలుగా సన్నద్ధమై ఉండాలన్నారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ను చేపట్టి సాధ్యమైనంత త్వరగాపూర్తి చేయాలన్నారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి సమస్య ఎదురైనా వెంటనే సహాయ రిటర్నింగ్ అధికారులను సంప్రదించి వారి దృష్టికి తేవాలని చెప్పారు. ముఖ్యంగా కౌంటింగ్ సూపర్వైజర్లు,సూక్ష్మ పరిశీలకులు ఓట్ల లెక్కింపు ప్రక్రియలో క్రియాశీలకపాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. కౌంటింగ్ సెంటర్‌లో అన్ని సదుపాయాలు అం దుబాటులో ఉంటాయని, సిబ్బందికి అల్పాహారం, భోజనం కోసం కూడా తగిన ఏర్పాట్లు చేశామని తెలిపారు. శిక్షణ తరగతులలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, సహాయ రిటర్నింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### బూరాన్ ఖాన్ చెరువులో గుర్రపు డెక్కను తొలగించాలి

బూరాన్ ఖాన్ చెరువులో గుర్రపు డెక్క,నాచును తొలగించాలని, చెరువు పరిసర ప్రాంతాలను శుభ్రపరచాలని కలెక్టర్ కె.శశాంక అధికారులు ఆదేశించారు. రాబోవు వర్షాకాలం దృష్ట్యా జల్పల్లి మున్సిపాలిటి పరిధిలోని ఉస్మాన్ సాగర్ కాలనీని మంగళవారం అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్‌తో కలిసి కలెక్టర్ కె.శశాంక క్షేత్ర స్థాయిలో సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఉస్మాన్ సాగర్ కాలనీ ప్రజల సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో జల్ పల్లి, బడంగ్ పేట్ మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దారులు, ఇరిగేషన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో బూరాన్ ఖాన్ చెరువు పరిసర ప్రాంతంలో ముంపునకు గురైన ప్రాంతాల్ని దృష్టిలో పెట్టుకొని రాబోవు వర్షాకాలంలో బూరాన్ ఖాన్ చెరువును మరమ్మతులు చేపట్టాలని సూచించారు. చెరువులో గుర్రపు డెక్కను, నాచును తొలగించాలని, చెరువు పరిసర ప్రాంతాలను శుభ్రపరచాలని చెప్పారు. అధికారులు ముందస్తు కార్యాచరణ ప్రణాళికను తయారు చేసుకొని అక్కడి ప్రజలకు వర్షాకాలంలో తాగునీటి సమస్య, డ్రైనేజి, దోమల బెడద, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలని ఆదేశించారు. సమావేశంలో ఇరిగేషన్ శాఖ అధికారులు హైదర్ అలీఖాన్, బన్సీలాల్,గంగరాజు, జల్ పల్లి,బడంగ్ పేట్ మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దారులు పాల్గొన్నారు.

# కౌంటింగ్‌కు పటిష్ట భద్రత

పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి : రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్
కౌంటింగ్ ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్ష



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** వచ్చే నెల జూన్ 4 వ తేదిన జరగనున్న పార్లమెంటు ఎన్నికల ఓట్ల లెక్కింపును పక్కాగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ అధికారులను ఆదేశించారు. సిసి కెమెరాల ద్వారా కౌంటింగ్ హాల్లో ప్రతిదీ రికార్డు అవుతుందని సిబ్బంది, జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. మంగళవారం సాయంత్రం హైదరాబాద్‌లోని తన కార్యాలయం నుంచి పార్లమెంటు ఎన్నికల కౌంటింగ్ ఏర్పాట్లపై రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్ రాజ్ అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, ఆర్‌ఓలు, ఏఆర్‌ఓలు, పోలీసు కమిషనర్లు , ఎస్‌పి లతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్ష నిర్వహించారు. మహబూబ్‌నగర్ సమీకృత కలెక్టరేట్ కాన్ఫరెన్సు హాల్ నుంచి రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ జి.రవి నాయక్, ఎస్పి హర్షవర్ధన్, ఏఆర్‌ఓలు శివేంద్ర ప్రతాప్, మోహన్ రావు, నారాయణ పేట అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్ తదితరులు వీడియో కాన్ఫరెన్సు లో పాల్గొన్నారు. కౌంటింగ్ సందర్భంగా చేపట్టాల్సిన జాగ్రత్తలపై వికాస్ రాజ్ దిశా నిర్దేశం చేశారు. వీడియో కాన్ఫరెన్సు ద్వారా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ చిన్న పొరపాటు జరగకుండా ఓట్ల లెక్కింపు నిర్వహించాలని సూచించారు. సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని, నిర్లక్ష్యంగా ఉండవద్దని పేర్కొన్నారు. ఈవీఎంలను కౌంటింగ్ హాల్‌కు తీసుకెళ్లే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, కౌంటింగ్ పూర్తి అయిన తర్వాత ఈవీఎంలు, ఎన్నికల సామాగ్రిని ఒకచోట భద్రపరచాలని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో కీలకమైన కౌంటింగ్ సజావుగా సాగేలా అధికారులు అందరూ ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఎలాంటి తప్పులు జరగకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాములు, ఏఆర్‌ఓలు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఆవతరణ దశాబ్ది వేడుకలు ఘనంగా జరుపుకోవాలి

జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం / వనపర్తి ప్రతినిధి :** జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ఆవతరణ దశాబ్ది వేడుకలను వనపర్తి జిల్లాలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. మంగళవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయాల సముదాయం లోని సమావేశ మందిరంలో తెలంగాణ రాష్ట్ర ఆవతరణ దినోత్సవ వేడుకల సన్నద్ధతపై అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. వేడుకల ఏర్పాట్లపై కలెక్టర్ వారికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం తెలంగాణ ఆవతరణ దినోత్సవ దశాబ్ది వేడుకల్ని జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయాల సముదాయం జూన్ 2వ తేదీన ఉదయం 9 గంటలకు జాతీయ పతాక ఆవిష్కరణ జరుగుతుందని, ఈ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సైతం ఉదయం 9.30 గంటలలోపే జాతీయ పతాకాన్ని ఆవిష్కరణ చేయాలని చెప్పారు. మండల కార్యాలయాల్లో, గ్రామ పంచాయతీల్లో జెండా ఆవిష్కరణ కార్యక్రమం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ , అదనపు కలెక్టర్ ఎం. నగేష్ అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## మంత్రి జూపల్లిపై ఆరోపణలు సహించం



**ప్రజాపక్షం / వీపనగండ్ల :** చిన్నంబావి మండల లక్ష్మి పల్లి గ్రామంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు శ్రీధర్ రెడ్డి హత్యను రాజకీయ హత్యగా చిత్రీకరించి మంత్రి జూపల్లి కృష్ణారావు ఆయన అనుచరులే చేయించారని నేపం మోపటం దుర్మార్గపు చర్య అని వనపర్తి జిల్లా ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ఇంద్రకంటి వెంకటేష్ విమర్శించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శ్రీధర్ రెడ్డి హత్య కుటుంబ తగాదాలు ఆస్తి తగాదాలతో జరిగిందని ప్రచారం జరుగుతున్న బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, కేటిఆర్ , నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి మాజీ ఐపీఎస్ అధికారి ప్రవీణ్‌కుమార్ , మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డిలు ఈ హత్యను మంత్రి జూపల్లి కృష్ణారావు , వారి అనుచరులు చేయించారని కక్షపూర్వకంగా నిందలు మోపటం సరి కాదని , నిందలు వేసేటప్పుడు ఆ నాయకుడి వ్యక్తిగత జీవితం రాజకీయ జీవితం తెలుసుకొని మాట్లాడాలని హితవు పలికారు. మంత్రి జూపల్లి కృష్ణారావు నియోజకవర్గంలో 20 సంవత్సరాల పాటు ఎమ్మెల్యేగా, మంత్రిగా పని చేసే మచ్చలేని నాయకుడిగా పేరు తెచ్చుకున్నారని అన్నారు. శ్రీధర్ రెడ్డి హత్యను రాజకీయ హత్యగా చిత్రీకరించి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీర మార్షవర్ధన్ రెడ్డి జీవితం అబద్దాల పుట్ట అని, కాంగ్రెస్ పార్టీ మారి కోట్ల రూపాయలు సంపాదించుకున్నారని, అలాంటి వ్యక్తిని ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించిన బుద్ది రాలేదని, బీరం హర్షవర్ధన్ రెడ్డి మాటలు విని కేటిఆర్ , ప్రవీణ్ కుమార్ లు అభివృద్ధి తప్ప హత్యలు ఎరుగని మంత్రి జూపల్లి కృష్ణారావును విమర్శించడం తగదని హితవు పలికారు. నిజ నిర్ధారణలు తెలుసుకోకుండా మాట్లాడటం బీఆర్‌ఎస్ పార్టీ నాయకులకు అలవాటుగా మారిందని, నిజ నిర్ధారణ కాకుండా మంత్రి జూపల్లిపై నేపం మోపితే కాంగ్రెస్ పార్టీ నాయకులు , కార్యకర్తలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. పోలీసు వ్యవస్థపై తమకు నమ్మకం ఉందని నిస్పాక్షితంగా విచారణ జరిపి శ్రీధర్ రెడ్డి హంతకులను కఠినంగా శిక్షించాలని కోరారు.



## ఆరోగ్యంపట్ల అవగాహన

**ప్రజాపక్షం / వీపనగండ్ల :** ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించాలని మండల వైద్యాధికారి డా. వంశీ కృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలకు నెలవారి ప్రోగ్రెస్ రిపోర్టర్ పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామాలలో ఏఎన్ఎంలు ఆశా కార్యకర్తలు గ్రామాలలో ప్రతి ఇంటికి వెళ్లి దీర్ఘకాలిక వ్యాధులైన షుగర్ , బిపి, టిబి రోగులను గుర్తించి వారికి ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించి తూ చా తప్పకుండా మందులు వేసుకునేలా అందించాలని సూచించారు. సీజన్ వారిగా దోమల ద్వారా వచ్చే వ్యాధులు మలేరియా , డెంగు, చికెన్ గున్యా, మెదడువాపు , పైలేరియా , కలుషిత నీటి ద్వారా వ్యాపించే పసిరికలు, డయేరియా, వాంతులు విరోచనాలు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రబలకుండా అవగాహన కల్పించాలని వివరించారు. వాటర్ ట్యాంకులు క్లీనింగ్ , తాగు నీటి పైప్ లైన్ లీకేజీలు సరి చేయడం , మురికి నీటి గుంతలు, నిలువ నీటి గుంతలు గుర్తించి వాటిలో అయిల్ బాల్స్ వేసి లార్వాలను నిరోధించాలని పంచాయతీ సిబ్బందితి సూచించాలని వివరించారు. నెలవారి టార్గెట్స్ సకాలంలో పూర్తి చేయాలని ఎన్‌సిడి స్క్రీనింగ్ , అభ పై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ టార్గెట్స్ పూర్తి చేయాలని డా. వంశీకృష్ణ సూచించారు. ఈ కార్యక్రమంలో డా. రాజశేఖర్ , సూపర్వైజర్ , హెల్త్ అసిస్టెంట్ రాములు, జహంగీర్ , కంప్యూటర్ ఆపరేటర్ , రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.



## ప్రమాద బీమా చెక్కు పంపిణీ

**ప్రజాపక్షం / పాన్‌గల్ :** పాన్‌గల్ మండల పరిధిలోని చిక్కేపల్లి గ్రామానికి చెందిన జలకంటి శాంతమ్మకు బీఆర్‌ఎస్ పార్టీ నుండి మంజూరైన ప్రమాద భీమా చెక్కును ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్ రెడ్డి బాధితురాలికి అందజేశారు. చిక్కేపల్లి గ్రామానికి చెందిన జిలకంటి ఆంజనేయులు గత 4 నెలల క్రితం చేపల వేటకు వెళ్లి మృతి చెందాడు. మృతి చెందిన వ్యక్తికి బీఆర్‌ఎస్ పార్టీలో సభ్యత్వం ఉన్నందున పార్టీ నుండి మంజూరైన రెండు లక్షల రూపాయల చెక్కును మృతుడి భార్య శాంతమ్మకు అందజేశారు. చెక్కు మంజూరుకు కృషి చేసిన కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డికి, ఎంపీపీ శ్రీధర్ రెడ్డికి, బీఆర్‌ఎస్ పార్టీ మండల నాయకులకు , చిక్కేపల్లి గ్రామ బీఆర్‌ఎస్ పార్టీ నాయకులకు బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు బంధు మండల మాజీ కో ఆర్డీనేటర్ వెంకటయ్య నాయుడు, మాజీ సర్పంచ్ ముంత బాల స్వామి , గ్రామ పార్టీ అధ్యక్షుడు వెంకట్రాములు యాదవ్, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఖాదర్ , బిచ్చాలు, ధర్మారెడ్డి, నర్సింహస్వామి, టైగర్ రాములు తదితరులు ఉన్నారు.

## అతినిబంధనలు పెడితే అనుమతి రద్దు

**ప్రజాపక్షం/అచ్చంపేట :** తాలుకాలో కార్పొరేట్ పాఠశాలల శాఖలలో పుస్తకాలు, డ్రెస్సులు, బూట్లు కొనాలని నిబంధనలు విధిస్తే ఆపాఠశాలల అనుమతిరద్దుచేస్తామని ఎంఈఓ బాలకిషన్ తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, ఏకరూపదుస్తులు, బూట్లు, బ్యాగులు కొనుగోలుచేయాలని బలవంతంచేసిన, ఇబ్బందులకుగురిచేసిన సంబంధితసంస్థల అనుమతులను రద్దుచేస్తామని ఆయన హెచ్చరించారు.

## గ్రూప్ –1 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

**ప్రజాపక్షం / వనపర్తి ప్రతినిధి :** వనపర్తి జిల్లాలో జూన్ 9న జరుగుతున్న గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు పరీక్ష కేంద్రం విషయంలో లేదా మరేదైనా సందేహాలు నివృత్తి కోసం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఒక ప్రకటనలో తెలిపారు. హెల్ప్ లైన్ నంబర్ 08545 /233525 సేవలు పరీక్ష ముందు 8/6/2024 ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు తిరిగి 9/6/2024 ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అందుబాటులో ఉంటాయని తెలియజేశారు. అభ్యర్థులకు పరీక్ష కేంద్రం వివరాలు లేదా మరేదైనా సందేహాలు నివృత్తి కోసం అభ్యర్థులు హెల్ప్ లైన్ నంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు.



## వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సులు

**ప్రజాపక్షం / పెబ్బేరు :** పెబ్బేరు మండలంలోని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గ్రామాలలో వానకాలం విత్తనం కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన సదస్సును ఏర్పాటు చేయడం జరిగింది. మండల వ్యవసాయ అధికారి, వ్యవసాయ విస్తరణ అధికారులు జనంపల్లి, శాఖాపూర్ , పాతపల్లి, పెబ్బేరు, రంగాపూర్ గ్రామాల్లో వారు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయడం జరిగింది. మండల వ్యవసాయ అధికారి చంద్రమౌళి తెలియజేస్తూ ముఖ్యంగా రైతు సోదరులు విత్తనాలు కొనేటప్పుడు తప్పనిసరిగా బిల్లు రసీదు తీసుకోవాలి దాని మీద విత్తనం రకం, లాట్ నంబర్ , విత్తనాములు బ్యాచ్ నంబర్ , తయారైన కాలం ముగిసే తేదీలను రైతులు తప్పనిసరిగా చూసి కొనుక్కోవాలని సూచించడం జరిగింది. అదేవిధంగా గ్రామ స్థాయిలో తక్కువ ధరలకు విత్తనం వ్యవసాయలూజు విత్తనాలు ఈ పరిస్థితులు కొనుక్కోని మోసపోకుడదని సూచించారు. వ్యవసాయ అధికారి మాట్లాడుతూ మంచి నాణ్యత ప్రమాణమైమేలైన రకమైన విత్తనాలను వేసుకొని అధిక దిగుబడి పొందాలని లేదా విత్తనాలు సలహా సూచనలను కొరకై వ్యవసాయ శాఖ వారిని సంప్రదించవచ్చని తెలియజేశారు. అదేవిధంగా పచ్చిరొట్ట ఎరువు అయినటువంటి జీలుగు విత్తనాలు రావడం జరిగింది. విత్తనాలను పొలంలో వేసి పూత దశలో కలియ దున్నడం వల్ల భూసారం పెరగడమే కాకుండా నెలకు కావాల్సిన సూక్ష్మ పోషకాలు అందుతాయని వ్యవసాయ అధికారి చంద్రమౌళి తెలియజేశారు. ఈ కార్యక్రంలో వ్యవసాయ అధికారి చంద్రమౌళి, ఏఈఓ నరేష్ , గ్రామ రైతులు , బీచుపల్లి , శాంతన్న, బాలస్వామి, ధనుంజుయుడు, అల్లెన్న, మనోహర్ రెడ్డి, వెంకటరామిరెడ్డి, మహిళలు పాల్గొన్నారు.



## ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు

**ప్రజాపక్షం / పెబ్బేరు :** నందమూరి తారక రామారావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించిన తెలంగాణ తెలుగు దేశం పార్టీ మంగళవారం రోజు ఉమ్మడి మండలం పెబ్బేరు తెలంగాణ తెలుగు దేశం పార్టీ ఆధ్వర్యంలో నందమూరి తారక రామారావు 101వ జయంతి కార్యక్రమాలు పార్టీ కార్యాలయంలో నందమూరి అభిమానుల, కార్యకర్తల మధ్య ఘనంగా జరిగింది. అందరివాడు ఆ యగపురుషుడు అన్న నందమూరి రామారావు శత జయంతి ఉత్సవాల సందర్భాన రాష్ట్ర నాయకుడు సాంస్కృతిక శాఖ ఉపాధ్యక్షుడు సితార వెంకటేశ్వర్లు విజ్ఞప్తి మేరకు రావుల చంద్రశేఖర్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం వారి పెళ్లి రోజున పురస్కరించుకొని అన్న ఎన్టీఆర్ విగ్రహాన్ని సితార వెంకటేశ్వర్లు అందించడం జరిగింది. జయంతి సందర్భాన ఆ విగ్రహానికి పూలమాలలు వేసి అభిమానులు, పార్టీ కార్యకర్తలు జయంతిని కేక్ కట్ చేసి ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు , నందమూరి అభిమానులు, వివిధ పార్టీల నాయకులు, రాజశేఖర్ , గోల్డ్ బాలస్వామి, వాకిట బాలరాజు, ఎల్లగౌడ్ , మాధవరెడ్డి, సంతోష్ , సుధాకర్ , టక్కు రాములు, శ్రీహరి, హేమవర్ధన్ , ఈశ్వరయ్య, విశ్వనాథ్ , రమేష్ పాల్గొన్నారు.



## మండల టెక్నికల్ అసిస్టెంట్‌లకు, గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్‌లకు శిక్షణ

**ప్రజాపక్షం / మానవపాడు :** జోగులాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలం మంగళవారం అమరవయి గ్రామములో ఉపాధి పనులు , గ్రామ పంచాయితీ రికార్డులను తనిఖీ చేయనైనది ఉపాధి కూలీలకు రోజుకు 300 రూపాయలు పడడానికి కొలతల ప్రకారం పనులు చేయుటకు తెలియచేయ నైనది. పంచాయితీ కార్యదర్శులకు, టీఏలు, ఎఫ్ఎలకు ఉపాధి హామీ పనులు పైన మీటింగ్ ఏర్పాటు చేయ నైనది ఇట్టి మీటింగ్ లో ఉపాధి కూలీ లేబర్ కు రోజు కూలీ ఎక్కువ రావడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. నర్సరీలలో జెర్మినేషన్ వంద శాతం విధముగా చర్యలు తీసుకోవాలని జరిగింది. ఇట్టి కార్యక్రమానికి ఎపిఓ హాజరు కావడం జరిగింది.

## రామలింగేశ్వర దేవాలయంలో పూజలు



**ప్రజాపక్షం / బాలానగర్ :** బాలానగర్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు, చింతకుంట రాజు నాయక్ రాజేశ్వరి దంపతుల వివాహ వార్షికొత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఈ మేరకు షాద్నగర్ సమీపంలోకి శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఆలయంలో పలుపురికి తన వంతు పహాయ సహకారాలు అందించడం జరిగిందని తెలిపారు. తమ వివాహ వార్షికొత్సవ వేడుకల సందర్భంగా పలుపురు నాయకులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అభిమానులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలపడం జరిగిందన్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా తనకు విషెస్ తెలపడం జరిగిందని, తన క్షేమం కోరే ప్రతి ఒక్కరికి రాజు నాయక్ దంపతులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



## జడ్చర్ల ఆటో యూనియన్ ప్రెసిడెంట్‌గా షేక్ హజీ

మండల అధ్యక్షుడిగా డి శ్రీనివాసులు

**ప్రజాపక్షం / జడ్చర్ల :** మంగళవారం జడ్చర్ల ఆటో యూనియన్ తరపున జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా షేక్ హజీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా హజి మాట్లాడుతూ ఆటో యూనియన్ తరపున నన్ను మరో సారి ఎన్నుకున్నందుకు నాకు చాలా ఆనందకరంగా ఉందని తెలిపారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీఐ ఆదిరెడ్డి జక్కా చంద్రమోహన్ బీసీ సంఘం రాష్ట్ర నేత కార్యక్రమంలో పాల్గొన్నారు. సూచనల మేరకు ఆటో యూనియన్ కట్టుబడి ఉండాలని పాటించాలని అవగాహన సదస్సు సూచనలు తెలియజేశారు. హామీ నీ సిఐ , బీసీ రాష్ట్ర నేత చంద్ర మోహన్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ సభ్యులు వెంకటయ్య, రాములు తదితరులు ఆటో యూనియన్ 200 సభ్యులు పాల్గొన్నారు.

## 48 గంటలు మోదీ ధ్యానం

**న్యూఢిల్లీ :** ప్రతి లోక్‌సభ ఎన్నికల తుది విడత పోలింగ్ సమయానికి ఏదైనా ఆధ్యాత్మిక క్షేత్రంలో ధ్యానం చేసే ట్రెండ్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కంటిన్యూ చేస్తున్నారు. ఈసారి ఆయన తమిళనాడులోని కన్యాకుమారిలో ఉన్న స్వామి వివేకానంద రాక్ మెమోరియల్‌లో ధ్యానం చేయబోతున్నారు. అలనాడు స్వామి వివేకానంద ధ్యానం చేసిన ధ్యాన మండపంలో మే 30వ తేదీన సాయంత్రం నుంచి జూన్ 1వ తేదీన సాయంత్రం వరకు మోదీ మెడిటేషన్ చేయనున్నారు. దాదాపు రెండు రోజుల పాటు ప్రధానమంత్రి ధ్యాన మండపంలోనే మెడిటేషన్ చేస్తూ గడపనున్నారు. పార్వతీదేవి గౌతమ బుద్ధుడు వివేకానందుడు భగవాన్ శివుని కోసం ఎదురుచూస్తూ పార్వతీ దేవి ఒకే పాదంపై కన్యాకుమారిలో ధ్యానం చేశారని పురాణాలు చెబుతున్నాయి. గౌతమ బుద్ధుని జీవితంలో సారనాథ్ స్థూపానికి ఎంతటి ప్రాధాన్యత ఉందో, స్వామి వివేకానందుడి జీవితంలో కన్యాకుమారి రాక్ మెమోరియల్‌కు అంతటి ప్రాధాన్యం ఉంది. ఇక్కడ ధ్యానం చేసిన తర్వాతే స్వామి వివేకానందుడికి తన కర్తవ్యం బోధపడిందని చెబుతారు. భారత దేశ నిర్మాణం కోసం ఏం చేయాలనేది అక్కడే ఆయన నిర్ణయించుకున్నారని అంటారు. అందుకే ఈసారి మెడిటేషన్ చేయడానికి స్వామి వివేకానంద రాక్ మెమోరియల్‌ను ప్రధాని మోదీ ఎంపిక చేసుకున్నారని తెలుస్తోంది. కన్యాకుమారికి మన దేశంలో ప్రత్యేక స్థానం ఉంది. ఇది భారతదేశపు దక్షిణపు కొన. మన దేశంలోని తూర్పు, పశ్చిమ సముద్ర తీర ప్రాంతాలు కలిసే ప్రదేశం కన్యాకుమారి. హిందూ మహాసముద్రం, బంగాళాఖాతం, అరేబియా సముద్రం జలాలు కన్యాకుమారి వద్ద సంగమిస్తాయి.





## బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** మండలపరిధిలోని పంజుగుల గ్రామానికిచెందిన పాలెపు రాములు గతకొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఉప్పలచారిటబుల్‌ట్రస్టుచైర్మన్, మిషన్‌భగీరథ మాజీవైస్‌చైర్మన్, బిఆర్‌ఎస్‌పార్టీ రాష్ట్ర నాయకులు ఉప్పలవెంకటేష్ పాలెపురాములు భార్య లక్ష్మ మ్మకు దారమోని గణేష్‌ద్వారా రూ.3వేల ఆర్థికసాయంతో పాటు వారి కుటుంబానికి అన్నిరకాలుగా అండగా ఉంటామని తెలియజేశారు. కార్యక్రమంలో బిఆర్‌ఎస్వి కల్వకుర్తి అధ్యక్షుడు దారమోనిగణేష్, కొత్త బాలయ్య, ప్రభాకర్, రాజేష్, శ్రీకాంత్, రాజు పాల్గొన్నారు.

## నేడు సంగీత నృత్యశిక్షణ శిబిరం ముగింపు ఉత్సవాలు

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** స్వర్ణభారతి కళానిలయం కల్వకుర్తి 17వవార్షికోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం స్థానిక సికెఆర్‌గార్డెన్‌లో సాయంత్రం 5గంటలకు వేసవినృత్యశిక్షణ శిబిరం ముగింపు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు స్వర్ణభారతి కళానిలయం నిర్వాహకులుశ్రీనారోజుమోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 35రోజులపాటు సంస్థలో చిన్నారులు కూచిపూడి, జానపద, పాశ్చాత్యనృత్యాలు, లలిత, జానపదసంగీతం, వివిధ సంగీత వాయిద్యాల్లో శిక్షణపొందివారు నేర్చుకున్నటువంటి కళారూపాలను కార్యక్రమంలో ప్రదర్శిస్తారు. పద్మశ్రీపురస్కారగ్రహీత దాసరికొండప్పను సంస్థతరపున సన్మానించనున్నట్లు తెలిపారు. 2023రాష్ట్రస్థాయి సేవారత్న పురస్కారాలను వివిధ కళారంగాల్లో విశేషకృషిచేసినవారికి అందజేయనున్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంఎల్ఏ కసిరెడ్డినారాయణరెడ్డి, నాగర్‌కర్నూల్ జడ్పిచైర్‌పర్సన్ బాలాజిసింగ్‌ఠాగూర్, మున్సిపల్‌చైర్మన్ ఎడ్మ సత్యం, ప్రముఖసినిడబ్బింగ్ కళాకారులు ఆర్‌సిఎంరాజు, సిజిఆర్‌చైర్మన్ కొర్పొలు లక్ష్మారెడ్డి, సిజిఆర్ ప్రెసిడెంట్ కొర్పొలు లీలలక్ష్మారెడ్డి, వందేమాతరం ఫౌండేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎడ్మమాధవరెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. సుమారు 200లమంది చిన్నారులు కార్యక్రమంలో నృత్యప్రదర్శనలను కళారూపాలను ప్రదర్శిస్తారని తెలిపారు. కావున ప్రేక్షకులు అధికసంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని దిగ్విజయంచేయాలని కోరారు.



## గ్రామీణ యువకులు క్రీడల్లో రాణించాలి

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** గ్రామీణస్థాయి యువకులు క్రీడల్లో రాణించాలని ఐక్యతఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్‌మెంబర్ సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి అన్నారు. పట్టణంలో గతమూడురోజులనుండి కల్వకుర్తి ప్రీమియర్‌లీగ్3 క్రికెట్ పోటిలను నిర్వహిస్తున్నారు. క్రికెట్‌పోటిల ప్రాంగణాన్ని సందర్శించిన ఆయన మాట్లాడుతూ కెపిఎల్3 క్రికెట్‌పోటిలలో ఐక్యతఫౌండేషన్‌తరపున బహుమతులను అందజేశారు. క్రీడల్లోరాణించి గెలుపోటములను సమానంగా స్వీకరించాలని అన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రవి కాంత్‌గౌడ్, తాలుకా అధ్యక్షులు అనిల్‌గౌడ్, మండలాల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బాలరాజు, రాజశేఖర్, దళపతిగౌడ్, సీనియర్ నాయకులు శ్రీరాములు, నరేందర్, యూసుఫ్, బాబా, హుస్సేన్, గణేష్, నిర్వాహకులు జహీర్, శ్రీకాంత్‌శర్మ పాల్గొన్నారు.

## ఇంటర్‌ప్రశ్నపత్రాల వాల్యుయేషన్ తప్పులపై విచారణ జరిపించాలి



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** ఇంటర్మీడియట్‌బోర్డు వాల్యుయేషన్ తప్పులపై వెంటనే విచారణ జరిపించాలని ఎఐఎస్‌ఎఫ్ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి ప్రేమ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఇంటర్‌ప్రశ్నాపత్రాలు వాల్యుయేషన్‌చేసినవారి అలసత్వం వలన తప్పులుగా ప్రశ్నాపత్రాలుదిద్దడంవలన వేలాదిమంది విద్యార్థులకు నష్టంవాటిల్లిందని అన్నారు. మెరిట్‌స్టూడెంట్ విద్యార్థికి మొదటిసంవత్సరంలో వచ్చిన మార్కులు, రెండో సంవత్సరంలో వచ్చినమార్కులుచూస్తే చాలా విచిత్రంగా ఉందన్నారు. రీకౌంటింగ్‌తో పేపర్లు తెప్పించుకొని చూస్తే పేపర్‌వాల్యుయేషన్ చేసినవారి తప్పులు బయటపడ్డాయని పేపర్ వాల్యుయేషన్‌లో ఇష్టానుసారంగా పేపర్లుదిద్దారని వచ్చినమార్కులు ఒకటైతే ఆన్‌లైన్‌లో ఇంకోరకంగా మార్కులువేసి విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడినవారిని గుర్తించి వారిపై కఠినచర్యలు తీసుకోవాలని అన్నారు. ఇప్పటికైన విద్యార్థులందరికి వెంటనే ఇంటర్‌బోర్డు న్యాయంచేయలేని పక్షంలో ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్‌బోర్డు ముట్టడిస్తామని హెచ్చరించారు.

## అమరవీరుల స్థూపానికి రంగువేయండి

**ప్రజాపక్షం/అచ్చంపేట :** పట్టణంలోని బస్టాండులో ఉన్న అమరవీరుల స్థూపానికి రంగువేయాలని మున్సిపల్ కమీషనర్ శ్యాంసుందర్‌కు తెలంగాణ ఉద్యమకారులు మంగళవారం వినపత్రం అందజేశారు. ఈసందర్భంగా కాశన్నయాదవ్, మహబూబ్‌అలీ మాట్లాడుతూ తెలంగాణకోసం ఆత్మబలిదానం చేసుకున్నవారిగుర్తుగా అమరవీరులస్థూపం నిర్మించారని అన్నారు. ఈస్థూపానికి రంగువేయడంతోపాటు నిరంతరం విద్యుత్‌లైట్లు వెలిగేలా ఏర్పాటుచేయాలన్నారు. ప్రతి సంవత్సరం తెలంగాణ ఆవిర్భావదినోత్సవం సందర్భంగా అమరవీరుల స్థూపంవద్ద అధికారికంగా శ్రద్ధాంజలిఘటిస్తూ పోలీసుకవాతు చేయాలని కోరారు.



## బొడ్రాయి పండుగకు బోనమెత్తిన బంగ్లా స్వాతి లక్ష్మీ కాంత్ రెడ్డి

**ప్రజాపక్షం/నర్వ :** తెలుగు సాంప్రదాయం ఉట్టిపడే విధంగా మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండల కేంద్రంలో గత మూడు రోజులుగా జరుగుతున్న బొడ్రాయి పండుగ ఉత్సవాల్లో తెలుగు సాంప్రదాయం ప్రకారంగా మూడవ రోజు జరిగే బోనాల పండుగలో భాగంగా నర్వ మాజీ సర్పంచు , నర్వ ప్రస్తుత పిఏసిఎస్ డైరెక్టర్ బంగ్లా లక్ష్మీ కాంత్ రెడ్డి మిడ్జిల్ గ్రామ ఆడపడుచుగా, మిడ్జిల్ గ్రామంలో ఇంటి ఆడపడుచులు సాంప్రదాయ ప్రకారంగా జరుపుకునే బోనాల పండుగలో భాగంగా ఉత్సవాల్లో పాల్గొన్న బంగ్లా స్వాతి లక్ష్మీ కాంత్ రెడ్డి బోనమెత్తి, బొడ్రాయి చుట్టూ తిరిగి గ్రామ నడి బొడ్డున ఉన్న ఈదమ్మ అమ్మవారి గుడి దగ్గరకు వచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించి, మొక్కులు కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బంగ్లా లక్ష్మీ కాంగ్ రెడ్డి, మిడ్జిల్ పిఏసిఎస్ చైర్మన్ కూచూర్ శ్రీనివాస్ రెడ్డి, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఐఐటి, నీట్ కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** విద్యార్థులు ఐఐటి, నీట్ ఆన్‌లైన్ ఉచిత కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని జటాధరా ఎడ్యుకేషనల్ టెక్నాలజి సంస్థ డైరక్టర్ రంగారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన శామీర్‌పేటలో మాట్లాడుతూ సూపర్ 20స్కాలర్ షిప్ జటాధరా ఎడ్యుకేషనల్ టెక్నాలజి సంస్థ ఆధ్వర్యంలో 2024–25 ఇంటర్ మొదటి సంవత్సరం చదివే 20 మంది విద్యార్థులకు ఆన్‌లైన్‌లో సూపర్ 20 స్కాలర్‌షిప్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మొదటి 20 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 1.20 లక్షల విలువ గల ఐఐటి, నీట్ ఆన్‌లైన్ కోచింగ్ ప్యాకేజి ఉచితంగా ఇవ్వనున్నట్లు చెప్పారు. వీరు ఇంటర్మీడియట్ రాష్ట్రంలో ఎక్కడ చదివినా ఈ కోచింగ్ పొందవచ్చన్నారు. ఆసక్తి గత అభ్యర్థులు ఈ పరీక్షకు రూ.100చెల్లించిరిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుదనిచెప్పారు. ఏలాంటి సందేహాలు ఉన్నపూర్తివివరాలకు 7337285228, 9642215227కుsuperమెసెజ్ చేయవచ్చని చెప్పారు.

## నకిలీ విత్తనాలపై అవగాహన

**ప్రజాపక్షం/దౌల్తాబాద్/కొడంగల్ :** కొడంగల్ నియోజకవర్గంలోని దౌల్తాబాద్ మండలంలోని మాటూర్ గ్రామంలో నకిలీ విత్తనాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించిన మండల వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీపతిరెడ్డి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడ తూ.. రైతులు అధీకృత డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని రైతులకు సూచించారు. రైతులు పంట పూర్తియ్యేవరకు బిల్లును తమ వద్ద ఉంచుకోవాలని సరైన లేబులింగ్ లేకుండా



విత్తనాలు కొనుగోలు చేయవద్దు అని రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

## సర్కారు భూములు కొల్లగొట్టే కబ్జాదారులపై పిడి యాక్ట్ నమోదు చేస్తాం

కాప్రా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీలక్ష్మి



**ప్రజాపక్షం/ జవహర్‌నగర్:** సర్కారు భూములు కొల్లగొట్టే కబ్జాదారులను వదిలిపెట్టబోమని పిడియాక్ట్ కేసులు నమోదు చేస్తామని కాప్రా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీలక్ష్మి హెచ్చరించారు. కాప్రా తహసీల్దార్ సుచరిత ఆదేశాల మేరకు జవహర్‌నగర్‌లోని ప్రభుత్వ భూముల్లో అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను మంగళవారం రెవెన్యూ సిబ్బందితో కలిసి కూల్చివేశారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ భూముల్లో పేపర్‌లపై అక్రమ లేవుట్‌లు వేస్తూ అమాయక పేద ప్రజలకు అమ్ముతూ మోసం చేస్తున్న వారిని వదిలేది లేదని అన్నారు. కార్పొరేషన్‌లోని భూముల్లో ఎలాంటి అక్రమ నిర్మాణం చేసిన నేలమట్టం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## రేణుకా ఎల్లమ్మ జాతరలో శంభీపూర్ క్రిష్ణ



**ప్రజాపక్షం/దుండిగల్ :** నర్సాపూర్ నియోజకవర్గం నాసంపల్లి గ్రామంలో ఏక్స్‌సర్పంచ్ అల్మయిపేట్ ఎల్లమయ్య ఏర్పాటు చేసిన శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి వారి కళ్యాణం మరియు జాతరలో పాల్గొన్న కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత, కౌన్సిలర్ శంభీపూర్ క్రిష్ణ ఈ సందర్భంగా ఆలయంలో ప్రతేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎక్స్ సర్పంచ్ శామీర్ పేట్ నర్సింగ్ రావు, మునిసిపల్ వైస్ ప్రెసడెంట్ శామీర్ పేట రంగయ్య, నాయకులు అల్మాయిపేట్ లింగం, మునురాయి మల్లేష్, యాదయ్య, ఉప్పరి బాలకృష్ణ, శామీర్ పేట్ ప్రకాష్, విశ్వేశ్వర్ రావు, మరియు గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**ప్రజాపక్షం/ఫేట్ బషీరాబాద్:** 2905 2024 బుధవారం దూలపల్లి సబ్‌స్టేషన్‌లో చెట్ల కొమ్మలను ట్రీమింగ్ చేయడం, పడిపోతున్న ఫీడర్‌ల నిర్వహణ కోసం ఈ క్రింది ప్రాంతాలలో విద్యుత్ ఆపివేయటం జరుగుతుంది. 11 కె వి గంగాస్థాన్ ఫీడర్ ఉ:11:00 నుండి మధ్యాహ్నం 12:30 వరకు గంగాస్థాన్, ప్రధాన రహదారి, ఎన్టీఆర్ విగ్రహం వరకు విద్యుత్ కు అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖకు సహకరించగలరని ఏఈ తెలిపారు.

## ఇంటర్మీడియట్ ప్రవేశాలకు దరఖాస్తులు

**ప్రజాపక్షం/శామీర్‌పేట :**మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకులాల్లో 2024–25 విద్యా సంవత్సరానికి గాను మొదటి ఇంటర్ మీడియట్ సీ ట్ల భర్తీకి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఆహ్వానిస్తున్నామని శామీర్‌పేట సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ మసిరెడ్డి మల్లారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన శా మీర్‌పేటలోని గురుకుల కళాశాలలో విలేకరులతో మాట్లాడుతూ పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ నెల 30వ తేది వరకు గురుకుల సోసైటి వెబ్‌సైట్‌లో ధరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఎంపిసి, బైపిసి, సిఈసి, హెచ్‌ఈసిలలో ఖాళీలు ఉన్నట్లు చెప్పారు. దరఖాస్తు రుసుం 100 చెల్లించాలని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

## మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

**ప్రజాపక్షం/మర్పల్లి :** వికారాబాద్ నియోజకవర్గంలోని మర్పల్లి మండల పరిధిలోని కల్‌కూడా గ్రామంలో ఉప్పరి నర్సింలు మృతి చెందారు. గుండ్ల మర్పల్లి గ్రామనికి చెందిన పిచ్చకుంట్ల బిచ్చమ్మ మరణించారు . వారి అంత్యక్రియలకు ఎస్‌కెఆర్ చైర్మన్ మాజీ గ్రంథాలయ చైర్మన్ సనగారి కొండల్‌రెడ్డి రూ.5వేల అర్థిక సహాయం అందజేశారు. స్థానిక నాయకులు మృతుని కుటుంబాలని మరమర్శించి నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రేమ వేధింపులు తట్టుకోలేక వ్యక్తిపై ఫిర్యాదు

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ప్రేమించమని వెంటపడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసిన సంఘటనశామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. శామీర్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ డిపార్ట్‌మెంట్‌లోలో జూనియర్ అసిస్టెంట్‌గా అజయ్ అనే వ్యక్తి విధులు నిర్వహిస్తున్నాడు. జిల్లా కార్యాలయంలో మరోక విభాగంలో పనిచేయు మహిళా జూనియర్ అసిస్టెంట్‌తో గత కొంత కాలంగా ప్రేమించమని వెంటపడుతూ వేదిస్తున్నాడు. ఈ క్రమంలో అజయ్ వేదింపులకు తాళలేక తేది 25052024 రోజున బాధితురాలు శామీర్‌పేట పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించింది. అజయ్‌పై రాతపూర్వకంగా పిర్యాదు చేసింది. ఈ మేరకు శామీర్‌పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## అప్పల బాధ భరించలేక వ్యక్తి ఆత్మహత్య



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** అప్పుల భాద భరించలేక వ్యక్తి ఊరేసుకుని మృతిచెందిన సంఘటన తుర్కపల్లి జినోమ్‌వ్యాలీ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శామీర్‌పేట మండలం తుర్కపల్లి గ్రామానికి చెందిన రుద్రబోయిన మహేందర్(35) అనే వ్యక్తి అదే గ్రామంలో ఓ వ్యక్తి వద్ద 2023లో రూ. 6 లక్షలు అ౧ప్పుగా తీసుకున్నాడు. అందులో 4.70 లక్షలు చెల్లించగా మిగతా డబ్బులు కూడ కట్టాలని వేదింపులకు గురిచేశాడు. ఈ క్రమంలో మహేందర్ తన స్క్రాప్‌షాపులో దూలానికి నైలాన్ తాడుతో ఊరేసుకుని మృతి చెందాడు. బాధితుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

# కౌంటింగ్‌కు సిద్ధం

వీడియో కాన్ఫరెన్స్‌లో మల్కాజిగిరి ఎన్నికల రిటర్నింగ్ అధికారి గౌతం




**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** ఇటీవల జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా జూన్ 4న చేపట్టనున్న ఓట్ల లెక్కింపు కార్యక్రమం సంబంధించి పలు సూచనలను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ మంగళవారం తెలంగాణా జిల్లా ఎన్నికల అధికారులు, రిటర్నింగ్ అధికారులతో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో తెలియచేశారు. మేడ్చల్ జిల్లా ఎన్నికల అధికారి గౌతం, అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డిఆర్డీఓ హరిప్రియ, ఇతర అధికారులతో కల్సి ఈ కాన్ఫరెన్స్‌లో పాల్గొని ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు తాము అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కౌంటింగ్ సజావుగా జరిగేందుకు కౌంటింగ్ కేంద్రాల వద్ద అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించటం, కేంద్రాల లోపల సమీప ప్రాంతాల్లో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు ఉండేలా చూడాలని ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ సూచించారు. కౌంటింగ్ కేంద్రాల లోపలికి అనుమతి ఉండి అధికారులు జారీచేసిన గుర్తింపుకార్డులు కల్గి ఉన్న వారిని మాత్రమే అనుమతించాలని, కౌం టింగ్ సిబ్బంది, కౌంటింగ్ ఏజంట్లు ఎట్టిపరిస్థితుల్లోనూ లోపలికి మొబైల్ ఫోన్లతో పాటు ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించవద్దన్నారు. జూన్ 4న ఉ: 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రారంభం చేసిన తర్వాత ఈవిఎం యంత్రాల ఓట్లలెక్కింపుచేపట్టాలన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు సకాలంలో కౌం టింగ్ పూర్తయ్యేలా చూడాలని, ప్రతి అసెంబ్లీసెగ్మెంట్ వారీగా కౌంటింగ్ హాలులో నిర్దేశిత రౌం డ్ల వారీగా కౌంటింగ్ ప్రక్రియను కట్టు దిట్టంగా పూర్తి చేయాలని, ప్రతి రౌండ్ కౌంటింగ్ ముగిసిన తర్వాత సంబంధిత కౌంటింగ్ వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూ చించారు. కౌంటింగ్ కేంద్రాల్లో హైస్పీడ్ ఉన్న ఇం టర్‌నెట్ సౌకర్యంతో పాటు విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయంలేకుండా చూసుకోవాలన్నారు.

## ఎన్నికల కౌంటింగ్ నిర్వహణలో జాగ్రత్తగా పనిచేయాలి

జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ కలెక్టర్ కార్యాలయంలో పూపర్వైజర్లు, కౌటింగ్ అసిస్టెంట్, కౌంటింగ్, సూపర్వైజర్‌లు కౌటింగ్ రోజున చేపట్టే విదివిధానాపై శిక్షణ కార్యక్రమం అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులతో కలిసి జిల్లా ఎన్నికల అధికారి సి నారాయాణరెడ్డి పాల్గొని మాట్లాడుతూ కౌటింగ్ ప్రక్రియల ఎన్నికల నిబంధన ప్రకారం వ్యవహరించాలని ఏ చిన్న పొరపాటు జరగకుండా మైక్రో అబ్జర్వర్‌లు, కౌటింగ్ సూపర్వైజర్ విధులు నిర్వహించాలని సూచించారు. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారుల ఆధ్వర్యంలో కౌంటింగ్ ప్రక్రియ టీం వారిగా చేయాల్సి ఉంటుందని, ఆర్ఒల దగ్గర ఆర్డర్ కాఫీ , ఐడి కార్డు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ ఆర్డిఓ వాసుచంద్ర, శ్రీనివాస్ ,రాంరెడ్డి వీరకాంతం ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

## పోలీసు అధికారి కుటుంబానికి ఆర్థిక సాయం



**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** ప్రమాద వశాత్తు మృతి చెందిన పోలీసు అధికారి కుటుంబానికి ఆర్థిక సాయంగా భద్రతా చెక్కును రాచకొండ పోలీస్ కమిషనర్ తరుణ్‌జోషి అందించారు. కమిషనరేట్ పరిధిలో ఎఆర్ఎస్ఐగా విధు లు నిర్వహించే ఫైజల్ అలీ గత ఏడాది నవంబరు నెలలో ప్రమాదవశాత్తు మృతి చెందాడు. శాఖాపరంగా అతడికి సంబంధించిన రూ.ఏడు లక్షల 90 వేల భద్రతా చెక్కును కమిషనర్ కార్యాలయంలో పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు భద్రారెడ్డి సమక్షంలో మృతుడి భార్యకు అందించారు.

## విత్తనాల కొనుగోలుపై రైతులకు అవగాహన

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** విత్తనాల కొనుగోలుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని శామీర్‌పేట మండల వ్యవసాయాధికారి రమేష్ అన్నారు. మంగళవారం శామీర్‌పేట మండలం అలియాబాద్, బాబాగూడలో రైతులకు విత్తనాల కొనుగోలుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లూజుగా ఉన్న సంచుల్లోని విత్తనాలను కొనుగోలు చేయకూడదని చెప్పారు. రైతులు విత్తనాలను కొనుగోలు చేసినప్పుడు రసీదును తప్పకుండా తీసుకోవాలన్నారు. రసీదును విత్తన ప్యాకెట్‌ను పంటకాలం పూర్తయ్యేవరకు భద్రపరుచుకోవాలి. వ్యవసాయ శాఖ ద్వార లైసెన్స్ పొందిన ఆధీకృత డీలర్ల దగ్గర మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలని, గడువు మీరిన విత్తనాలను కొనుగోలు చేయరాదని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజి సర్పంచ్ గుర్క కుమార్‌యాదవ్, మాజి ఉపసర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, ఏఈవో రవియాదవ్, రైతులు, డైరక్టర్‌లు పాల్గొన్నారు.

**మూడుచింతలపల్లిలో..**

మండలంలోని మూడుచింతలపల్లి, లింగాపూర్‌తాండ గ్రామాల్లోని రైతులకు



మండల వ్యవసాయాధికారి కృష్ణవేణి మంగళవారం విత్తన కొనుగోలుపై రైతులకు అవగాహన కల్పించారు. ఇందులో రైతులు వేణుగోపాల్‌రావు, నారాయణరెడ్డి, సదారెడ్డి, యాదిరెడ్డి, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## అందరి సహకారంతో ఎంసిపల్లి అభివృద్ధి

ఎంపిపి హారికమురళీగౌడ్

**ప్రజాపక్షం/ శామీర్‌పేట :** నూతనంగా ఏర్పాటైన మూడుచింతలపల్లి మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరుచుటకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నానని మూడుచింతలపల్లి మండల ఎంపిపి హారిక మురళిగౌడ్ అన్నారు. మంగళవారం మూడుచింతలపల్లి మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి హారికమురళిగౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పలు శాఖలకు చెందిన అధికారులు సభలో ఎంపిటిసిలు ప్రస్తావించిన సమస్యలకు సమాధానమిచ్చారు. లక్ష్మాపూర్‌లో రైతులకు పట్టాదార్ పాసుపుస్తకాలు రావడం లేదని, దీంతో రైతులు రైతుబంధు, రైతుభరోసా పథకాలకు అర్హులు కావడం లేదని ఎంపిటిసి పొరుపల్లి నాగరాజు తహసీల్దార్ వెంకటనర్సింహారెడ్డి దృష్టికి తీసుకవచ్చారు. ఎజెండాలో లేని అంశాలపై తాను సమాదానం చెప్పలేనని తహసీల్దార్ వెంకటనర్సింహారెడ్డి స్పష్టం చేశారు. గతంలో పలుమార్లు సర్వసభ్య సమావేశాల్లో రైతులకు సంబందించిన అంశాలను మాట్లాడంటం జరిగిందని దీంతో కొంత మంది రైతులకు న్యాయం జరిగిందని ఎంపిటిసి నాగరాజు అన్నారు. రైతుల సమస్యలపై సభలో మాట్లాడటం తప్పా అని ప్రశ్నించారు. విద్యుత్ సరఫరాపై ఎఈ శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం కంటే ఎక్కువ గంటలు కరెంట్ సరఫరా చేస్తున్నామని తెలిపారు. విద్యుత్ అంతారాయానికి తమ సిబ్బంది కానీ తాము కానీ ఏలాంటి ఎలసి తీసుకోవడం లేదని చెప్పారు. అమ్మఆదర్శ పాఠశాలకు మంజూరైన




నిధులతో అభివృద్ధి పనులు చేస్తున్నామని పిఆర్ ఎఈ శ్రీను తెలిపారు. మిషన్ భగీరథ పథకం ద్వార మండలంలోని పలు గ్రామాలకు నీరు సరిగా రావడం లేదని కార్యదర్శులు సభ దృష్టికి తెచ్చారు. ఉపాధిహామీ పథకం ద్వార మంజూరైన పనులపై రైతులకు అవగాహన కల్పించాలని కేశవరం ఎంపిటిసి హన్మంతరెడ్డి సభలో అధికారుల దృష్టికి తెచ్చారు. మూడుచింతలపల్లిలో కల్వర్టులపై భవనాల నిర్మాణం చేపడుతున్నారని ఎంపిటిసి నాగరాజు ఇర్రిగేషన్ అధికారి ఎఈ స్వప్న దృష్టికి తీసుకవచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో వత్సలాదేవి, వైస్ ఎంపిపి మంద శ్రీనివాస్‌రెడ్డి, తహశీల్దార్ వెంకటనర్సింహారెడ్డి, కార్యదర్శులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

## కామ్రేడ్ లింగాచారి మరణం బాధాకరం

సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్



**ప్రజాపక్షం/జగద్గిరిగుట్ట:** జగద్గిరిగుట్ట డివిజన్ అంజయ్య నగర్ నివాసి లింగచారి అనారోగ్యంతో సోమవారం సాయంత్రం ఉస్మానియా ఆసుపత్రిలో మరణించారు. అనంతరం మంగళవారం లింగచారి మృతదేహానికి సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉమామహేష్ మాట్లాడుతూ, లింగాచారి కి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారని అందులో ఒక్కరి పెండ్లి మాత్రమే జరిగిందని చాలని జీతాలతో బతుకుతున్నారని అలాంటి లింగచారి సీపీఐ పార్టీ మీద ఉన్న ప్రేమతో అనేక సమస్యల పైన సీపీఐ జండా పట్టుకొని పోరాటం చేసిన మానవతా వాదీ అని అలాంటి కామ్రేడ్ను కోల్పోవడం బాధాకరమని వారి కుటుంబానికి, పార్టీకి తీరని లోటని అన్నారు. వారికి నివాళులు అర్పించిన వారిలో సిపిఐ కార్యవర్గ సభ్యుల హరినాథ్ రావ్, శాఖ కార్యదర్శి వెంకటేష్, మునిసిపల్ అధ్యక్షుడు రాములు,స్థానిక నాయకులు చంద్రయ్య, జర్నలిస్ట్ దప్పు రామస్వామి, ప్రవీణ్ లు నివాళులర్పించారు.

# ఘనంగా ఎన్‌టిఆర్ జయంతి




నిజాంపేట్‌లో



జగద్గిరిగుటలో



కూకట్‌పల్లిలో



చర్లపల్లిలో



ఎఎస్‌రావు నగర్‌లో

**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** తెలుగు జాతి గొప్పతనాన్ని ప్రపంచ దేశాలకు చాటిచెప్పిన మహనీయుడు స్వర్గీయ ఎన్‌టి రామారావు అని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి కొలను నర్సింహా రెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్‌టి రామారావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర టిడిపి కార్యదర్శి కొలను నర్సింహా రెడ్డి నిజాంపేట్ హనుమాన్ ఆలయ చౌరస్తాలో ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అల్పాహారం, మజ్జిగను పంపిణీ చేశారు. ప్రగతి నగర్ చౌరస్తాలో ఎన్‌టిఆర్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్పొరేటర్ రవి కిరన్, బిజెపి నేతలు సతీశ్, టిడిపి నాయకులు, యువకులు పాల్గొన్నారు.

**జగద్గిరిగుట్ట:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం రంగా రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్వర్గీయ నందమూరి తారక రామారావు 101వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పులామాలలు వేసి నివాళులు అర్పించిన కార్పొరేటర్ బి.విజయ్ శేఖర్ గౌడ్ ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, తారక రామారావు ప్రజలకు రాజకీయాలకు మునుపు రాజకీయాలలో క్రియాశీలక ప్రాత్రపోషించి ఎనలేని సేవలు అందించారన్నారు. కార్తీక్ గౌడ్ రెడ్డి, జగదీష్, అభిరామ్ గౌడ్, తేజ, రామారావుఅభిమానులు,కార్యకర్తలుతదితరులుపాల్గొన్నారు.

**కూకట్‌పల్లి :** తెలుగు జాతికి, తెలుగు నేలకు గొప్ప గుర్తింపును సాధించిపెట్టి నందమూరి తారకరామారావును తెలుగు జాతి ఎప్పటికీ మర్చిపోదని కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ అన్నారు. మంగళవారం తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, డాక్టర్ నందమూరి తారకరామారావు 101వ జయంతి పురస్కరించుకొని వసంత నగర్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద స్థానిక నాయకులు జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరై కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కెపిహెచ్ బి డివిజన్ కార్పొరేటర్ మండడి శ్రీనివాస్, అసోసియేషన్ ప్రతినిధులు నాగేశ్వర రావు, శివరామకృష్ణ, మధు, శివ చౌదరి, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**చర్లపల్లి:** తెలుగుదేశం వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు 101వ జయంతిని పురస్కరించుకుని చర్లపల్లి డివిజన్ పరిధిలోని కుషాయిగూడ బస్టాండ్‌లో ఎన్‌టిఆర్ చిత్ర పటానికి టిడిపి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు ఎన్‌టిఆర్ అని, తెలుగు ప్రజల ఆత్మ గౌరవం కోసం పుట్టిందే తెలుగుదేశం పార్టీ అని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి కాంటెస్టెడ్ కార్పొరేటర్ రుద్రగోని రాంచందర్‌గౌడ్,జిల్లా ఉపాధ్యక్షులు జి రాములు యాదవ్,సత్యం యాదవ్,కె ప్రేమ్ కుమర్‌గౌడ్,ఎన్ బాలకృష్ణగౌడ్,కె కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

**బృందవన్ కలనీలో:** ఎన్‌టిఆర్ 101వ జయంతిని పురస్కరించుకుని ఏఎస్‌రావు నగర్ డివిజన్ బృందవన్ కలనీలో కేక్ కట్ చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.గూడపాటి ఫౌండేషన్ చైర్మన్ శరత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టిడిపి జాతీయ అధికార ప్రతినిధి తిరునగరి జ్యోత్స్న హాజరై ప్రారంభించారు.ఈ సం దర్భంగా 1000 వెయ్యి మందికి అన్నదానం నిర్వహించిన గూడపాటి ఫౌండేషన్‌ను అభినందించారు.ఈ కార్యక్రమంలో తెలుగుయువత రాష్ట్ర నాయకులు సాయి నాగార్జున,హేమంత్‌గౌడ్,టిజికె మూర్తి,నాగేశ్వర్‌రావు,శ్రీనివాసు,రామ్మోహన్,శివ,విజయ్ తదితరులు పాల్గొన్నారు.

**ఎఎస్‌రావు నగర్:**రామారావు 101వ జయంతి సందర్భంగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి నీరుగొండ సతీష్‌బాబు ఆధ్వర్యంలో ఏఎస్‌రావు నగర్ డివిజన్ జమ్మిగడ్డలో ఎన్‌టిఆర్ విగ్రహానికి పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు పూలమాలలు వేసి నివాళులర్పించి కేక్ కట్ చేశారు.ఆదిలాబాద్,మల్కాజ్‌గిరి పార్లమెంటు అధ్యక్షులు ఆనంద్,కె అశోక్‌కుమార్‌గౌడ్,మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు జి రాములు యాదవ్, జిల్లా కార్యదర్శి రుద్రగోని రాంచందర్ గౌడ్,శ్రీరాములు,ఉపేందర్,ఎస్‌వి రావు, రామ్మోహన్,వెంకటేష్, పరంధామయ్య ,జంగారెడ్డి,ఉమాశంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

## రక్తదాన శిబిరం

**ప్రజాపక్షం/వికారాబాద్‌ప్రతినిధి :** వికారాబాద్ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన విబిరం నిర్వహించనున్నట్లు వికారాబాద్ ఎక్సైజ్ సిఐ రాఘవీణ ఒక ప్రకటనలో తెలిపారు. డిపిఈఓ ,వికారాబాద్ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నిర్వహించడం జరుగుతుందన్నారు. రక్తదానం చేసి ప్రాణదాలతను కాపాడాలని కోరారు. ఆసక్తి ఉన్నవారు ఈ కార్యక్రమంలో పాల్గోనాలని విజ్ఞప్తి చేశారు.

## రేణుకా ఎల్లమ్మ కల్యాణ మహోత్సవం



**ప్రజాపక్షం/శామీర్‌పేట:** మూడుచింతలపల్లి మండలం లక్ష్మాపూర్‌లో రేణుకా ఎల్లమ్మ కల్యాణ జాతర మహోత్సవం మంగళవారం కన్నుల పండవగా జరిగింది. ఉదయం నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు అమ్మవారికి తలంబ్రాలు సమర్పించి తమ మొక్కులను తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణంలో గౌడ సంఘం సభ్యులు హోమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కల్యాణంలో పాల్గొని భక్తులు అమ్మవారిని దర్శించుకుని తరించారు. అనంతరం సిహెచ్ శ్రీనివాస్ కేబుల్ ఏర్పాటు చేసిన అన్నదానంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## క్రీడ

# 55 మ్యాచ్‌లు, 20 జట్లు

### మరో ఐదు రోజుల్లో టి20 ప్రపంచ కప్




ఇండియన్ ప్రీమియర్ లీగ్ ముగిసింది. మరో ఐదు రోజుల్లో టి20 ప్రపంచ కప్ మొదలై క్రికెట్ అభిమానులకు కనువిందు చేయనుంది. 55 మ్యాచ్‌లు జరిగే ఈ ఈవెంట్‌లో 20 జట్లు తలపడనున్నాయి. తొలిసారి ప్రపంచకప్ ఆతిథ్యమిస్తున్న అమెరికా గడ్డపై 16 మ్యాచులు జరుగనున్నాయి. గ్రూప్‌ఏ మ్యాచ్‌లన్నింటికీ అమెరికానే ఆతిథ్యమివ్వనుండగా, నాకౌట్ మ్యాచ్‌లు మొత్తం వెస్టిండీస్‌లో జరుగనున్నాయి. అమెరికాలోని ఫ్లోరిడా, టెక్సాస్, న్యూయార్క్ స్టేడియాల్లో 9 వేదికల్లో మ్యాచులు జరుగుతుండగా, మిగిలినవి వెస్టిండీస్‌ ఆంటిగ్వా– బార్బుడా, బార్బడోస్, గయానా, సెయింట్ లూ సియా, సెయింట్ విన్సెంట్‌గ్రెనైడ్స్, ట్రినిడాడ్ అండ్ టొబాగో ఆతిథ్యమిస్తాయి. ఉదయం 5 గంటలు, 6 గంటలు, రాత్రి 8 గంటలు, రాత్రి 10:30, అర్ధ రాత్రి 12:30 ఇలా భిన్న సమయాల్లో మ్యాచ్ జరుగనుండగా భారత మ్యాచులు ఆరంభమయ్యేది మాత్రం రాత్రి 8గం టలకు మాత్రమే. టీమిండియా మ్యాచులు జూన్ 2 నుంచి ఆరంభం కానున్నాయి. టోర్నమెంట్ విధానం అయితే ఈ టోర్నమెంట్‌లో ఆడే 20 జట్లను నాలుగు గ్రూపులుగా విభజించారు. ఈ గ్రూపులోని ప్రతి జట్టు ఇంకో జట్టుతో ఆడా ల్సింది. అలా ఆడి టాప్ 2లో నిలిచిన నాలుగు గ్రూపుల్లోని జట్లన్నీ కలిపి సూపర్ 8గా మార తాయి. మళ్లీ వాటిని రెండు గ్రూపులుగా విభజించి మ్యాచులు నిర్వహిస్తారు. అక్కడ కూడా టాప్ 2లో నిలిచిన ఇరు జట్లలోని నాలుగు టీమ్‌లు కలిపి సెమీఫైనల్‌లో పోట్లాడుతాయి. మ్యాచ్‌కు ఆటంకం కలిగితే టై అయితే సూపర్ ఓవర్ ఆడిస్తారు. మళ్లీ టై అయితే ఫలితం తేలేవరకూ సూపర్ ఓవర్ జరు గుతూనే ఉంటుంది. అలా కాకుండా వర్షం వస్తే, కనీసం 5 ఓవర్ల మ్యాచ్ జరగాలి. అదీ కూడా సాధ్యం కాకపోతే మ్యాచ్ క్యాన్సిల్. సెమీ ఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లకు మాత్రం 10 ఓవర్ల మ్యాచ్ ఆడాల్సిందే. తొలి సెమీ ఫైనల్, ఫైనల్‌కోసం 190 నిమిషాల అదనపు సమయం, రిజర్వ్ డే ఉంది. సెకండ్ సెమీ ఫైనల్‌కు రిజర్వ్ డే లేకపోగా దానికి బదులుగా 250 నిమిషాల అదనపు సమయం కేటాయించారు. భారత్ నాకౌట్‌కు చేరితే సెకండ్ సెమీఫైనల్‌ను గయానాలో నిర్వహిస్తారు. టీమ్‌ఇం డియా షెడ్యూల్ జూన్ 5న న్యూయార్క్ వేదికగా ఐర్లాండ్‌తో, అదే వేదికగా జూన్ 9న పాకిస్తాన్‌తో, జూన్ 12న అమెరికాతో, జూన్ 15న కెనడాతో తలపడుతుంది. ఈ మ్యాచ్‌లు అన్నీ భారత కాల మాన ప్రకారం రాత్రి 8 గంటలకే జరుగుతాయి.

**ఏయే గ్రూపులో ఏయే జట్లు ఉన్నాయంటే..**

గ్రూప్ ఏ: భారత్, ఐర్లాండ్, కెనడా, పాకిస్తాన్, అమెరికా

గ్రూప్ బీ: ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, నమీబియా, ఒమన్, స్కాట్లాండ్

గ్రూప్ సీ: ఆఫ్ఘనిస్తాన్, న్యూజిలాండ్, పపువా న్యూ గినియా, ఉగాండా, వెస్టిండీస్

గ్రూప్ డీ: బంగ్లాదేశ్, నేపాల్, నెదర్లాండ్స్, దక్షిణాఫ్రికా, శ్రీలంక

## టీమ్ ఇండియా కోచ్‌గా ధోనీ?

### బిసిసిఐకి కోహ్లీ చిన్ననాటి కోచ్ ప్రపోజల్



టీమ్ ఇండియా కోచ్ పదవికి దరఖాస్తు చేసుకునే గడువు మే 27తో ముగిసింది. అయితే ఎవరెవరు అప్లై చేసుకున్నారనే అంశంపై బిసిసిఐ ఎలాంటి వివరాలు వెల్లడించలేదు. ఇటీవల బిసిసిఐ సెక్రెటరీ జై షా కూడా భారతీయ కోచ్ కోసం వెతుకుతున్నామంటూ వెల్లడించారు. అంతే కాకుండా ఆస్ట్రేలియా కోచ్‌లను సంప్రదించినట్లు వచ్చిన ఆరోపణలను కొట్టిపారేశారు. అయితే వివిఎస్ లక్ష్మణ్ ఆసక్తి చూపకపోవడం వల్ల, ఇక గంభీర్‌కే ఛాన్స్ ఉందని భావించారు. కానీ తాజాగా విరాట్ కోహ్లీ చిన్ననాటి కోచ్ రాజ్ కుమార్ శర్మ ఈ విషయంపై భిన్నాభిప్రాయం వ్యక్తం చేశారు. ఎంఎస్ ధోనీ పేరును సూచించారు. 'మొదట, ఈ పోస్టుకు ఎవరు దరఖాస్తు చేసుకున్నారో తెలుసుకోవాలని ఆసక్తిగా ఉంది. కోచ్‌గా ఎవరు వచ్చినా భారతీయుడై ఉండాలని నేను కోరుకుంటున్నాను. మహేంద్ర సింగ్ ధోని రిటైర్మెంట్ ప్రకటిస్తే, అతను గుడ్ ఆప్షన్ అవుతాడు. ధోని ఎక్కువ కాలం క్రికెట్ ఆడాడు, పెద్ద టోర్నమెంట్లను గెలుచుకున్నాడు' అంటూ రాజ్ కుమార్ తన అభిప్రాయాన్ని వెల్లడించారు.

**రేసులో మోదీ, అమిత్ షా!**

బిసిసిఐ విడుదల చేసిన నోటిఫికేషన్ గడువు ముగిసే సమయానికి దాదాపు 3 వేల దరఖాస్తులు అందాయని తెలిసింది. అయితే వీటిలో భారీ సంఖ్యలో నరేంద్ర మోదీ, అమిత్ షా, సచిన్ తెందూల్కర్, ఎంఎస్ ధోని, హర్భజన్ సింగ్, వీరేంద్ర సెహ్వాగ్ పేర్లతో నకిలీలు కూడా వచ్చాయట. దీంతో బిసిసిఐ ఇప్పుడు ఆ ఫేక్ అప్లికేషన్ల పని పట్టేందుకు ప్లాన్ చేస్తోందట. ప్రస్తుతం హెడ్‌కోచ్‌గా ఉన్న రాహుల్ ద్రవిడ్ పదవీకాలం జూన్ చివరి నాటికి ముగుస్తుంది. కొత్త కోచ్ పదవీకాలం జులై 1 నుంచి మొదలై 2027 డిసెంబరు 31 వరకు మూడున్నరేళ్ల పాటు ఉంటుంది. అయితే ఈ కోచ్ పదవి కోసం ఇప్పటికే పలువురు మాజీ దిగ్గజాల పేర్లు వినిపించగా మరోసారి ఇండియన్ ప్లేయరే ఉంటాడా? లేదా విదేశీ కోచ్‌వైపు బిసిసిఐ మొగ్గు చూపుతుందో తెలియాల్సి ఉంది.

## 'స్టార్క్‌కు రూ.25 కోట్లు, నీకు రూ.55 లక్షలేనా?'

### ఐపిఎల్ శాలరీపై రింకు షాకింగ్ రియాక్షన్!

కోల్‌కతా నైట్ రైడర్స్ స్టార్ క్రికెటర్ రింకూ సింగ్ 7 సంవత్సరాలుగా ఇండియన్ ప్రీమియర్ లీగ్ ఆడుతున్నాడు. కొన్ని సీజన్ల నుంచి కోల్‌కతా తరఫున నిలకడగా రాణిస్తున్నాడు. తన పవర్ హిట్టింగ్‌తో కెకెఆర్‌కు చాలా విజయాలు అందించాడు. అయితే తమ ఫ్రాంఛైజీ అతడికి రూ .55 లక్షల జీతం మాత్రమే ఇస్తోంది. ఇదిలా ఉండగా, చాలా ఏళ్ల తర్వాత ఐపిఎల్‌లోకి అడుగుపెట్టిన ఆస్ట్రేలియా పేసర్ మిచెల్ స్టార్క్‌ను అదే ఫ్రాంఛైజీ రూ.24.75 కోట్లకు కొనుగోలు చేసింది. ఇక ఇదే విషయం గురించి రింకూను ఓ ఇంటర్వ్యూలో అడగ్గా దానికి అతడు దిమ్మతిరిగిపోయే రిప్లై ఇచ్చాడు. 'నాకు రూ.50 55 లక్షలు కూడా చాలా ఎక్కువ. ఇంత స్థాయికి వస్తానని కూడా నేను ఎప్పుడూ ఊహించలేదు. అప్పట్లో నా చిన్నప్పుడు రూ.5 10 రూపాయలు వస్తే చాలు అనుకున్నాను. ఇప్పుడు నేను రూ.55 లక్షల రూపాయలు పొందుతున్నాను, ఇది చాలా ఎక్కువ. రూ.55 లక్షల రూ పాయలతో నేను చాలా సంతోషంగా ఉన్నాను, ఇది కూడా నా ద గ్గర లేనప్పుడు, డబ్బు విలువ నాకు అర్థమైంది. నా ఆలోచన ఎ ప్పుడూ ఇలానే ఉంటుంది. నేనెప్పుడూ లెక్కలు కూడా వే సు కోలేదు. అవి లేని రోజులను చవిచూశా. అందుకే డబ్బు వి లువ నాకు తెలుసు.' అంటూ రింకూ చెప్పుకొచ్చాడు. ఇక రిం కూ ఐపిఎల్ కెరీర్ విషయానికి వస్తే, 2017లో ఈ లీగ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన రింకూను పంజాబ్ కింగ్స్ జట్టు కొనుగోలు చేసింది.



## లవ్ టుడే యాక్టర్‌తో ప్రేమలు బ్యూటీ

ప్రేమలు ఘనవిజయం తరువాత, మాలీవుడ్ నటి మమితా బైజు దేశవ్యాప్తంగా సంచలనంగా మారింది. చాలామంది టాలీవుడ్ నిర్మాతలు ఆమెను తమ సినిమాల్లో నటింపజేయడానికి ఆసక్తి చూపుతున్నారు. ఇంతలో నటి ఒక తమిళ చిత్రంకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. లవ్‌టుడే బ్లాక్‌బస్టర్‌తో ఫేమ్ సంపాదించిన నటుడు, దర్శకుడు ప్రదీప్ రంగనాథన్, సుధా కొంగర దగ్గర పనిచేసిన అసిస్టెంట్ డైరెక్టర్ కీర్తిశ్వరన్‌తో కలిసి పనిచేయబోతున్నారు. ఈ ప్రాజెక్టులో హీరోయిన్‌గా మమిత బైజును ఖరారు చేసినట్లు సమాచారం. ఇది రెబెల్ తర్వాత ఆమె రెండవ తమిళ చిత్రంగా గుర్తించబడింది. ఇ ంకా ప్రకటించని ఈ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తుందని పు కార్లు సూచిస్తున్నాయి. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో ప్రకటించే అవకాశం ఉంది.

## రీల్

## మెగాస్టార్... ప్రముఖ జర్నలిస్ట్‌కు సాయం



మన తెలుగు సినిమా దిగ్గజ నటుడు అభిమానులకి అన్నయ్య, సాయం కోరిన వారికి ఆపద్బాంధవుడు అయినటువంటి మెగాస్టార్‌ని ఒక హీరోగానే కాకుండా ఒక వ్యక్తిగా కూడా ఎంతో మంది ఆరాధిస్తారు. ఇప్పుడు వరకు ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్న మెగాస్టార్ వాటిని ఇంకా కొనసాగిస్తూనే వెళ్తున్నారు. సాయం అని వస్తే తెలుగా, తమిళా అని చూడని చిరు తాజాగా అందించిన మరో సాయం విషయం ఇప్పుడు వైరల్ గా మారింది. టాలీవుడ్‌లో ప్రముఖ ఫిలిం జర్నలిస్ట్ అయినటువంటి ప్రభుకి సాయం అందించారు. ఆయన జనరల్ మెడికల్ చెకప్ చేయించుకోగా తనకి గుండెలో 80 శాతం బ్లాకులు ఉన్నాయని తెలిసిందట. దీనితో చిరంజీవిగారిని సంప్రదించగా తాను స్టార్ హాస్పిటల్‌కి కాల్ చేసి ప్రతి చిన్న అంశం అరేంజ్ చేయించి పైసా ఖర్చు ప్రభు సైడ్ నుంచి అవ్వనివ్వకుండా ఎలాంటి బైపాస్ సర్జరీ లేకుండా స్టంట్స్ తో ప్రభు ప్రాణాలు కాపాడిన వారు అయ్యారు. ఇప్పుడు అయన ఆరోగ్యం బాగానే ఉందట. అయితే ఆలస్యం కాకుండా ముందే పసిగట్టడంతో పెద్ద ప్రమాదం తప్పిందని చెప్తున్నారు. మరి ఈ విషయంలో మెగాస్టార్ చిరంజీవి చూపిన చొరవతో తెలుగు సినిమా ఫిల్మ్ జర్నలిస్ట్‌వారు అంతా ఆయనకి ధన్యవాదాలు తెలియజేస్తున్నారు. దీనితో మెగాస్టార్ అభిమానులు తమ హీరో విషయంలో మరోసారి గర్వంగా ఫీలవుతుండగా మెగాస్టార్ చేసిన ఈ కనిపించని మరో సాయం వార్త వైరల్ గా నిలిచింది.

## మాస్, రఫ్ లుక్‌లో అల్లరి నరేష్



టాలెంటెడ్ నటుడు అల్లరి నరేష్ నటించిన చిత్రాలు ఈ ఏడాదిలో రెండు ఆల్రెడీ వచ్చాయి. కింగ్ నాగ్ నా సామిరంగ లో సాలిడ్ సపోర్టింగ్ రోల్‌ని తాను చేయగా నెక్స్ట్ ఆ ఒక్కటీ అడక్కు చిత్రంతో పలకరించాడు. అయితే నటుడుగా తనని తాను మరింత ప్రూవ్ చేసుకునేందుకు అల్లరి నరేష్ బాగా పరితపిస్తూ పలు సీరియస్ సబ్జెక్ట్ లు కూడా చేస్తున్న సంగతి తెలిసిందే. అలా ఇప్పుడు తన నుంచి ఓ సాలిడ్ సినిమా అనౌన్స్ అయ్యింది. బచ్చల మల్లి అంటూ అనౌన్స్ చేసిన ఈ చిత్రం నుంచి నరేష్ పై ఇంట్రెస్టింగ్ ఫస్ట్ లుక్ పోస్టర్ కూడా మేకర్స్ రివీల్ చేయగా డెఫినెట్ గా ఈ రఫ్ లుక్ లో ఉన్నది అల్లరి నరేషేనా అని గుర్తు పట్టలేని విధంగా కనిపిస్తున్నాడు. ఆ రేంజ్ లో తన మాస్ అండ్ రఫ్ గా కనిపిస్తున్నాడని చెప్పాలి. ఇక ఈ చిత్రానికి సుబ్బు మంగదెవ్వి దర్శకత్వం వహిస్తుండగా విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తున్నాడు. అలాగే రాజేష్ దండ, బాలాజీ గుట్ట లు హాస్య మూవీస్ బ్యానర్ పై నిర్మాణం వహిస్తున్నారు.




## ఉప్పలపాటి 'మహా రాగ్ని' టీజర్

ప్రముఖ నిర్మాత చరణ్ తేజ్ ఉప్పలపాటి దర్శకత్వం వహిస్తున్న పాన్ ఇండియా చిత్రం మహారాగ్ని. భారీ బడ్జెట్ తో తెరకెక్కుతున్న ఈ యాక్షన్ థ్రిల్లర్లో బాలీవుడ్ స్టార్ నటులు కాజోల్, ప్రముఖ కొరియోగ్రాఫర్ ప్రభుదేవ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. వీరితో పాటు స్టార్ కాస్టింగ్ నసీరుద్దీన్ షా, సంయుక్త మీనన్, జిషు సేన్ గుప్తా, ఆదిత్య సీల్ తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రం నుంచి తాజాగా టీజర్ విడులైంది. టీజర్ మొదటి షార్ట్ నుంచి చివరి షాట్ వరకు అత్యంత ఉత్కంఠంగా రంజింపజేసింది. ఈ టీజర్ లో ముఖ్యంగా ప్రధాన క్యారెక్టర్ లను ఇంట్రడ్యూస్ చేశారు. ప్రభుదేవా స్వాగ్, యాక్షన్ సీక్వెన్సెస్ అదిరిపోయాయి. బ్యూటీ సంయుక్త మీనన్ చాలా ఇంటెన్స్ పాత్రలో కనిపిస్తున్నట్లు టీజర్ చూస్తే అర్థమవుతుంది. అలాగే నసీరుద్దీన్ షా క్యారెక్టర్ ను కూడా రివీల్ చేశారు. ఇక చివరిగా డైనమిక్ లేడీ, బాలీవుడ్ బ్యూటీ కాజోల్ ఎంట్రీనే అద్భుతంగా ఉంది. జాతరలో ఫైట్ చేసే సీన్, తాను చెప్పే డైలాగ్ గూస్ బంప్స్ తెప్పిస్తున్నాయి. మహా రాగ్ని క్వీన్ ఆఫ్ క్వీన్స్ ట్యాగ్ లైన్ తో వచ్చిన ఈ టీజర్ ప్రేక్షకుల్ని కట్టిపడేసింది. ముఖ్యంగా టీజర్ లో విజువల్ ఎఫెక్ట్స్ అత్యద్భుతంగా ఉన్నాయి అని చెప్పవచ్చు. బాలీవుడ్ బాద్షా షారుఖాన్ నటించిన జవాన్ చిత్రానికి పనిచేసిన జీకే విష్ణు మహారాగ్ని చిత్రానికి సినిమాటోగ్రాఫర్ గా పనిచేస్తున్న విషయం తెలిసిందే. ప్రతి ఫ్రేమ్ లో ఆయన పనితనం గొప్పగా ఆవిష్కరించింది. అలాగే మ్యూజిక్ డైరెక్టర్ హర్షవర్ధన్ రామేశ్వర్ ఈ సినిమాకి వెన్నుముక అనేది టీజర్ చూస్తేనే అర్థమవుతుంది. గూస్ బంప్స్ తెప్పించే బిజిఎం అందించాడు. టీజర్ కట్ చేసిన విధానం కూడా కట్టిపడేసింది. ఈ విషయంలో ఎడిటర్ నవీన్ నూలి పనితనం కనిపిస్తుంది. మరి ముఖ్యంగా చెప్పుకోవాల్సింది ప్రొడక్షన్ వాల్యూస్ అండ్ ఆర్ట్ వర్క్ గురించి. విజువల్స్ చాలా రిచ్ గా ఉన్నాయి. కచ్చితంగా పాన్ ఇండియా ప్రేక్షకులు ఒక అద్భుతాన్ని చూడబోతున్నారని టీజర్ చూస్తేనే అర్థమవుతుంది. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించి మరో బ్రహ్మాండమైన అప్డేట్ రానున్నట్లు సమాచారం.

## పిల్‌పై అత్యవసర విచారణకు సుప్రీం నో

### కేజ్రీవాల్ బెయిల్ పొడిగింపు

**న్యూఢిల్లీ :** ఎన్నికల ప్రచారం నేపథ్యంలో మధ్యంతర బెయిల్‌ను పొడిగించాలని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ పిటిషన్‌పై అత్యవసర విచారణను వెకేషన్ బెంచ్ తిరస్కరించింది. ఈ కేసుపై ఇప్పటికే చర్చలు జరిగాయని, ప్రస్తుతం తీర్పు రిజర్వ్‌లో ఉందని బెంచ్ తెలియజేసింది. కేసు లిస్టింగ్‌కు సంబంధించిన తదుపరి చర్యలపై సిజెఐ నిర్ణయం తీసుకుంటారని పేర్కొంది. కేజ్రీవాల్ తరపు న్యాయవాది వేసిన పిటిషన్‌ను వెకేషన్ బెంచ్ విచారించింది. గత వారం మధ్యంతర బెయిల్ మంజూరుచేసిన బెంచ్ అత్యవసర విచారణ గురించి ఎందుకు ప్రస్తావించలేదని కేజ్రీవాల్ తరపు న్యాయవాది సింఘ్వీని ప్రశ్నించింది. కేజ్రీవాల్ తన పిటిషన్‌లో బరువు తగ్గడం, కిడ్నీ సమస్యలకు సంబంధించిన ముఖ్యమైన వైద్య పరీక్షలు చేయించుకోవడానికి మధ్యంతర బెయిల్‌ను మరో ఏడు రోజుల పాటు పొడిగించాలని కోరారు. మద్యం కుంభకోణం కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై మార్చి 21న కేజ్రీవాల్‌ను ఇడి అధికారులు అరెస్టు చేశారు. తన అరెస్టును సవాల్ చేస్తూ కేజ్రీవాల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దానిపై విచారణ ఆలస్యమవుతుండటంతో ఎన్నికల్లో ప్రచారం నిర్వహించుకునేందుకు మధ్యంతర బెయిల్ ఇవ్వాలని అభ్యర్థించారు. దీంతో సర్వోన్నత న్యాయస్థానం మే 10న మధ్యంతర బెయిల్ మంజూరుచేసింది. జూన్ 2న ఆయన లొంగిపోయి తిరిగి జైలుకు వెళ్లాలని ఆదేశించింది.

### హైకోర్టులో డేరా బాబాకు ఊరట..

## రంజిత్ సింగ్ హత్యకేసులో నిర్దోషిగా తీర్పు

**చండీగఢ్ :** డేరా సచ్చా సౌదా చీఫ్, వివాదాస్పద మతగురువు గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్‌కు పంజాబ్–హర్యానా హైకోర్టులో ఊరట లభించింది. ఓ హత్య కేసులో మంగళవారం అతడిని న్యాయస్థానం నిర్దోషిగా ప్రకటించింది. జస్టిస్ సురేష్వార్ ఠాకూర్, జస్టిస్ లలిత్ బత్రాతో కూడిన డివిజన్ బెంచ్ డేరా బాబా అప్పీల్‌ను పరిశీలించింది. వాస్తవానికి ఇప్పటికే పంచ్‌కులలోని సిబిఐ కోర్టు ఒక రేప్, జర్నలిస్టు రామ్ చందర్ ఛత్రపతి, డేరా నిర్వాహకుడు రంజిత్ సింగ్ హత్య కేసుల్లో బాబాను నిందితుడిగా పేర్కొంటూ తీర్పును ఇచ్చింది. దీనిని డేరాబాబా హైకోర్టులో సవాలు చేశారు. వీటిల్లో తాజాగా రంజిత్ సింగ్ హత్యకేసులో నిర్దోషిగా పేర్కొంటూ తీర్పు వచ్చింది. ఇక అత్యాచారం, జర్నలిస్టు ఛత్రపతి హత్య కేసుల్లో న్యాయస్థానం ఎటువంటి నిర్ణయం వెల్లడించలేదు. ప్రస్తుతం అతడు రోహ్‌తక్‌లోని సునారియా జైల్లో ఉంటున్నాడు. ఈ కేసులో ఆయనతోపాటు మరో నలుగురు సహ నిందితులను నిర్దోషులుగా ప్రకటించింది. డేరా బాబాకు అనుచరుడిగా ఉన్న రంజిత్ సింగ్ 2002లో హత్యకు గురయ్యారు. ఆయన ఆశ్రమంలో మహిళలపై జరుగుతోన్న లైంగిక వేధింపులను పేర్కొంటూ రాసిన ఓ లేఖ అప్పట్లో కలకలం రేపింది. అయితే, అది ఆశ్రమ మేనేజర్ రంజిత్ సింగ్ రాసినట్లు డేరా బాబా అనుమానించారు. దీంతో ఆయనను హత్య చేసేందుకు డేరా బాబా కుట్రపన్నినట్లు సిబిఐ పేర్కొంది. సిర్సా కేంద్రంగా డేరా సచ్చా సౌదా నిర్వహిస్తున్న గుర్మీత్ దైవత్వం పొందే మార్గమంటూ దాదాపు 400 మంది శిష్యులను వంధ్యులుగా మార్చారన్న ఆరోపణలు గతంలో వెల్లువెత్తాయి. పలువురు సాధ్వీలపై అత్యాచారానికి పాల్పడ్డారని, తిరస్కరించిన వారిని హత్య చేసేవారని చెబుతుంటారు. ఇలా వివాదాస్పద గురువుగా ఉన్న గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ ఇద్దరు సాధ్వీలపై అత్యాచారానికి పాల్పడ్డారని తేలడంతో 2017లో జైలుకు వెళ్లారు. ఆ కేసులో సిబిఐ కోర్టు ఆయనకు 20ఏళ్ల జైలు శిక్ష విధించింది.

### వారం తర్వాత కేంద్రంలో

## అవతార పురుషుడు పోయి 'ఇండియా' కూటమి వస్తుంది : లాలూ

**పాట్నా :** వారం రోజుల తర్వాత 'ఇండియా' కూటమి కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని రాష్ట్రీయ జనతాదళ్ పార్టీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ అన్నారు. సాక్షాత్తూ ఆ దేవుడే తనను పంపాడని ప్రధానమంత్రి నరేంద్రమోదీ చెప్పుకోవడాన్ని ఆయన ప్రస్తావిస్తూ తీవ్ర విమర్శలు చేశారు. లాలూ ప్రసాద్ యాదవ్ మంగళవారంనాడు పాట్నాలో మీడియాతో మాట్లాడుతూ, జూన్ 4 న 18వ లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడనున్న పూర్వరంగంలో పై విధంగా వ్యాఖ్యానించారు. ''మోదీ తనను తాను దేవుడి అవతారంగా ఆయన ప్రతినిధిగా చెప్పుకున్నారు, తాను భౌతికవ్యక్తిని కాదని, దైవ దూతననీ అంటున్నారు, ఆ ఫలితాలను మనం త్వరలో తెలుసుకుంటాం. ప్రధామంత్రి నరేంద్ర మోదీ ఇప్పుడు వెళ్ళిపోయారు, 'ఇండియా' కూటమి జూన్ 4 నుండి వస్తుంది'' అన్నారు. తనను దేవుడు పంపించాడని ఇటీవల ఒక న్యూస్ ఛానల్ ఇంటర్వ్యూలో నరేంద్రమోదీ ప్రకటించుకోవడంతో లాలూ ప్రసాద్ ఆయనపై ఈ విమర్శలు చేశారు. ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వస్తే, రాజ్యాంగాన్ని మార్చేయాలనే ఆలోచనలో ఉందనీ, రిజర్వేషన్లను రద్దు చేయాలనే ఉద్దేశంతో ఉందనీ అంతకుముందు లాలూ ప్రసాద్ విమర్శించారు. ఎక్స్ వేదికగా లాలూ ఒక పోస్టింగ్‌పెడుతూ, ''మన రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్‌ను తృణీకరించి నిరసనభావంతో చూస్తున్న బిజెపి, ఆ పార్టీ నాయకుడూ రాజ్యాంగం, రిజర్వేషన్ల రద్దు గురించి మాట్లాడుతున్నారు, అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించినందువల్లనే మోదీజీ, ఆయన కంపెనీ రాజ్యాంగాన్ని అసహ్యించుకుంటున్నది'' అని విమర్శించారు.

# బిజెపి 200 సీట్లు దాటదు : ఖర్గే




**చండీగఢ్ :** బిజెపి చేస్తున్న '400 పార్' (400లకు పైగా సీట్లు) నినాదం అర్థం లేనిదని, ఆ పార్టీ లోక్‌సభ ఎన్నికల్లో 200 సీట్లు కూడా దాటదని ఎఐసిసి అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే అన్నారు. పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల కంటే బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ సీట్లు తగ్గిపోతాయని, కాంగ్రెస్, ఇండియా కూటమి లబ్ధి పొందనున్నాయని తెలిపారు. వారి సీట్లు తగ్గుతున్నప్పుడు, మావి పెరుగుతున్నప్పుడు 400లకుపైగా సీట్లు అనే నినాదాన్ని మరిచిపోవాలని, బిజెపి కనీసం ప్రభుత్వాన్ని కూడా ఏర్పాటు చేయలేదని అన్నారు. తమిళనాడు, కేరళ బిజెపి ఉనికి లేదని, తెలంగాణ, కర్నాటకలో అంత బలంగా లేదన్నారు. మహారాష్ట్రలో కూడా ఎన్‌డిఎ బలహీనంగా ఉందని, పశ్చిమ బెంగాల్, ఒడిషాలో తీవ్ర పోటీ నెలకొందని, ఏవిధంగా ఆ పార్టీకి 400 సీట్లు వస్తాయని ఖర్గే ప్రశ్నించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమి తరువాత ఖర్గే తన ఉద్యోగం కోల్పోతారని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలను ప్రస్తావించగా, తాను రాజకీయాల్లో చేరింది ఉద్యోగం చేయడానికి కాదని, ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశ్యంతోనే తాను రాజకీయాలలో చిన్నతనం ఉండి ఉన్నానని ఖర్గే సమాధానమిచ్చారు.దాదాపు మోదీ వయస్సు అంత కాలంగా తాను రాజకీయాల్లో కొనసాగుతున్నానని సమాధానమిచ్చారు. జూన్ 4 తరువాత అమిత్‌షా ఆయన ఉద్యోగం గురించి చూసుకోవాలని ఎద్దేవా చేశారు. మోదీ ఎక్కువ మాట్లాడి తక్కువ పని చేస్తారని విమర్శించారు. బిజెపి వంద మాటలకు మన్మోహన్ సింగ్ చేసిన ఒక్క పనితో సమానమని అన్నారు. మన్మోహన్‌సింగ్ హయాంలో కేంద్ర ప్రభుత్వం రైతులకు రూ.72వేల కోట్ల రుణమాఫీ చేసిందన్నారు. పంజాబ్‌లో మత్తు పదార్థాల సమస్య పంజాబ్ భవిష్యత్తు కోసం పెను సవాలుగా మారిందన్నారు. పంజాబ్‌లో యువత నిస్పృహతో ఉన్నారని చెప్పారు. దీని కారణంగా రోజురోజుకు శాంతి భద్రతల సమస్య క్షీణిస్తున్నదని, తమ పిల్లలు డ్రగ్స్ బారిన పడొద్దనే ఉద్దేశ్యంతో రైతుల తమ భూములను అమ్మి పిల్లలను విదేశాలకు పంపిస్తున్నారని చెప్పారు.

**జాతీయ భద్రతతో మోదీ ఆటలు**

**న్యూఢిల్లీ:** అగ్నిపథ్ పథకం పేరుతో మోదీ ప్రభుత్వం జాతీయ భద్రతతో ఆటలు ఆడుతోందని ఎఐసిసి అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే విమర్శించారు. ఈ మేరకు ఎక్స్‌లోని తన ఖాతాలో పోస్ట్ చేశారు. ఇండియా కూటమి అధికారంలోకి రాగానే అగ్నిపథ్‌ను రద్దు చేస్తామని, దేశ భక్త యువకులకు న్యాయం చేస్తామని అన్నారు. వచ్చే పదేళ్ళలో దేశ భద్రత విషయంలో రాజీపడే విధంగా అగ్నిపథ్ ఉన్నదని, ఈ పథకం జాతీయ భద్రతకు ముప్పు అని అన్నారు. అగ్నిపథ్ పథకాన్ని రుద్దడం ద్వారా మోదీ దేశ భద్రతతో ఆటలు ఆడుకున్నారని అన్నారు. ఈ పథకం ద్వారా సైన్యంలో నియామకాలు ఏటా 75వేల నుండి 46 వేలకు పడిపోయాయన్నారు. దీనిపై మిలిటరీ వ్యవహారాల శాఖ ఆందోళన వ్యక్తం చేస్తున్న విషయం నిజమా కాదా? అని ఖర్గే ప్రశ్నించారు.

## దంతేవాడలో 15 మంది మావోయిస్టుల అరెస్ట్

**దంతెవాడ :** ఛత్తీస్‌గఢ్‌లోని దంతేవాడ జిల్లాలో ఐఇడి పేలుడు ఘటనలో 15 మంది మావోయిస్టులు, వారిలో ఏడుగురు మహిళలు పట్టుబడ్డారని పోలీసులు మంగళవారం తెలిపారు. ఆదివారం భద్రతా దళాలు సెర్చ్ ఆపరేషన్‌లో ఉన్నప్పుడు నక్సలైట్లు పేలుడుకు పాల్పడ్డారని, అయితే ఎవరికీ గాయాలు కాలేదని వారు తెలిపారు. గీడం పోలీస్ స్టేషన్ పరిధిలోని గుమల్నార్ గ్రామ సమీపంలో మావోయిస్టులు పట్టుబడ్డారు, అక్కడ జిల్లా రిజర్వ్ గార్డ్ (డిఆర్‌జి), బస్తర్ ఫైటర్స్ సంయుక్త బృందం, రెండు రాష్ట్ర పోలీసు విభాగాలు ఆదివారం సెర్చ్ ఆపరేషన్‌లో ఉన్నాయని దంతెవాడ డిఎస్‌పి ఉన్నతి ఠాకూర్ విలేకరులతో అన్నారు. అరెస్టయిన క్యాడర్లలో చాలా మంది చట్టవిరుద్ధమైన మావోయిస్టు ఫ్రంటల్ దుస్తుల్లో చురుకుగా ఉన్నారని ఆమె చెప్పారు. గుమల్నార్, ముస్తాల్నార్ గ్రామాల అడవిలో శనివారం పెట్రోలింగ్ బృందం ఆపరేషన్ ప్రారంభించిందని, ఆదివారం సాయంత్రం 4.30 గంటలకు మావోయిస్టులు భద్రతా సిబ్బందిని లక్ష్యంగా చేసుకుని ఐఇడి పేలుడుకు పాల్పడ్డారని ఆమె చెప్పారు. పేలుడులో భద్రతా సిబ్బంది క్షేమంగా ఉన్నారని ఆమె తెలిపారు. పేలుడు తర్వాత, కొంతమంది అనుమానితులు సంఘటన స్థలం నుండి తప్పించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని, అయితే భద్రతా సిబ్బంది వారిని వెంబడించి, వారిలో 15 మందిని చుట్టుముట్టారని అధికారి తెలిపారు.

# మోదీ ప్రజావ్యతిరేకి

### మతం పేరిట ప్రజలను తప్పుదోవపట్టిస్తున్నారు: ప్రియాంకాగాంధీ



**ఉనా :** ప్రధాని నరేంద్ర మోదీ ప్రజా వ్యతిరేకి అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ వాద్రా అన్నారు. మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు మతంపేరిట ప్రజలను తప్పుదోవపట్టిస్తున్నారని మండిపడ్డారు. అవసరమైన సమయంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ తన ఆభరణాలను దేశానికి ఇచ్చేశారని గుర్తుచేశారు. మోదీ మాత్రం కాంగ్రెస్ ప్రజల నుంచి దోచుకుటుందని వ్యాఖ్యానిస్తున్నారన్నారు. ఇలాంటి భాష వాడడం దేశ ప్రధానికి ఏ మాత్రం తగదన్నారు. మోదీ తనకుతానుగా భగవంతుడిగా భావించుకోవడం ప్రారంభించారని ఎద్దేవా చేశారు. మతం పేరితో ఓట్లు రాబట్టాలని చూస్తున్నారని, ప్రజలు ఏ మాత్రం తప్పుదోవకు గురికావద్దన్నారు. హిమాచల్ ఉనా జిల్లా గాగ్రేట్‌లో ఏర్పాటు చేసిన బహిరంగసభలో పాల్గొని ప్రసంగించారు. హమీర్‌పూర్ లోక్‌సభ, గాగ్రేట్ అసెంబ్లీ ఉప ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతుగా ప్రియాంక ప్రచారం నిర్వహించారు. సాధారణంగా బిజెపి ప్రజావ్యతిరేకి అని, ప్రత్యేకించి యువత వ్యతిరేక అని ఆమె ఆరోపించారు. మోదీ ప్రభుత్వం అమెరికా యాపిల్స్‌పై దిగుమతి సుంకాన్ని తగ్గించిందని పేర్కొన్నారు. విపత్తు ప్రభావం పడిన హిమాచల్‌కు ఎలాంటి నిధులు ఇవ్వలేదని కేంద్ర సర్కార్‌పై మండిపడ్డారు. కానీ, ధనవంతులైన పారిశ్రామికవేత్తలకు రూ. 16 లక్షల కోట్లు మాఫీ చేసిందని విమర్శించారు. గత ఏడాది సంభవించిన వర్ష విపత్తుపై ప్రియాంక మాట్లాడుతూ కాంగ్రెస్, బిజెపి మధ్య వ్యత్యాసం చూశామన్నారు. విపత్తుల సమయంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అండగా నిలిచారన్నారు. ప్రజల కోసం కాంగ్రెస్ పనిచేసిందని, అధికారం, డబ్బు కోసం తహతహలాడలేదన్నారు. అది తమ బాధ్యత అని చెప్పారు. బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం హిమాచల్‌లో రుతుపవన విపత్తును జాతీయ విపత్తు, ప్రత్యేక ప్యాకేజీ గానీ ఇవ్వలేదన్నారు. పైగా ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని కూల్చేందుకు యత్నించిందన్నారు.

### వారం తర్వాత నవీన్ పట్నాయక్

## మాజీ ముఖ్యమంత్రే : అమిత్ షా జోస్యం

**భద్రక్/జైపూర్ :** వారం రోజుల తర్వాత ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ మాజీ ముఖ్యమంత్రిగా మారిపోతారని కేంద్ర హోంశాఖామంత్రి అమిత్ షా జోస్యం చెప్పారు. భద్రక్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ఛాంద్‌బలిలో మంగళవారంనాడు జరిగిన ఎన్నికల ర్యాలీలో అమిత్ షా మాట్లాడుతూ, ఒడిశాలో బిజెపియే తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందనీ, బిజెపికి అసెంబ్లీలో 147 సీట్లకుగాను 75 స్థానాల్లో గెలుస్తుందనీ విశ్వాసం వ్యక్తం చేశారు. అదేవిధంగా ఒడిశాలో ఉన్న 21 లోక్‌సభ స్థానాలకుగాను 17 స్థానాలను బిజెపియే గెలుచుకుంటుందని చెప్పారు. ''జూన్ 4వ తేదీని రానివ్వండి, నవీన్ బాబు ఇంకెన్నో రోజులు ఆ పదవిలో ఉండరు, ఆయన మాజీ ముఖ్యమంత్రిగా మారిపోతారు, బిజెపి ఒడిశాలో 17 లోక్‌సభ సీట్లూ, 75 అసెంబ్లీ స్థానాలను గెలుచుకుంటుంది'' అని ధీమా వ్యక్తం చేశారు. ఒడిశాలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు ఏకకాలంలో జరుగుతున్నాయి. రాబోయే ఒడిశా ముఖ్యమంత్రి ఒరియా భాషను చాలా చక్కగా, స్వచ్ఛంగా మాట్లాడతారనీ, చాలా బాగా ఒరియా భాషను అర్థం చేసుకోగలరనీ, ఒడిశా భాషను, సంస్కృతినీ, సంప్రదాయాలను చాలా చక్కగా రాబోయే ముఖ్యమంత్రి అర్థం చేసుకోగలరనీ అన్నారు. ''మీరు గనుక కమలం గుర్తుకు అనుకూలంగా ఓటువేసి ఒక ఆఫీసర్ స్థానంలో ఆయన బదులు జన్‌సేవక్‌ను రాష్ట్రంలో అధికారంలోకి తీసుకువస్తే ఇక ఒక తమిళ బాబు వెనక నిలబడి ప్రభుత్వాన్ని నడిపగలడా?'' అని అమిత్ షా ప్రశ్నించారు. ముఖ్యమంత్రి పట్నాయక్ సన్నిహిత మిత్రుడు, బిజెడి నాయకుడు, ఒడిశాలో నెంబర్–2 స్థానంలో ఉన్న వి.కె.పాండియన్‌ను అమిత్ షా పరోక్షంగా ప్రస్తావించి ఈ విమర్శలు చేశారు. పనుల కోసం లక్షలాదిమంది యువకులు రాజస్థాన్ నుండి ఇతర రాష్ట్రాలకు వలసలు వెళుతున్నారనీ, బిజెపి గనుక ఒడిశాలో ప్రభుత్వం వస్తే రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు చేస్తామనీ, యువకులు ఉద్యోగాలకోసం ఇతర రాష్ట్రాలకు వెళ్ళాల్సిన అవసరం ఉండదనీ అన్నారు. అదేవిధంగా జైపూర్‌లో కూడా మరో ఎన్నికల ర్యాలీలో మాట్లాడుతూ, కాంగ్రెస్‌పార్టీ పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీరు గురించి మాట్లాడకుండా దాటవేసస్తోందనీ, ఎందుకంటే పాకిస్థాన్‌ను చూసి కాంగ్రెస్‌పార్టీ భయపడుతోందనీ అమిత్ షా విమర్శించారు. ఆక్రమిత కశ్మీరును తిరిగి వెనక్కు తీసుకువస్తామని ఆయన వాగ్దానం చేశారు.